18-10Pg1exHMNWJQEKV 1GNT_18-10Pg1exHMNWJQEKV.qxd 10/18/2025 12:29 AM Page 1

ఫన్‌డే
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-10-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 257 పేజీలు: 12 వెల: 6.50

బీహార్‌లో మళ్లీ గెలుస్తాం: అమిత్ షా

9లో

అమెరికాలో మిన్నంటిన దీపావళి వేడుకలు



సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలిచిన విద్యార్థులతో సీఎం చంద్రబాబు

## భవిష్యత్తుకు బాటలు సంస్కరణలే

### 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' పోటీల విజేతలకు బహుమతులు అందించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ అక్టోబరు 17, ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్తును మార్చేది సంస్కరణలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా.. సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సూపర్ జీఎస్టీసూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలు శుక్రవారం ముఖ్యమంత్రిని రాష్ట్ర సచివాలయంలో కలిశారు. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 17మంది విద్యార్థినీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు సీఎం చంద్రబాబు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీసంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకున్నారా?అని వారిని సీఎం అడిగారు. నిత్యావ >>2



మీడియాతో చత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్

## వనం వీడి జనంలోకి..

### మావోయిస్టు అగ్రనేత ఆశన్న సహా

# 218 మంది లొంగుబాటు



శుక్రవారం లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత ఆశన్న

లొంగిపోయినవారికి మూడేళ్లపాటు ఆర్థిక సాయం: చత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్

జనజీవనంలోకి వచ్చిన వారికి సహకరిస్తాం: హోంమంత్రి విజయ్‌శర్మ



శుక్రవారం జగ్దల్‌పూర్‌లో ఆయుధాలు వదిలి లొంగిపోయిన మావోయిస్టులు

ఆయుధాలు వీడినా ఉద్యమ పంథా మారదు

లొంగిపోయే వారు నాకు ఫోన్ చేస్తే సహకరిస్తా: ఆశన్న

**చర్ల, అక్టోబరు17, ప్రభాతవార్త:** వనం వీడి జనంలోకి వచ్చిన మావో యిస్టు అగ్రనేత తక్కెళ్లపల్లి వాసుదేవరావు (ఆశన్న) రూపేస్ సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యులు రాజమన్, రనిత, బాస్కర్, మీనా ప్రసాద్‌తో సహ వివిధ కేడర్లకు చెందిన 218 మావోయిస్టులు ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి అరుణ్ సావో, హోం మంత్రి విజయ్ శర్మ, డిజిపి అరుణ్ దేవ్ గౌతమ్ సమక్షంలో శుక్రవారం లొంగిపోయారు. బీజాపూర్ కాంకేర్‌లో ఆయుధాలతో లొంగిపోయిన వారందరినీమూడు ప్రత్యేక బస్సుల్లో జగ్దల్‌పూర్ తరలించారు. ఆశన్నకు ప్రత్యేక వాహనం సమకూర్చారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో >>2

# గనులపై రూ.3320కోట్ల ఆదాయార్జన లక్ష్యం

### వడ్డెర్లకు మైనింగ్ లీజుల విధానం సిద్ధం చేయండి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో లభ్యమవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని గనులశాఖ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. గనుల తవ్వకాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ ఆధారిత టెక్నాలజీతో విశ్లేషించాలని తేల్చిచెప్పారు. వడ్డెర్లకు 15 శాతం మేర మైనింగ్ లీజుల విధానం సిద్ధం చేయాలని సూచించారు. సచివాలయంలో గనులశాఖ, ఉచిత ఇసుక విధానంపై ఆ శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.3320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టు కున్నట్టు అధికారులు సీఎంకు వివరించారు. గతంతో పోలిస్తే 34 శాతం మేర అదనంగా గనులశాఖ నుంచి ఆదాయం వచ్చే అవ కాశం ఉందని తెలిపారు. మాంగనీస్ లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికి పైగా ఆదాయం వస్తోందని అధికారులు తెలపగా రాష్ట్రంలో ఉన్న మినరల్ వెల్త్ విలువను అంచనా వేయాలని చంద్రబాబు సూచించారు. ఒడిశా లాంటి రాష్ట్రాల్లో వాల్యూ ఎడిషన్ ద్వారా ఎక్కువగా ఆదాయాన్ని పొందుతు న్నారని రూ.50,000కోట్ల ఆదాయం ఖనిజాల నుంచే వస్తోందని తెలిపారు. ఏపీలోనూ అందుకు తగిన విజన్ ప్లాన్ తయారుచేసి విలువ జోడిస్తే రూ.20 నుంచి రూ.30 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న 6500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు. గనులకు ఇచ్చిన పర్మిట్లు, జరిగిన తవ్వకాలు ఎంత అనేది ఎప్పటికప్పుడు



హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ రమేశ్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

## హైకోర్టు జడ్జిగా జస్టిస్ రమేష్ ప్రమాణం

**విజయవాడ,అక్టోబరు17, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా జస్టిస్ దొనాడి రమేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈమేరకు శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ జస్టిస్ రమేశ్ చే న్యాయమూర్తిగా ప్రమాణం చేయించారు. గతంలో ఎపి హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తూ జస్టిస్ రమేశ్ అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. మరలా ఎపి హైకోర్టుకు న్యాయమూర్తిగా తిరిగి బదిలీ కావడంతో ఆయనతో చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ న్యాయమూర్తిగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు,హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాల పాటి శ్రీనివాస్, అదనపు >>2

## రాష్ట్రంలో 1.58 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య భరోసా

**విజయవాడ,అక్టోబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** పేదలకు మెరుగైన వైద్యసేవలు చేరువ చేసేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీఎం-జేఎవై), ఎన్టీఆర్ వైద్యసేవ ఆరోగ్య భీమా పథకాలకు అర్హత పొందిన కుటుంబాలు ఆంధ్రప్రదేశ్‌లో 1.58 కోట్లు ఉన్నాయని జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏ) వెల్లడించింది. రాష్ట్రంలో ఏబీపీఎం-జెఏవై కింద 78,65,341 కుటుంబాలు ఉంటే, ఎన్టీఆర్ వైద్య సేవకింద 90,30,658 కుటుంబాలు ఉన్నట్లు పేర్కొంది. భోపాల్‌లో నిర్వహించిన పీఎం-జేఏవై,ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం)జాతీయ సమీక్షలో 2024-25వార్షిక నివేదికను గురువారం విడుదల చేశారు. ఈకీలక పథకాల ద్వారా దేశంలో ఆరోగ్యరంగం బలోపేతానికి >>2

## శనగ రైతును ఆదుకుంటాం



### వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడఅక్టోబరు 17, ప్రభాతవార్తప్రతినిధి:** రబీ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా శనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని మంత్రి భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా రైతుల పట్ల కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. రైతు అభ్యున్నతే మా లక్ష్యం. ప్రతి రైతు అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన విత్తనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు వ్యవసాయ శాఖ ఇప్పటికే జిల్లాల వారీగా అంచనా వేస్తోందని, ప్రతి రైతు అవసరాలకు సరిపడే విత్తనాలు అందుబాటులో ఉండేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. రైతు కష్టపడి పండించే ప్రతి గింజ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమవుతుంది. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని అన్నారు. రైతు కోసం కొత్త ఆలోచనలు, సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయం లాభదాయకంగా మారాలనే ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు ప్రత్యేక దిశానిర్దేశాలు ఇచ్చారు. రైతు ఆదాయాన్ని పెంచే ప్రతి కార్యక్రమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది అని మంత్రి పేర్కొన్నారు.

## చేయి దాటిన పసిడి

### రూ. 1.35 లక్షలు పైనే

### కిలో వెండి రూ. 2.03 లక్షలు



### బులియన్ మార్కెట్‌పై ధన్‌తేరాస్ ఎఫెక్ట్

**ముంబయి, అక్టోబరు17:** దేశవ్యాప్తంగా బంగారం ధరల్లో ఎక్కడా తగ్గుముఖం కనిపించడంలేదు. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 కేరట్ల బంగారం 1.35 లక్షలు దాటింది. శుక్రవారం పదిగ్రాముల మేలిమి బంగారంధర రూ.1,35,250కిచేరింది. 22 కార్యట్ల ఆభరణాల బంగారం పదిగ్రాములు 1,21,725కి పెరిగింది. కిలో వెండి రూ.1.81 లక్షలకు పెరిగింది.అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి యుఎస్ చైనా వాణిజ్య ఉద్రిక్తతలు, ఇండో అమెరికా వాణిజ్య ఒప్పందంలో జాప్యం, భౌగోళిక ఉద్రిక్తతలు, వంటివాటికితోడు ధంతేరస్, పెళ్లిళ్ల సీజన్ >>2

## కౌలు రైతులకూ విశిష్ట గుర్తింపు

### భూములున్న రైతులతో సమానంగా ప్రయోజనాలు

**విజయవాడ,అక్టోబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కౌలురైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీని ద్వారా భూములున్న రైతులతో పాటే వీరు కూడా వివిధ రాయితీ పథకాలు,ప్రయోజనాలు పొందే వీలుంటుంది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం భూములున్న రైతులకే విశిష్టగుర్తింపు సంఖ్య ఇసో_ంది. వెబ్ లాండ్ ఆధారంగా రైతుల భూముల వివరా లను అనుసంధానం చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలకు అనుగుణంగా వ్యవ సాయశాఖ కౌలు రైతుల గుర్తింపుసంఖ్యజారీపై దృష్టిపెట్టింది. ఇవ ్ప టి కేవ లం న వూ వే శా లు >>2

## ఉప్పాడ మత్స్యకారుల కోసం

# 100 రోజుల ప్రణాళిక



### వారి జీవితాల్లో మార్పుతెస్తాం

### చేపలవేట సామర్థ్యం పెంచుతాం:డి సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,అక్టోబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారుల జీవితాల్లో మెరుగైన మార్పులు తీసుకువచ్చేందుకు పవన్ కల్యాణ్ అధికార యంత్రాంగం, శాస్త్రవేత్తలతో చర్చించారు. క్యాంపు కార్యాలయంలో 100 రోజుల ప్రణాళిక అమలుపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో పాటు సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, విశాఖ శాస్త్రవేత్తలతో సమీక్ష నిర్వహించారు.మత్స్యకారులలో చేపల వేట సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు ఉన్న అవకాశాలు, మత్స్యకారులకు అదనపు ఆదాయం సముపార్జనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో పవన్ కల్యాణ్ సుదీర్ఘంగా చర్చించారు. కాకినాడ పర్యటన సందర్భంగా పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమీక్షలో చర్చించారు. ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో సదుపాయాలు కల్పించడంతోపాటు వారి జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ఉన్న అవకాశాలు అన్వేషించాలని సూచించారు. ముఖ్యంగా చేపల వేటలో మెలకువలు నేర్పడం, నైపుణ్యం పెంచడంతోపాటు తగిన సౌకర్యాల కల్పనపైనా దృష్టి సారించాలని తెలిపారు. వీటితోపాటు మత్స్య సంపదను పెంపొందించడం తదితర అంశాలపై విశాఖ సీఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయ్ కె. కిజాకుడాన్ సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఆయన సూచనలను అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కాకినాడ జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ, మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ బిందు మాధవ్, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు. **100 రోజుల సమయం ఇవ్వాలి:** ఇటీవల ఉప్పాడలో పర్యటించిన పవన్ కల్యాణ్ ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్‌ను కచ్చితంగా నిర్మిస్తామని హామీఇచ్చారు. ఇందుకు కేంద్రం >>2

## ఎక్కడిది గొంగళి అక్కడే!

### విజయనగరం జిల్లాలో కార్యాచరణ అంతంతమాత్రమే!

### గుణపాఠాలు నేర్చుకోని టిడిపి నేతలు!

### తేలని పార్టీ అధ్యక్షుని ఎంపిక

**విజయనగరం,అక్టోబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** పూర్వాశ్రమంలో ఎదురైన అనుభవాల నుంచి తెలుగుదేశం పార్టీ గుణపాఠాలు నేర్చుకోవడం లేదనిస్తుంది. పావలా పనికి ముప్పావలా ప్రచారం చేసుకుంటూ కాలక్షేపం చేస్తోంది గానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితికి అనుగుణంగా అడుగులు వేయలేకపోతోంది. ఇందుకు ఇప్పటికే అనేకానేక సంఘటనలు ఆవిష్కృతమయ్యాయి. 'ప్రజలే దేవుళ్ళు-కార్యకర్తలే పునాది' అనే నినాదం కేవలం సినిమా డైలాగ్ లాగానే మిగిలిపోయింది తప్పించి వాస్తవానికి ఎంతో దూరంగా ఉందనేది నిర్వివాదాంశం. ప్రస్తుత సో కాల్డ్ ఎమ్మెల్యేలు, మంత్రుల్లో చాలామంది 'తప్పించుకు తిరుగు వాడు ధన్యుడు సుమతి' అనే ట్రెపులో ఇటు పిలిస్తే అటు, అటుపిలిస్తే ఇటు చూస్తూ ప్రజలు, క్యాడర్‌తో డిస్టెన్స్ మెయింటెన్ చేస్తున్నారనేది కూడా నిత్యానుభవమే. తమ పరిస్థితి ఇలా తయారైందేంటి చెప్మా అని కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు నిర్వేదంతో బాధ పడుతూ ఓ పనీ లేక, ఓ పదవీ లేక, చేతికి చిల్లి గవ్వ కూడా వచ్చే అవకాశం రాక "ఎవడి గోల వాడిదే" అనే చందంగా ఉన్న ప్రస్తుత నేపథ్యంలో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ' డామిట్ మళ్ళీ కథ అడ్డం తిరిగింది' అని నసుక్కుంటూ అంత్మరథనానికి గురవుతున్నారు.

**పార్టీ ఆఫీసు ఊసే లేదు:** జిల్లా పార్టీ ఆఫీసు మార్చేస్తున్నామంటూ ఆ మధ్య పార్టీ నాయకులు నానా యాగీ చేశారు. పెళ్ళి ఊరేగింపుకెళ్ళినట్టు పదుల సంఖ్యలో నాయకులు దజనుకి పైగా కార్లు, బళ్ళేసుకుని ఊరి చివర జాగాలో ఫొటోలకి ఫోజులిచ్చి 'అదిగో పులి అంటే..ఇదిగో తోక' అనే చందంగా అంతా అయిపోయింది. ఇక రేపో మాపో కొబ్బరికాయ కొట్టేసి సాధ్యమైనంత త్వరలోనే బిల్డింగ్ కూడా లేపేస్తామని ఊదరగొట్టారు. కానీ వాస్తవానికి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. అధికారమూ ఉంది.అర్ధ బలం, అంగ బలం కూడా ఉంది. పైగా ఎమ్మెల్యేలు, సచివులు కూడా స్వంత >>2



## 51లక్షల మె.ట ధాన్యం కొనుగోలు లక్ష్యం

### మంత్రి నాదెండ్ల

**విజయవాడ, అక్టోబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో2025-26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 51లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం >>2



శుక్రవారం గనులు శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

# చేయి దాటిన పసిడి

>> వంటివి పసిడికి మరింతగా ధరలు పెంచాయి. వచ్చే ఏడాదినాటికి పదిగ్రాముల బంగారంధరలు రూ.1.50 లక్షలవరకూ ఉంటుందని బులియన్‌నిపుణులు అంచనాలువేస్తున్నారు. రానున్న కాలంలో 30శాతంవరకూ పెరిగే ప్రమాదం లేకపోలేదు. సెంట్రల్ బ్యాంకులు భారీగా బంగారం కొనుగోళ్లు, అమెరికా ఫెడ్‌రిజర్వు రేట్‌కట్స్ అంచనాలు వంటివి బంగారం ధరలను అమాంతం పెంచేసాయి. ఎంసిఎక్స్‌లో గోల్డ్ పదిగ్రాములకు లక్ష దాటేసింది.

ఔన్స్ బంగారం అంతర్జాతీయ మార్కెట్‌లో 4180గా ఉంది. 2025లో సెంట్రల్ బ్యాంకులు సుమారు 1000కిపైగా టన్నులు బంగారంకొంటాయన్న అంచనాల నేపథ్యంలోబంగారం ధరలు మరింత పెరిగాయి. ఇటిఎఫ్‌ల్లో కూడా గోల్డ్ ఇటిఎఫ్‌లు రికార్డుస్థాయిలో ఉండటం ఇన్వెస్టర్ల ఆసక్తిని చూపిస్తోంది. గత ఏడాది లక్షలోపే ఉన్న పదిగ్రాముల బంగారం ఈఏడాది తొలినాళ్లనుంచి గణనీయంగాపెరుగుతూ వచ్చింది. 50శాతం వరకూ ధరలు పెరిగినట్లు బులియన్ నిపుణులుసైతం హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా వెండిధరలు కూడా హైదరాబాద్‌లో గణనీయంగాపెరిగాయి. కిలో వెండి మూడువేల రూపాయలు పెరిగి 2.03లక్షలకు చేరినట్లు అంచనా.


## ఇన్ఫోసిస్‌లో ఉన్నంతమాత్రాన సర్వజ్ఞులా..

### ఇన్ఫోమూర్తి వ్యాఖ్యలపై సీఎం సిద్దరామయ్య గరంగరం

**బెంగళూరు, అక్టోబరు 17:** కర్ణాటకలో జరుగుతున్న సోషల్ అండ్ ఎడ్యుకేషన్ సర్వేకు దూరంగా ఉండాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి, రచయిత్రి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి నిర్ణయం తీసుకోవడంపై ముఖ్యమంత్రి సిద్ధారామయ్య శుక్రవారంనాడు ఘాటుగా స్పందించారు. తాము చేపట్టినది వెనుకబడిన తరగతుల సర్వే కాదని, జనగణన అని చెప్పారు. అది వాళ్లకే వదిలిపెట్టాను. ఇది వెనుకబడిన తరగుతల సర్వే కాదు. వాళ్లకి అర్థం కాకపోతే నేను ఏం చేయగలను ఇన్ఫోసిస్‌లో ఉన్నంత మాత్రం వాళ్లు సర్వజ్ఞులా. ఇదెంత మాత్రం వెనుకబడి తరగతుల సర్వే కాదని 20 సార్లు చెప్పాం. ఇది మొత్తం జనాభాను లెక్కించే సర్వే అని సిద్ధరామయ్య తెలిపారు. కర్ణాటక వెనుకబడి తరగతుల కమిషన్ చేపట్టిన సోషల్ అండ్ ఎడ్యుకేషనల్ సర్వేలో పాల్గొన రాదని నారాయణ మూర్తి దంపతులు నిర్ణయం తీసుకున్నారు. ఎన్యూమరేషన్ కోసం ఆ దంపతుల ఇంటికి వెళ్లినప్పుడు తమకు సర్వే అక్కర్లేదని చెప్పినట్టు అధికారులు తెలిపారు. తాము వెనుకబడిన తరగతులకు చెందిన వారముకాదని, ఆ సామాజిక వర్గం కోసం నిర్వహిస్తున్న సర్వే కావడంతో తాను ఇందులో పాలుపంచుకోవడం లేదని నారాయణ మూర్తి దంపతులు తెలిపారు. తమ విషయంలో సర్వేకు ఎలాంటి ఔచిత్యం లేదని ప్రకటిస్తూ సర్వే ఫారంపై సుధామూర్తి సంతకం చేసినట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియకు దూరంగా ఉంటున్నట్టు పేర్కొంటూ మూర్తి దంపతులు డిక్లరేషన్ కూడాఇ న్ఫోసిస్ నారాయణ మూర్తి దంపతులు సోషల్ అండ్ ఎడ్యుకేషన్ సర్వేకు దూరంగా ఉండాలని తీసుకున్న నిర్ణయంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ, సర్వేలో పాల్గొనమని తాము ఎవరినీ బలవవంత పెట్టడం లేదని, ఐచ్ఛికంగా సర్వేలో పాల్గొనవచ్చని చెప్పారు. ఇన్ఫోసిస్ మాజీ సీఈవో మోహన్‌దాస్ పాయ్ సైతం కులసమీకరణపై విమర్శలు గుప్పించారు. ఉద్యోగులకు లభిస్తున్న పెద్ద పేమెంట్లు, ప్రయోజనాలతో పోల్చుకుంటే ఇది చాలా చిన్నది. కర్ణాటకలో మంత్రలకు మంచి ఉద్యోగాలు, టక్నాలజీ, అభివృద్ధి కంటే కులం, కుల సర్వేలు, బుజ్జగింపులపైనే ఎక్కువ ఆసక్తి ఉందని అన్నారు. కర్ణాటక హైకోర్టు కూడా ఇటీవల తమ ఉత్తర్వుల్లో సోషియోఎకానమిక్, ఎడ్యుకేషన్ సర్వే తప్పనిసరి కాదని బహిరంగంగాప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వివరాలపై సర్వేయర్లు పట్టుబట్ట రాదని, సేకరించిన సమాచారం మొత్తం బీసీ కమిషన్‌కు మినహా పూర్తి కాన్ఫిడెన్సియల్‌గా ఉంచాలని ఆదేశాలిచ్చింది. వెనుకబడిన తరగతుల వారికి ప్రయోజనాలు చేకూర్చేందుకు ఉద్దేశించిన సర్వేలోని సమాచారం పౌరుల హక్కులను ఉల్లంఘించేలా ఉండరాదని పేర్కొంది.

## అమెరికాతో రక్షణ ఒప్పందానికి సిద్ధమవుతున్న సౌదీ అరేబియా!

**వాషింగ్టన్, అక్టోబరు 17:** పాకిస్థాన్-సౌదీ అరేబియాల మధ్య ఇటీవల వ్యూహాత్మక రక్షణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సౌదీ అరేబియా అగ్రరాజ్యం అమెరికాతో రక్షణ ఒప్పందం చేసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. సౌదీ అరేబియా ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ మరికొన్ని రోజుల్లో వైట్‌హౌస్ సందర్శనకు వస్తున్నారు. ఆ సమయంలో ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నట్లు సమాచారం. సౌదీ ప్రిన్స్ వచ్చినప్పుడు ఓ ఒప్పందంపై సంతకాల గురించి చర్చలు జరిగాయని, కానీ వాటి వివరాలు అస్పష్టంగా ఉన్నాయని ట్రంప్ పరిపాలనలోని సీనియర్ అధికారి తెలిపారు. హమాస్ నాయకులే లక్ష్యంగా ఖతార్‌పై ఇటీవల ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీని తర్వాత యుఎస్-ఖతార్‌ల మధ్య కీలక ఒప్పందం జరిగింది. ఖతార్‌పై ఏ సాయుధ దాడి జరిగినా అది అమెరికాకు ముప్పుగా పరిగణించే ఒప్పందం అది. అలాంటిదాన్నే ఇప్పుడు సౌదీతోనూ చేసుకునేందుకు అగ్రరాజ్యం సిద్ధమైనట్లు సమాచారం. ఇక, సౌదీతో చేసుకొనే ఈ రక్షణ సహకారం తమ ప్రాంతీయ వ్యూహానికి బలమైన పునాది అని అమెరికా విదేశాంగ అధికారులు పేర్కొన్నారు. అయితే, ఒప్పందానికి సంబంధించిన వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఈ రక్షణ ఒప్పందం కథనంపై అటు వైట్‌హౌస్ గాని.. ఇటు సౌదీ ప్రభుత్వం గానీ ఇప్పటివరకు ఏ ప్రకటనా చేయలేదు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ అరేబియా ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్‌ల మధ్య ఇటీవల కీలక ఒప్పందం జరిగింది. రెండు దేశాల్లో దేనిపైనైనా జరిగిన దాడిగా భావిస్తామని, అప్పుడు ఇరువురూ ప్రత్యర్థితో పోరాడాలన్నది ఆ ఒప్పందం సారాంశం.



శ్రీలంక ప్రధాని అమరసూర్య శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ దృశ్యం

## 1.58 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య భరోసా

>> చేపట్టిన చర్యలు,క్లెయింల నిర్వహణ,లబ్ధిదారుల కవరేజీ,డైనమిక్ ఎంపానల్‌మెంట్,పోర్టబులిటీలో ప్రగతిని ఈ నివేదికలో వివరించారు. దేశవ్యాప్తంగా ఏడీపీఎం-జేఎవై పథకాన్ని రాష్ట్రాలు తమ సౌలభ్యం మేరకు అమలు చేసుకునే స్వేచ్ఛను కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. ఈ పథకం అమల్లో రాష్ట్రాల సన్నద్ధత,సామర్థ్యం,దృష్టిలో ఉంచుకొని ట్రస్ట్ ఇన్సూరెన్స్, హైబ్రిడ్ మోడళ్లలో ఎంచుకునే అవకాశం ఇచ్చింది. 2025 మార్చి 1 నాటికి 25 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పద్దతులు అమలవుతుంటే అత్యధిక రాష్ట్రాలు ఎంచుకున్న ట్రస్ట్ మెడల్‌లో ఆంధ్రప్రదేశ్‌లో పథకం అమ లవుతోందని నివేదికలో వివరించారు. ఏపీలో ఏబీపీఎం-జేఎవై లబ్ధిదారుల్లో 55 శాతం పురుషులు,45 శాతం మహిళలు ఉన్నట్లు పేర్కొందిద. రాష్ట్రంలో ప్రభుత్వం ఆస్పత్రుల్లో లక్ష జనాభాకు 2018-19లో 99 పడకలు అందుబాటులో ఉంటే...2024-25కి 433 పడకలకు పెరిగినట్లు నివేదిక పేర్కొంది. బీ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమల్లో ఏపీ ముందంజలో ఉన్నట్లు ఎన్‌హెచ్‌ఏ నివేదిక పేర్కొంది. నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్ కింద ఆరోగ్య వృత్తి నిపుణులు,ఆరోగ్య సదుపాయాలు డిజిటల్ నమోదుల్లో 92 శాతం ప్రగతి సాధించిందని వెల్లడించింది.

## 100 రోజుల ప్రణాళిక

>> సానుకూలంగా ఉందన్న పవన్ నిధుల విషయమై చర్చిస్తున్నట్లు తెలిపారు. సముద్రంలో మత్స్య సంపదకు విఘాతం కలిగిస్తున్న పరిశ్రమల వ్యర్థాలు, కాలుష్య నివారణకు ఓ ప్రణాళికతో వస్తానన్న ఆయన అందుకు తనకు 100రోజుల సమయం ఇవ్వాలని కోరారు. అదే సమయంలో పారిశ్రామి కవేత్తలపైకి ఎగదోసే రాజకీయ నేతల వలలో పడొద్దని మత్స్యకారులకు పవన్ కల్యాణ్ సూచించారు.

# భవిష్యత్తుకు బాటలు సంస్కరణలే

>> సరాల్లోని చాలా వస్తువులు సున్నా శాతం, 5 శాతం స్లాబ్ పరిధిలోకి వస్తున్నాయని.. దీని వల్ల చాలా వరకు ధరలు తగ్గుతాయని విద్యార్థులు చెప్పారు. నాటిన కొంత కాలానికి చెట్టు ఫలాలు ఇస్తున్నట్టు... సంస్కరణలను ఇప్పుడు అమలు చేస్తే కొన్ని రోజుల తర్వాత ఆ ఫలితాలు ప్రజలకు అందుతాయని సీఎం వివరించారు. జీఎస్టీ వంటి సంస్కరణలను అర్థం చేసుకుని వాటిపై ఎస్సే రైటింగ్ కాంపిటీషన్లు, పెయింటింగ్, ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం... వాటిల్లో విజేతలుగా నిలవడం అభినందించదగ్గ విషయమని ముఖ్యమంత్రి అన్నారు. పేదరిక నిర్మూలన అంటే కేవలం ఆర్థిక సాయం చేయడం కాదు వారి ఆత్మగౌరవాన్ని కాపాడటం, ఎదగడానికి అవకాశాలను కల్పించడం, అందరితో సమానంగా ముందుకు నడిపించడమని సీఎం చంద్రబాబు అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లోని ప్రధాన లక్ష్యం పేదరిక నిర్మూలన అని అన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు కూటమి ప్రభుత్వం మొదటి రోజు నుంచి పని చేస్తోందని వెల్లడించారు. 16 నెలల్లో రూ.1 లక్ష కోట్లకు మించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేనటువంటి విధంగా నెలనెలా రూ.2,758 కోట్లతో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 207 అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించి 5 రూపాయలకే పేదల ఆకలి తీరుస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ‘దీపం 2.0’ పథకంతో పేదింటి మహిళలకు ఏడాదికి 3 ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని వెల్లడించారు. అలానే పేదింటి పిల్లలు చదువుకుని వృద్ధిలోకి రావాలన్న లక్ష్యంతో ఇంట్లో ఎంత మంది చదువుతుంటే అంతమందికి ‘తల్లికి వందనం’ కింద ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నామని తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, అలానే రైతులకు ‘అన్నదాత సుఖీభవ’ పథకం కింద మొదటి విడతగా రూ.7,000 జమ చేసామని గుర్తు చేశారు. మత్స్యకారుల సేవలో పథకం కింద రూ.246 కోట్లు, ‘ఆటో డ్రైవర్ సేవలో’ కార్యక్రమం కింద రూ.435 కోట్లు ఇచ్చామని సీఎం చంద్రబాబు అన్నారు. సంక్షేమ పథకాలు ఇస్తూనే పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎంచుకున్న మార్గమే పీ4 జీరో పావర్టీ కార్యక్రమమని తెలిపారు. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం సందర్భంగా ఈ లక్ష్యానికి మనందరం పునరంకితమవుదామని పిలుపునిస్తూ పీ4 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 51లక్షల మె.ట ధాన్యం కొనుగోలు లక్ష్యం

>> హోటల్ తాజ్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ తన మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజున తన తండ్రి చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పదిమందికి ఉపాధి కల్పించాలని, గౌరవం కోసం రైస్ మిల్లులు ఏర్పాటు చేసి, పనిచేస్తున్న రైస్ మిల్లర్ల లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్న అందర్నీ కలుపుకొని పనిచేస్తున్నారన్నారు.

గత ప్రభుత్వం చేసిన 1674 కోట్ల రూపాయల బకాయిలను తీర్చడంలోనూ, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మిల్లర్లకు చెల్లించవలసిన 763 కోట్ల రూపాయలు చెల్లించడం ద్వారా కూటమి ప్రభుత్వం చాలా పారదర్శకంగా పనిచేస్తుంది అన్నారు. గత ఏడాది 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది 202526 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 51లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. బ్యాంక్ గ్యారంటీలు 1:2 ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకుగాను 35 బ్యాంకు సేవలను ఉపయోగించుకోవచ్చు అని తెలిపారు. కొన్ని జిల్లాలలో రైస్ మిల్లుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని రియల్ టైం గవర్నెన్స్ చేసి చూపిస్తామన్నారు. **సంస్కరణలలో భాగంగా వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్:** హాయ్ అని పంపగానే కొనుగోలు ప్రక్రియ ప్రారంభం. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల్లోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు గుర్తు చేశారు. పేపర్ లెస్ ఆర్గనైజేషన్ మొదలగు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. మార్పు కోసం కలిసి పని చేద్దాం అని మంత్రి పిలుపునిచ్చారు. పిడిఎస్ బియ్యం స్మగ్లింగ్ అరికట్టడంలో రైస్ మిల్లర్లు ప్రభుత్వం తోడుగా నిలవాలి. రైతు కోసం కలిసి పనిచేద్దాం, వ్యవస్థను గౌరవిద్దాం అన్నారు.

గత సంవత్సరం అనుభవంతో, తేమ శాతం కొలిచే యంత్రాలు, రవాణా సదుపాయాలు, క్వాలిటీ గన్నీ బ్యాగులు ముందుగానే సిద్ధం చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. సమస్య పరిష్కారానికి ఎప్పుడు సిద్ధంగా ఉండాలని, పని చేసే విధానం పారదర్శకంగా ఉండాలన్నారు. గత సంవత్సరం ధాన్యం కొనుగోలు అనుభవంతో అవసరమైనన్ని క్వాలిటీ కలిగిన గన్ని బ్యాగులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడ సమస్య లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా తేమ శాతం నిర్ధారించే మిషన్ల విషయంలో మరియు ట్రాన్స్‌పోర్ట్ విషయములు కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 3013 రైతు సేవా కేంద్రాలు, 2061 పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు,మొత్తం 10,700 సిబ్బందితో ధాన్యం సేకరణకు సిద్ధమవుతున్నట్టు మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ ప్రతినిధులకు ముందుగానే మంత్రి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ధాన్యం సేకరణ వివరించారు. సివిల్ సప్లై కార్పొరేషన్ ఎండీ ఢిల్లీ రావు మాట్లాడుతూ ఈరోజు జాయిన్ అయినా నేను రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందన్నారు. 2024-2025 సంవత్సరం ధాన్యం కొనుగోలు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ . గోవిందరావు,జి ఎం విజయ్ కుమార్ యాదవ్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వల్లూరి సూరి ప్రకాష్ రావు, కోశాధికారి రంగయ్య నాయుడు, మరియు 26 జిల్లాల రైస్ మిల్లర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# 218 మంది లొంగుబాటు

>> మొదట లొంగిపోయిన మావోయిస్టులకు రాజ్యాంగ ప్రతిని గులాబి పువ్వును అందజేసారు. రాయ్‌పూర్ నుండి ప్రత్యేక హెలీకాప్టర్‌లో జగదల్‌పూర్‌కి వచ్చిన ముఖ్యమంత్రి సాయి సభా ప్రాంగనానికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా అక్కడ పండుగ వాతావరణం కన్పించింది. లొంగిపోయిన మావోయిస్టులు ఆయుధాలను అప్పగించారు. అనంతరం జరిగిన సభలో సి.ఎం సాయి మాట్లడారు. లొంగిపోయిన నక్సల్స్‌కు ప్రభుత్వం మూడేళ్ల పాటు ఆర్ధికసాయం అందిస్తుందని వీరందరూ పునరావాస పాలసీకి సంబంధించి పూర్తి ప్రయోజనాలు పొందుతారని అన్నారు. నివాసం ఉండటానికి ఇళ్లు భూమి ఇస్తామన్నారు. బస్తర్ ప్రాంతం ఇప్పుడిప్పుడే మార్పు కనిపిస్తుందని కరెంట్, రేషన్ ప్రజలకు చేరుతుందని రహదారులు సైతం నిర్మిస్తున్నామని అన్నారు. బస్తర్ సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**నిర్ణీత సమయానికి లక్షాన్ని సాదిస్తాం.హోం మంత్రి విజయ్ శర్మ**

మార్చి 31,2026 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా లక్ష్యంగా పెట్టుకున్నారని ఈ లక్షాన్ని నిర్ణీత సమయంలోపు సాధిస్తామని విజయ్ శర్మ అన్నారు. మాఢ్ డివిజన్ కమిటీ మొత్తం లొంగిపోయినట్లు తెలిపారు. ప్రభుత్వానికి కంటే సమాజం చాలా గొప్పదని నక్సలైట్లు గ్రహించారని అందుకే వారందరూ సమాజంలోనే లొంగిపోయే మార్గాన్ని ఎంచుకున్నారని వారందరికీ అభినందనలు తెలిపారు.

**అందరూ కలిసి సహరిస్తే బస్తర్ అభివృద్ధి : డిజిపి అరుణ్ గౌతమ్**

అటవి ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల కోసం పోరాడుతున్నారని నక్సల్స్ అనుకుంటున్నారని కాని వాస్తవానికి బస్తర్ ప్రజల కోసం పోరాటం లేదని నిజానికి వారికి హని చేస్తున్నారని చత్తీస్ ఘడ్ డిజిపి అరుణ్ దేవ్ గౌతమ్ అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి అభివృద్ధి కి నోచుకోని బస్తర్ ప్రాంతం జరగబోయే అభివృద్ధి కి వారందరూ కలిసి సహకరిస్తే అభివృద్ధి చెందుతుందని అన్నారు. కాగా లొంగిపోయిన వారిలో 208 మంది మావోయిస్టులు ఉండగా వీరిలో 110 మహిళలు 98 మంది పురుషులు ఉన్నారు. వీరిలో 153 మంది ఆయుధాలతో లొంగిపోయారు. ప్రభుత్వానికి అప్పగించిన ఆయుధాలలో 18, ఏకే47 (18) యూజీబీఎల్23 ఐఎన్ఎస్ఏఎస్17 ఎస్ఎల్ఆర్ 4, 303 రైఫిల్స్ 36 మరికొన్ని హ్యాండ్ గన్లు ఉన్నాయి. మఢ్ డివిజన్ నుండి 156 మంది లొంగిపోగా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ దళ సభ్యులు 50 మంది ఉన్నారు.

**ఆయుధాలే వీడాం, ఉద్యమ పందా మర్చుకోం : ఆశన్న**

అనవరసరంగా సహచరుల ప్రాణాలు పోతున్నాయనే ఆయుధాలు వీడి లొంగిపోతున్నామే తప్పా భయపడి కాదన్నారు. ఆయుధాలు వీడినంత మాత్రాన ఉద్యమ పంధాలో ఎటువంటి మార్పు ఉండదని మావోయిస్టు అగ్రనేత కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న లొంగిపోయే ఉందు మీడియా తన సుదీర్ఘ సందేశం ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితిలో లొంగిపోవడమే సరైన మార్గమని లొంగిపోయే వారు ఉంటే తన వంతు సహాయక సహకారాలు అందిస్తానని మిగిలిన సహచరులకు సూచించారు. ఈ మేరకు ఓ ఫోన్‌నంబర్‌ను సైతం తెలిపారు. ఉద్యమ బాట వీడి జనజీవనంలోకి వచ్చిన ఆశన్న కోసం కుటుంబ సభ్యులు ఎప్పుడు వస్తున్నాడో అన్న ఆశక్తితో ఎదురుచూస్తున్నట్లు తెలిసింది. కాగా లొంగిపోయిన నక్సల్స్ ప్రభుత్వం తరుపున అందాల్సిన తక్షణ సహాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సావో బస్తర్ ఎంపి మహేష్ కశ్యప్ జగదల్ పూర్ ఎంఎల్ ఏ కిరణ్ దేవ్ చిత్రకూట్ ఎంఎల్ ఏ వినాయక్ గోయల్ తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్రలోని నాసిక్ ఎయిర్‌బేస్‌లో తేజస్ ఎంకె 1ఎ యుద్ధవిమానం

**ముంబయి, అక్టోబరు 17:** లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ తేజస్ ఎంకె 1ఎ యుద్ధవిమానం మహారాష్ట్రలోని నాసిక్ ఎయిర్‌బేస్‌లో ఎగిరింది. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు చెందిన మూడవ ఉత్పత్తి కేంద్రం నుంచి ఆ విమానాన్ని తయారు చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమక్షంలో ఈ విమానం తన విన్యాసాలు ప్రదర్శించింది. ఎల్‌సిఎ ఎంకె 1 ఎకు చెందిన మూడవ ప్రొడక్షన్ లైన్‌ను మంత్రి ప్రారంభించారు. దీంతో పాటు హిందూస్తాన్ టర్బో ట్రైనర్ 40కి చెందిన రెండో ఉత్పత్తి కేంద్రాన్ని కూడా ఆయన స్టార్ట్ చేశారు. హిందూస్తాన్ టర్బో ట్రైనర్ విమానాన్ని స్వదేశీ పరిజ్ఞానంతో డిజైన్ చేసి డెవలప్‌చేశారు. భారతీయ వైమానిక దళంకోసం దీన్ని వినియో గించనున్నారు. ఎల్‌సిఎ తేజస్ ఎంకె 1ఎ యుద్ధ విమానానికి నాసిక్ ఎయిర్‌బేస్‌లో వాటర్ సెల్యూట్ చేశారు. తేజస్ ఫైటర్ విమానాలను ఇప్పటికే బెంగళూరులోని రెండు కేంద్రాల్లో ఉత్పత్తి చేస్తున్నారు. అక్కడ ప్రతి సంవత్సరం 16 విమానాలను తయారు చేస్తున్నారు. అయితే కొత్తగా నాసిక్‌లోనూ ప్రొడక్షన్ కేంద్రాన్ని మొదలుపెట్టారు. సుమారు 150 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని స్థాపించారు. ఇక్కడ నుంచి కూడా ప్రతి ఏడాది కొత్తగా 8తేజస్ యుద్ధ విమానాలు తయారీ అవుతాయి. దీంతో యుద్ధ విమానాల ఉత్పత్తి సామర్థ్యం24కు పెరగనుంది. ఎల్‌సిఎ ఎంకె 1ఎ అడ్వాన్స్‌డ్,మల్టీరోల్ ఫైటర్ విమానం. మిగ్ 21 స్థానంలో దీన్ని వినియోగించాలని భావిస్తున్నారు. తేజస్‌లో ఎంకె 1ఎ అడ్వాన్స్‌డ్ వేరియంట్. దీంట్లో కొత్తగా ఎయిర్ టు ఎయిర్ రీఫ్యుయలింగ్ సామర్థ్యం ఉన్నది.

# ఎక్కడి గొంగళి అక్కడే!

>> పార్టీ వాళ్ళే. వీటన్నింటికీ మించి పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న అశోక్ గజపతి కుటుంబం కూడా తమ వంతు ఆర్థిక సాయం చేస్తామని కూడా ప్రకటించింది. ఇంతటి నేప థ్యంలో కూడా పార్టీ నిర్మాణం అనేది ఆమడ దూరంలోనే ఉంది. కొత్త ఆఫీసు నిర్మాణానికి ఓ రాయి వేద్దామనే ప్రయత్నం కూడా మరి ఏ సైంధవుడు అడ్డుపడుతున్నాడో గానీ ఒక అడుగు ముందుకి-నాలుగడుగులు వెనక్కి అనే చందంగానే ఉంది. ఎందుకూ, ఏంటి అనడిగితే కనీసం చెప్పగలిగే పరిస్థితి కూడా లేదు.

నిన్న గాక మొన్న పార్టీకి చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే ప్రస్తుతం పార్టీ కార్యాలయంగా ఉన్న అశోక్ గజపతి బంగ్లాలో కాకుండా అతిథిగృహంలో ప్రెస్‌మీట్ పెట్టారు. ఇది జనానికి, క్యాడర్‌కి ఎలాంటి సంకేతమిస్తుందనేది కూడా ఎవరూ ఆలోచించడం లేదు.. అవలోకించడం లేదు. మరి..ఎందుకో..ఏమో!?.

**అధ్యక్షుడి ఎంపికలో కూడా నాన్చుడు ధోరణే:** జిల్లా అధ్యక్షుడి ఎంపికలో కూడా అధిష్టానం ఏదీ తేల్చకుండా నాన్చుడి ధోరణినే అవలంబిస్తోంది. అధ్యక్షుడిగా ఎవరిని ఎంపిక చెయ్యాలనే దానిపై అధినేతలు ఇంకా ఓ నిర్ణయానికి రాకుండా మల్లగుల్లాలు పడుతున్నారు. మార్చే ఉద్దేశ్యం మాత్రం ఉన్నట్టు కనిపిస్తోంది.

కాబట్టే ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఇంటర్‌పోల్ తరహాలో ఇన్వెస్టిగేషన్ కూడా పూర్తయింది.

ఊరూ వాడా అందర్నీ కెలికేసి, అందర్నీ అడిగేసిన తర్వాత కూడా ఏదీ చెప్పకుండా, ఏమీ తేల్చకుండా ఇంకా నానుస్తుండడం క్యాడర్‌తో పాటు ఆశావహుల్ని కూడా విసిగిస్తోంది. అయితే వారు ఈ విషయంలో ఆచి తూచి నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారని పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఎందుకూ అంటే మున్ముందు స్థానిక సమరం ఉంది కాబట్టి. స్థానిక ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కోగలిగిన సత్తాతో పాటు రూక ఉండడమే కాకుండా చేతి చమురు వదిలించుకునే తెగింపు కూడా ఉండడం, ఇద్దరు మాజీ మంత్రులు (కిమిడి కళా వెంకట్రావు, కోండ్రు మురళి), ప్రస్తుత మంత్రి (కొండపల్లి శ్రీనివాస్), ఇద్దరు రాజ వంశీయులు (విజయ నగరం అదితి గజపతి,బొబ్బిలి బేబీనాయన), తాజా ఎమ్మెల్యేలు,తాజా మాజీ ఎమ్మెల్యేలు, పార్టీలో కాళ్ళూ చేతులూ కొంకర్లు తిరిగిపోయిన సీనియర్ల తల్లో నాలుకలా ఉంటూ జిల్లాలో పార్టీల పట్లు, నేతల సిగపట్లు, రాజకీయ విన్యాసాలు తెలిసిన వ్యక్తి కోసం అధినేతలు అంజనం వేసి వెతుకుతున్నారట. ఈ నేపథ్యం లోనే డిలే అవుతోందని పార్టీలో డిబేట్ జరుగుతోంది.

**వినాయక వ్రత కల్పమా?**

పార్టీ అధ్యక్షుడి ఎంపిక వ్యవహారం వినాయక వృత కల్పం కథని గుర్తు చేస్తోంది. అధ్యక్ష పదవి రేస్‌లో ఉన్న వాళ్ళు ఎవరి స్టైల్లో వాళ్ళు లాబీయింగ్ చేసుకుం టున్నారట. ఓ కరణం పొంగూరు నారాయణ చుట్టూ కాళ్ళకి చెప్పుల రిగేలా తిరుగుతున్నాడని, మరో మునసబు పూర్వా శ్రమంలో ఉన్న పరిచయంతో అధినేతలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఆ ఇద్దరి చుట్టూ గింగిరాలు తిరుగుతున్నాడని పార్టీలో ప్రచారం జరుగుతోంది.

మరో ఆశావ హుడు అక్కడో ఎక్కడో ఇంకెక్కడో ఎందుకను కున్నాడో ఏమో గానీ వినాయక వ్రత కల్పం కథలోని కుమారస్వామి-వినాయకుడి ఎపిసోడ్‌ని మననం చేసుకుంటూ జిల్లా తెలుగుదేశం పార్టీకి కేంద్ర బిందువు, పార్టీలో అధికారానికి అసలు సిసలు నిర్వచనంగా చెప్పుకునే నిఖార్సయిన వ్యక్తి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నాడని పార్టీ వర్గాలు బాహాటంగానే చెబుతున్నాయి.

కొసమె రుపు ఏంటంటే, ఇంత జరుగుతోందని తెలిసినా హై కమాండ్ నుంచి ఉలుకూ పలుకూ లేకపో వడం. హై కమాండ్ మొదటి నుంచి అనుసరిస్తున్నదే అయినా ఈ నాన్చుడి ధోరణి నేపథ్యంలో ఆశావహులతో పాటు క్యాడర్ కూడా ‘అన్నా...ఎవరే అతగాడు’ అని కళ్ళల్లో వత్తులు వేసుకుని మరీ నిరీక్షిస్తున్నారు.

పార్టీ ఆఫీసుని ఇప్పటికిప్పుడు మార్చాలని గానీ మారిస్తే అద్భుతాలేవో జరిగిపోతాయని గానీ ఎవరూ అనడం లేదు..అనరు కూడా.

అలాగే అధ్యక్షుడి ఎంపికలో కూడా సేమ్ డైలాగ్ రిపీట్. కానీ దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే పెద్దల మాటను అనుసరిస్తూ ఎప్పుడు చెయ్యాల్సిన పని అప్పుడు చేస్తేనే బాగుంటుంది.

## వారం - వర్జ్యం

18-10-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
ద్వాదశి మ.12.21
పూర్వఫల్గుణి మ.3.44
వర్జ్యం : రా.11.34-1.18
దు.ఉ.6.01-7.34
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

**వృషభం :** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మిథునం:** స్త్రీతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి.

**కర్కాటకం :** ఆస్తి వివాదాలు, కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**సింహం:** ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు పొందుతారు. వస్తు లాభం.

**కన్య :** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**తుల :** ఋణబాధల నుండి విముక్తిని పొందుతారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**వృశ్చికం:** దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. స్పెక్యులేషన్ లాభించదు.

**ధనుస్సు:** మిత్రులతో ఏర్పడిన విభేదాలు తొలగుతాయి. వాహన యోగం.

**మకరం:** మీలోని సృజనాత్మకత వెలుగు చూస్తుంది. గృహం కొనుగోలుచేస్తారు.

**కుంభం:** పూర్తిగా ఆశలు వదులుకున్న కార్యక్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషి చేస్తారు.

**మీనం :** వ్యాపారాభివృద్ధి పట్ల దృష్టి సారిస్తారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## జస్టిస్ రమేష్ ప్రమాణం

>> సొలిసిటర్ జనరల్ ధనంజయ,అదనపు అడ్వకేట్ జనరల్ ఐ సాంబశివ ప్రతాప్,రిజిస్ట్రార్ జనరల్ వైవిఎస్బిజి పార్థసారధి,హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం,ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.ద్వారకానాధ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పలువురు రిజిస్ట్రార్లు,బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విశిష్ట గుర్తింపు

>>నాలపై చర్చించింది. గురువారం సచివాలయంలో జరిగిన సమావేశంలో వీటిని ఖరారు చేశారు. సాంకేతికంగా పరీక్షించిన తర్వాత అమలు చేయనున్నారు. అగ్రిస్టాక్ కేంద్ర అధికారి రాజీవ్ చావ్లా, కేంద్ర సాంకేతిక సలహాదారు సమర్థరామ్, రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, వ్యవసాయ,ఉద్యానవన శాఖ డైరెక్టర్లు మనజీర్ జిలాని, కె.శ్రీనివాసులు తదితర అధికారులతో వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కౌలు రైతు రిజిస్ట్రీకి సంబంధించిన వివరాలను ఆయన తెలియచేశారు. దేశం లోనే మొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ లోనే దీనికి సంబంధించిన విధానాలు రూపొందించామని రాజశేఖర్ పేర్కొన్నారు. దీని ద్వారా కౌలు రైతులు కూడా భూములున్న వారితో సమానంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందే వీలుంటుందని చెప్పారు. సీసీఆర్‌సీ కార్డులు కలిగిన రైతులు గడువు లోగా ఇ- పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలాని సూచించారు.

# ప్రధాని సభ సక్సెస్

## మంత్రులు, అధికారులను అభినందించిన సిఎం చంద్రబాబు

**కర్నూలు, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** కర్నూలులో నిర్వహించిన ప్రధానమంత్రి బహిరంగ సభ సక్సెస్ అయిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఆధ్వర్యంలో జరిగిన "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు మంత్రులు, ఉన్నతాధికారులు, కర్నూలు మరియు నంద్యాల జిల్లాల అధికారులను ఆయన అభినందించారు. శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన కార్యాలయం నుండి మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు మరియు సంబంధిత విభాగాధిపతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ప్రధానమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాలుగోసారి సందర్శించారని సీఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, ముఖ్యంగా కర్నూలులో జరిగిన "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" బహిరంగ సభ అత్యంత విజయవంతంగా జరిగిందని ఆయన తెలిపారు. సభ రాష్ట్రానికి మంచి సందేశాన్ని అందించిందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసిన తీరు ప్రశంసనీయమని సీఎం అభినందించారు. ప్రధాని మోదీ పర్యటనను ఎంతో ఆస్వాదించారని, శ్రీశైలం మల్లన్న ఆలయం దర్శనంపై ఆయన ప్రత్యేక సంతోషాన్ని వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి వివరించారు. అదేవిధంగా, సూపర్ జీఎస్టీ కార్యక్రమాల అమలు పట్ల ప్రధానమంత్రి కూడా ప్రశంసలు వ్యక్తం చేసినట్లు తెలిపారు. జీఎస్టీ నెల రోజుల కార్యక్రమాలపై సమగ్ర నివేదికగా ఒక పుస్తకాన్ని ప్రచురించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఆర్డీవో సందీప్ కుమార్, కమర్షియల్ టాక్సెస్ అసిస్టెంట్ కమిషనర్ నీరజ, డీటీసీ శాంతకుమారి, సీపీఓ భారతి, డిఎస్ఓ రాజా రఘువీర్, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, డీఆర్డీఏ మరియు డీడబ్ల్యూఎంఏ పీడీలు పాల్గొన్నారు.



## రాజకీయ వ్యవస్థలో యువతను భాగస్వామ్యం చేస్తాం

### - ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**విజయ వాడ, అక్టోబరు17, ప్రభాత వార్తప్రతినిధి:** రాజకీయ వ్యవస్థలో నవ తరం యువతను భాగస్వామ్యం చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. సమాజంలో మార్పు కాంక్షించే అవకాశం ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కోసం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా "సేనతో సేనాని మన నేల కోసం కలిసి నడుద్దాం" అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమం జనసేన పార్టీ నిర్వహించనుందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ యువకులు తమకు నచ్చిన అంశాలను ఎంచుకుని సేవలు అందించడానికి ఈ వేదిక కల్పించనుందన్నారు. మార్పు కోరుకుంటే రాదని, ప్రయత్నిస్తే మార్పు వస్తుందని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. ఈ ప్రయత్నంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలు పంచు కునేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, లేదా ఈ లింక్ మీద క్లిక్ చేసి ఇప్పుడే రిజిస్టర్ చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎక్స్ లో ట్వీట్ చేశారు.

### తిరుమల కొండపై జడివాన - చలిగాలులు

**తిరుమల,అక్టోబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ఈశాన్యరుతుపవనాలు సకాలంలో కరుణించడంతో వరుణదేవుడు తిరుమలపై కరుణిస్తున్నాడు. గత రెండురోజులుగా జోరువాన, బలమైన తుంపరజల్లులతో పలకరిస్తున్నాడు. శుక్రవారం ఉదయం కొంతసమయం జోరువానకురిసింది. మళ్ళీ మధ్యాహ్నం ఉన్నఫళంగా తిరుమలలో వర్షం కురుస్తోంది. జల్లుల జడివానతో తిరుమల ఆలయం ముందు, మాఢవీధులు వర్షపునీరు చేరింది. కురుస్తున్న వర్షాలతో తిరుమల పూర్తిగా వాతావరణం మారిపోయింది. ఆలయంలోనికి వెళ్ళే భక్తులు వర్షానికి తడుస్తూ దర్శనానికి చేరుకుంటున్నారు.

# తిరుమల సమాచారం

## వైకుంఠ ఏకాదశి పర్వదినాలపై టిటిడి కీలక నిర్ణయం

### - ఉద్యోగాల భర్తీపై చర్చించే అవకాశం - 28న బోర్డు సమావేశం



**తిరుమల,అక్టోబర్ 17ప్రభాత వార్తప్రతినిధి:** ధనుర్మాసంలో పవిత్రమైన ఏకాదశి, ద్వాదశి ఘడియల్లో తిరుమల ఆలయంలో వైకుంఠద్వారాలు తెరచి దర్శనం కల్పించే అంశంపై ఈ సారి టిటిడి కీలక నిర్ణయం తీసుకోనుందనే తెలుస్తోంది. ఇప్పటికే ఆలయంలో వైఖానస ఆగమోక్తంగా పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తున్న విషయం విదితమే. ఈ పదిరోజుల దర్శనాల్లో ఈ ఏడాది జనవరి 8వతేదీ తిరుపతిలో చోటుచేసుకున్న కొన్ని విషాద సంఘటనలతో టిటిడి అధికారులు పదిరోజులు కొనసాగించాలాలేకరెండురోజులు (వైకుంఠ ఏకాదశి,ద్వాదశి)మాత్రమేనా అనేది 28వతేదీ బోర్డు సమావేశంలో వెల్లడించనున్నారు. ఇదే విషయంపై ఇప్పటికే కీలకంగా సమావేశమైన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అధికారులు ఓ నిర్ణయం తీసుకున్నా అధికారికంగా ఎలాంటి స్పష్టత బయటకు రాలేదు. ఇదే సమయంలో పరకామణిలో చోరీ చేస్తూ పట్టుబడిన కేసును హైకోర్టు తిరిగి సిఐడితో విచారణ చేయించనుందనేది హాట్‌టాఫిక్‌గా మారింది. అదే జరిగితే అనుసరించాల్సిన వ్యూహంపై, అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. టిటిడిలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ, ఉద్యోగుల పదోన్నతి, డిప్యూటీ ఇఒల బదిలీలు, ఇతర అధికారుల బదిలీలు, అన్యమత ఉద్యోగులపై తీసుకోవాల్సిన చర్యలు, టిటిడి కళాశాలల్లో హాస్టల్ వసతి పెంపు తదితర అంశాలపై చర్చించనుంది. 28వతేదీ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరగనున్న బోర్డు సమావేశం ఇఒగా సింఘాల్‌కు రెండవ సమావేశంకానుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించి ఆమోదించనున్నారు. ఇప్పటికే టిటిడిపై అసత్యప్రచారాలు, సామాజికమాధ్యమాల్లో ప్రచారాలు ఎక్కువవడంతో ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించేందుకు సైబర్‌క్రైమ్ విభాగాన్ని ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు వెల్లడించనున్నారు.

## శ్రీవారికి కొప్పెర హుండీ విరాళం



**తిరుమల,అక్టోబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు మొక్కుబడులుగా కానుకల రూపంలోసమర్పించుకునేందుకు అవసరమైన కొప్పెరహుండీని ఓ దాత విరాళంగా శుక్రవారం ఉదయం అందజేశారు. తిరుపతి చంద్రగిరి సమీపంలోని కొప్పెరవాండ్లపల్లికి చెందిన కొప్పెర సాయిసురేష్ 70కిలోల బరువున్న హుండీని టిటిడికి అందించారు. 1821వ సంవత్సరం నుండి వంశపారంపర్యంగా వస్తున్న ఆనవాయితీని కొనసాగిస్తూ కొప్పెర సాయిసురేశ్ 2.50లక్షలు రూపాయలు విలువైన రాగి ఇత్తడితో కలిపి తయారుచేసిన హుండీని ఉదయం ఆలయం వద్ద పోటు ఎఇఒ శ్రీనివాసులుకు, బొక్కసం ఇన్‌ఛార్జి గురురాజారావుకు అందజేశారు. శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలని వేడుకున్నారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,అక్టోబర్ 17ప్రభాత వార్తప్రతినిధి:** కలి యుగప్రత్యక్ష దైవం శ్రీవేంక టేశ్వర స్వామిని శుక్ర వారం ఉదయం పలువురు ప్రోటో కాల్ బ్రేక్‌లో ప్రముఖులు దర్శించుకు న్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిటీ జాతీయ సభ్యుడు డాక్టర్ ఆనంద్, సినీనటుడు నారారోహిత్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమల పరకామణి కేసు 27కి వాయిదా

### - కౌంటర్ దాఖలు చేయకపోవడంతో టిటిడి ఇఒ హాజరుకావాలని ఆదేశం

**తిరుమల,అక్టోబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో అమెరికన్ డాలర్లు చోరీ కేసుకు సంబంధించి సీజ్‌చేసిన వివరాలు సిఐడి అధికారులు సీల్డుకవర్‌లో అందించిన సమయానికి టిటిడి తరపున కౌంటర్ దాఖలుచేయకపోవడంతో హైకోర్టు ధర్మాసనం ఆగ్రహం వెలిబుచ్చింది. కౌంటర్ వేయకుండా జాప్యం చేసినందుకు 27వతేదీ టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ స్వయంగా హైకోర్టు ధర్మాసనం ముందు హాజరుకావాలని ఆదేశించింది. లేకుంటే ఏపిన్యాయవాదుల అసోసియేషన్‌కు 20వేల రూపాయలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని న్యాయమూర్తి ఆదేశించారు. అయితే గతనెల 19వతేదీనే కౌంటర్ దాఖలుకు టిటిడి గడువుకోరినా ఇప్పటి వరకు కౌంటర్ దాఖలు చేయపోవడంపై హైకోర్టు ఆగ్రహం చెందింది. టిటిడి అధికారుల తీరుపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. తదుపరి ఈ కేసు విచారణ ఈనెల 27కి న్యాయమూర్తి వాయిదావేశారు. మూడు సంవత్సరాల క్రిందట తిరుమల పరకామణిలో విధులు నిర్వహించే కోయం బత్తూరు వెంకట రవిమకుమార్ అనే ఉద్యోగి చేతివాటం చూపించి 2023 మార్చినెలలో 920 అమెరికన్ డాలర్ల చోరీచేశాడు. దీనిపై తిరుమల వన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ తరువాత చట్టప్రకారం విచారణ,దర్యాప్తు చేయాల్సిన పోలీసు అధికారులు టిటిడి బోర్డు పెద్దలతో మధ్యవర్తిత్వం నడిపి లోక్‌అదాలత్‌ద్వారా రాజీకుదుర్చుకుని భారీ మొత్తంలా లాభపడ్డారనేది ప్రధాన ఆరోపణలు. దీనిపై శ్రీనివాసులు హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేయడంతో విచారణకు ఆదేశించింది. ఈ కేసులో తొలినుండి టిటిడి జాప్యం, తప్పిదాలు చేస్తూనే ఉంది. నిందితుడుగా పట్టుబడిన సివి రవికుమార్ రెండు దశాబ్ధాల పాటు పరకామణి విధుల్లో ఉంటూ ఏకంగా 140కోట్లరూపాయలు మేరకు అక్రమాస్తులు కూడగట్టారనేది ప్రధాన ఆరోపణలు. ఈ ఆస్తుల్లో కేవలం 14కోట్ల రూపాయలు మాత్ర మే అతని పేరున, భార్యపేరున ఉన్న వాటిని వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి విరాళంగా ఇచ్చారనేది అప్పటి టిటిడి పాలకమండలి పెద్దలు బోర్డులు తీర్మానించిన విషయం. అయితే ఇటీవల హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో ఈ కేసుకు సంబంధించి 2023లో నమోదైన ఎఫ్ఐఆర్, సిడిఫైళ్ళు, దర్యాప్తు రికార్డులు, సిసిపుటేజీలు శుక్రవారం సిఐడి అధికారులు హైకోర్టు రిజిష్టర్‌కు అందజేశారు. రికార్డులు పరిశీలించిన తరువాత హైకోర్టు ఏం నిర్ణయం తీసుకుంటుందోనని టిటిడి, పోలీసు వర్గాల్లో ఉత్కంఠగా మారగా టిటిడి కౌంటర్ దాఖలు చేయకపోవడంతో 27కి వాయిదాపడింది.

### పిహెచ్‌సి వైద్యులకు మరోసారి వైద్యశాఖ నోటీసులు

**విజయవాడ,అక్టోబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, ఇతర సమస్యల పరిష్కారానికి సమ్మెబాట పట్టిన పీహెచ్‌సీ వైద్యులకు వైద్యారోగ్యశాఖ గురువారం మరోసారి నోటీసులు జారీచేసింది. సమ్మె తక్షణం విరమించి,విధుల్లో చేరకపోతే చర్యలు తప్పవని హెచ్చరించింది. ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం పిలుపు మేరకు వైద్యులు విధులు బహిష్కరించి గత నెల 30 నుంచి ఆందోళన చేస్తున్నారు. సమస్యలపై స్పందించిన ఉన్నతాధికారులు సంఘం ప్రతినిథులతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. ప్రభుత్వ ప్రతిపాదనలను వైద్యులు అంగీకరించకపోవడంతో సమస్య కొలిక్కిరాలేదు. సమ్మె కారణంగా రోగులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అన్ని చోట్లా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. సమ్మె చేస్తే ఏపీ సివిల్ సర్వీసెస్ నియమావళి,అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) ప్రకారం చర్యలు తీసుకుంటామని వైద్యారోగ్యశాఖ కమీషనర్ వీరపాండియన్ కలెక్టర్లు,డీఎంహెచ్‌ఓల ద్వారా హెచ్చరించినా వైద్యులు లెక్కచేయలేదు. సమ్మె విరమించాలని ఇప్పటికే రెండుసార్లు నోటీసులు జారీ చేసినా పీహెచ్‌సీ వైద్యులు స్పందించకపోవడంతో మరోమారు గురువారం డీఎంహెచ్‌ఓల ద్వారా నోటీసు-3 ప్రతులను పీహెచ్‌సీల వైద్యాధికారులు సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు పంపారు.

# ఉగ్ర కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండండి

## జైష్ ఎ మొహమ్మద్ ఉగ్రవాదుల అరెస్ట్ : జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



**సత్యసాయి జిల్లా, అక్టోబర్ 17, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలు ఉగ్ర కార్యకలాపాలపై ప్రమత్తంగా ఉండాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ తెలియజేశారు. పాకిస్తాన్ఐ ఎస్ ఐ ఆధారిత జైష్ఎమొహమ్మద్ కు చెందిన పలువురు వాట్సాప్ గ్రూప్‌లలో సభ్యుడిగా ఉన్న ఉత్తర్ ప్రదేశ్ నివాసి సాజాద్ హుస్సైన్ మరియు మహారాష్ట్ర నివాసి తౌఫీక్అల్ శ్రీకం లను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, గతంలో ధర్మవరం పట్టణానికి చెందిన కోత్వాల్ నూర్ మొహమ్మద్ (42) పాకిస్తాన్ ఆధారిత జైష్ఎమొహమ్మద్ (జే ఈ ఎం) కు చెందిన పలువురు వాట్సాప్ గ్రూప్‌లలో సభ్యుడిగా ఉంటూ, భారతీయ భూభాగం లో రాడికల్/జిహాది కార్యకలాపాలలో పని చేస్తుండడం తో అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. పాకిస్తాన్‌లోని జిహాది కార్యకర్తలతో సంబంధాలు కలిగి ఉండి భారతదేశం వ్యతిరేక చర్యలు చేపట్టే యత్నాలు చేస్తారని గుర్తించడం జరిగిందన్నారు. మరింత దర్యాప్తులో, ఇంటెలిజెన్స్ సమాచారంపై ఆధారపడి, మరొక ఇద్దరు జిహాది సభ్యులను గుర్తించామని, ఉత్తర్ ప్రదేశ్ నుండి సాజాద్ హుస్సైన్ మరియు మహారాష్ట్ర నుండి తౌఫీక్ అలామ్ షేక్ లను 13.10.2025 న, ఏపీ పోలీస్ బృందాలు, ఉత్తర్ ప్రదేశ్ పోలీస్‌ల సహకారంతో అమ్రోహా లో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సాజాద్ హుస్సైన్ (ఎ 2) ను అరెస్టు చేశారన్నారు. అతను జమా మదరాసలో అలిం కోర్సు చేస్తున్నాడని , అతని వద్ద నుండి ఎలెక్ట్రానిక్ గాడ్జెట్స్ మరియు జిహాది మెటీరియల్ స్వాధీనము చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీలో భాగంగా జంపర్వా లోని సజాద్ హుస్సైన్ నివాసం ఉంటున్న ఇంటి నుండి ఒక సింగిల్ బారెల్ రైఫిల్ కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇది అతని బంధువుది అని, సదరు ఆయుధంను జిహాదీ కార్యా క్రమాలను ఉపయోగించేవారని తెలిసిందన్నారు. అదే రోజు (13.10.2025) ఏపీ పోలీస్ మరియు మహారాష్ట్ర ఏటిఎస్ బృందాలు రైడ్‌లు నిర్వహించి తౌఫీక్ ఆలమ్ షేక్ (ఎ 3) ను నాసిక్, మలేగావుల్లో అరెస్టు చేసినట్లు తెలిపారు. అరెస్టు సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాలు మరియు జిహాది మెటీరియల్ ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఇద్దరు ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో ఉన్న జైష్ఎ ఆధారిత వాట్సాప్ గ్రూప్‌లు, చానల్స్‌లలో క్రియాశీలక సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. వీరు జే ఈ ఎం ఆపరేటర్లతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి తల్హా భాయ్ (మోలానా మసూద్ అజార్ సోదరుడుచీఫ్ ఆఫ్ జే ఈ ఎం అండ్ అదర్స్), యువతను జిహాది కోసం రాడికలైజ్ చేస్తూ, వారు పాకిస్తాన్‌లో మిలటరీ శిక్షణ తీసుకొని భారతదేశం పై యుద్ధం చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి, స్థానిక న్యాయస్థానాల్లో హాజరు పరచిన అనంతరము ట్రాన్సిట్ వారంట్లపై వారిని ధర్మవరంకు తీసుకురావడం జరిగిందన్నారు. త్వరలో సంబంధిత న్యాయస్థానాల్లో జడీషియల్ రిమాండ్ కోసం కు పంపడం జరుగుతుందన్నారు. భారత దేశం లో నిషేదిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పి ఎఫ్ ఐ) ఇంకా వీటి యొక్క ప్రతినిధులు ఇంకా ఇతర నిషేదిత సంస్థలతో సంబంధాలు పెట్టుకుని, సామాజిక సేవ పేరుతో ఉగ్రవాద (జిహాది) కార్యాకలాపాలను సాగిస్తున్నారని, యువతను ఉగ్రవాదులుగా చేస్తున్నారన్నారు.

## తిరుమల రెండో ఘాట్‌లో చిరుత సంచారం

**తిరుమల,అక్టోబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నుండి తిరుమలకు వచ్చేరెండోఘాట్‌లో శుక్రవారం వేకువజామున చిరుతపులి సంచారాన్ని వాహనదారులు గుర్తించారు. వేకువజామున 3గంటలకు ఘాట్‌లో వాహనాలను అనుమతినిస్తారు. ఈ సమయంలో అలిపిరికి సమీపంలో అడవిలోంచి చిరుతపులి ఘాట్‌దాటుతుండటాన్ని వాహనదారులు గమనించారు. వెంటనే సెల్‌ఫోన్‌లో వీడియోతీసి సామాజిక మాధ్యమంలో పోస్టుచేయడంతో సాయంత్రం వెలుగులోకి వచ్చింది. టిటిడి అధికారులు అప్రమత్తమై చిరుత కనిపించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. తిరుమల ఘాట్‌లో చిరుతల సంచారంపై నిఘా పెట్టాలని భక్తులు కోరుతున్నారు. ఘాట్‌లో ప్రయాణించే ద్విచక్రవాహనదారులు అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్, టిటిడి అటవీశాఖ హెచ్చరించింది.

## 2026 జనవరి నెల టిక్కెట్లు రేపు ఆన్‌లైన్‌లో విడుదల

**తిరుమల,అక్టోబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి రోజువారీ,వారాంతపు 2026 జనవరి నెలాకోటా టిక్కెట్లు ఆదివారం ఉదయం నుండి టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. ఇందుకు టిటిడి ఐటి విభాగం అన్ని ఏర్పాట్లుచేసింది. శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనాల టిక్కెట్ల దర్శన సమయం సాయంత్రం 4.30గంటలకు నిర్ణయించింది. అంగప్రదక్షిణ టోకెన్లు విడుదల సమాచారం తాత్కాలికంగా నిలుపుదలచేశారు. జనవరి నెలకు సంబంధించి రేపు ఆదివారం 19వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో ఆర్జితసేవా టిక్కెట్లు విడుదల చేస్తే 21వతేదీ ఉదయం 10గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 21వతేదీ నుండి 23వతేదీ మధ్యాహ్నం 12గంటలలోపు సొమ్ముచెల్లించి టిక్కెట్లు మంజూరవుతాయి. 23వ తేదీ ఉదయం 10గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకారసేవల టిక్కెట్లను విడుదల చేయనుంది. 23న ఆన్‌లైన్‌లో వర్చువల్ సేవా టిక్కెట్లను మధ్యాహ్నం 3గంటలకు విడుదలవుతాయి. శ్రీవాణి టిక్కెట్లు 24న ఉదయం 11గంటలకు, వృద్ధులు దివ్యాంగులు దర్శన కోటా 24వతేదీ మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటా 25న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. గదుల కోటాను మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు ఆన్‌లైన్‌లో స్వామివారి దర్శన టిక్కెట్లును "టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఓవి.ఇన్"వెబ్‌సైట్‌ద్వారా బుక్‌చేసుకోవాలి.



ప్రధాని మోడీకి కర్నూలులో స్వాగతం పలుకుతున్న మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

## ప్రధాని సభ విజయవంతం కావడంపై మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి హర్షం

**సచివాలయం,అక్టోబర్ 17,ప్రభాతవార్త :** ప్రధాని ఆధ్వర్యంలో కర్నూలులో నిర్వహించిన సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజానీకానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లా,రాయలసీమ నలుమూలల నుండి వ్యయ ప్రయాసలను ఓర్చుకొని వచ్చిన కూటమి పార్టీనేతలు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ఇంత పెద్ద సక్సెస్ కావడానికి తోడ్పాడు అందించిన పోలీసు అధికార యంత్రాంగానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. బనగానపల్లె నియోజక వర్గం నుంచి సభకు హాజరైన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.

# కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవిరెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

## - అప్పీల్‌ను కొట్టేసిన హైకోర్టు

**విజయవాడ,అక్టోబరు 17,ప్రభాతవార్తప్రతినిధి:** కడప టిడిపి ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవిరెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో తీసుకున్న తీర్మానాలను రద్దు చేసే అధికారం కమిషనర్‌కు లేదన్న హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడిన ధర్మాసనం కడప మున్సిపల్ కార్పొరేషన్ వ్యవహారానికి సంబంధించి ఆమె దాఖలు చేసిన అప్పీల్ ను హైకోర్టు కొట్టివేసింది. మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో తీసుకున్న తీర్మానాలను రద్దు చేసే అధికారం కమిషనర్‌కు లేదని, రాష్ట్ర ప్రభుత్వానికే ఆ అధికారం ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ ఏడాది జూన్ 20న కార్పొరేషన్ నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలపై సింగిల్ జడ్జి విచారణ అనంతరం సింగిల్ జడ్జి కమిషనర్‌కు తీర్మానాలను రద్దు చేసే అధికారం లేదని స్పష్టం చేస్తూ, జూన్ 20న చేసిన తీర్మానాలను అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ మాధవిరెడ్డి హైకోర్టు డివిజన్ బెంచ్‌కి అప్పీల్ చేశారు. ఆమె తరఫు న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపిస్తూ సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యురాలైన ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వ లేదని, ఆ కారణంగా తీర్మానాలు చెల్లవని వాదించారు. అయితే సురేశ్‌బాబు తరఫు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ సమావేశంలో ప్రజాహిత తీర్మానాలే చేసినట్లు తెలిపారు. తీర్మానాలు చేసి నెలలు గడుస్తున్నా కమిషనర్, కార్పొరేటర్ల నుంచి ప్రభుత్వానికి ఎటువంటి ఫిర్యాదులు రాలేదన్నారు. ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ఎమ్మెల్యే మాధవిరెడ్డి దాఖలు చేసిన అప్పీల్‌పై నిన్న హైకోర్టు విచారణ జరిపింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్. రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం కేసు విచారణ జరిపి తీర్పు ఇచ్చింది. తీర్మానాలను రద్దు చేస్తూ, కొత్త తేదీల్లో సమావేశం నిర్వహించాలని సూచిస్తూ కడప మున్సిపల్ కమిషనర్ జూన్ 30, జూలై 1 తేదీల్లో ఇచ్చిన నోటీసులను అప్పటి మేయర్ సురేశ్‌బాబు హైకోర్టులో సవాలు చేశారు.

ఫోన్ నం. 011-46060501
వెబ్‌సైట్ : www.slbsrsv.ac.in

**శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం**
(సెంట్రల్ యూనివర్శిటీ)
B-4, కుతుబ్ ఇనిస్టిట్యూషనల్ ఏరియా, న్యూఢిల్లీ-110016

**ప్రకటన నం. 03 / 2025**

అర్హులైన అభ్యర్థుల నుండి ఒక అసోసియేట్ ప్రొఫెసర్ (సర్వ దర్శన్), ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎడ్యుకేషన్), ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ (ధర్మశాస్త్ర) మరియు లైబ్రేరియన్ ఉద్యోగం(లు) యొక్క నియామకం కొరకు ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నవి. అర్హతా ప్రమాణం, దరఖాస్తు ఫీజులు, దరఖాస్తుల యొక్క చివరి తేదీ, నియామకం యొక్క సవివర నియమాలు మరియు నిబంధనలతోసహా వీక్షించటానికి అభ్యర్థులు యూనివర్శిటీ వెబ్‌సైట్ **www.slbsrsv.ac.in** మరియు UGC యొక్క Chayan పోర్టల్ (https://curec.samarth.ac.in/index.php/search/site/index) ద్వారా వెళ్లవలసి ఉంది. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 17.11.2025.

CBC 21371/12/0010/2526 సం/- రిజిస్ట్రార్ (I/C)

## ప్రైవేట్ వైద్య కళాశాలల్లో అదనంగా 250 ఎంబిబిఎస్ సీట్లు

**విజయవాడ,అక్టోబరు 17,పభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రం లోని పలు ప్రైవేటు వైద్య కళాశాలల్లో ప్రస్తుత విద్యాసంవ్సరానికి అదనంగా 250 ఎంబీబీఎస్ సీట్లకు జాతీయ వైద్య కమీషన్ కొత్తగా అనుమతులు ఇచ్చింది. ఈ నెల 13న పుత్తూరు అన్నా గౌరి వైద్య కళాశాలలో 100 సీట్లను 150కు పెంచగా...కర్నూలు శాంతిరామ్ వైద్యకళాశాలలో 150 సీట్లను 200కి పెంచింది. తాజాగా గురువారం విశాఖపట్నం ఎన్నారై వైద్య కళాశాలలో ఉన్న 150 ఎంబీబీఎస్ సీట్లను 250కి పెంచుతూ అనుమతులు ఇచ్చింది. అలాగే కర్నూలు శాంతిరాం వైద్య కళాశాలలో ఇప్పటికే 200కి పెంచిన సీట్లను మళ్ళీ 250కి పెంచింది. పెరిగిన సీట్లకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ)రావాల్సి ఉంది. మూడో విడత కౌన్సిలింగ్‌లో వీటిని భర్తీ చేయనున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
**ప్రజాప్రయోజన ప్రకటన**
fssai
Eat Right India
ఆహార పరిరక్షణ, ప్రమాణాల అమలు విభాగం
ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా - ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం
ముఖ్యమైన విటమిన్లు మరియు ఖనిజ లవణాలు కలిగిన పౌష్టిక ఆహారాన్నే కొనండి
పౌష్టికమైన బియ్యం & గోధుమ పిండి
RICE
WHEAT FLOUR
ఫోలిక్ యాసిడ్ శిశువు పెరుగుదలకు & రక్తవృద్ధికి దోహదం చేస్తుంది
విటమిన్ బి-12 నాడీ వ్యవస్థ సజావుగా పని చేయడానికి, రక్త వృద్ధికి అవసరం
ఐరన్ రక్తహీనత (అనీమియా)కు గురి కాకుండా కాపాడుతుంది
+F FORTIFIED SAMPOORNA POSHAN SWASTH JEEVAN
ఈ లోగో చూసి కొనండి
ప్రజా ప్రయోజనార్థం FSSAI వారిచే జారీ చేయబడింది
పౌష్టికమైన పాలు & నూనె
విటమిన్- ఎ రేచీకటి రాకుండా కాపాడుతుంది
విటమిన్ - డి ఎముకల గట్టిదనానికి దోహదం చేస్తుంది
పౌష్టిక ఆహారం అందించే బ్రాండ్ల గురించి మరింత సమాచారం కోసం fortification.fssai.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి
రెట్టింపు పౌష్టికతతో కూడిన ఉప్పు
SALT
ఐరన్ రక్తహీనతకు గురి కాకుండా కాపాడుతుంది
అయోడిన్ శారీరక ఎదుగుదల, థైరాయిడ్ మరియు మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది
సలహాలు, ఫిర్యాదుల కోసం సంప్రదించండి
సంచాలకులు 08645 241 0295
జాయింట్ ఫుడ్ కంట్రోలర్ 94403 79755
జారీ చేసినవారు : ఆహారభద్రత కమీషనర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

వార్త

చేయకుండానే చేశాననేవాడు అధముడు, కొద్దిగా చేసి కొండంత చేశానని చెప్పేవాడు గర్వపోతు. ఎంతో చేసి కొంచెమే చేశానని చెప్పేవాడు సజ్జనుడు.

-ఆది శంకరాచార్యులు

# బీమారుకు కాయకల్ప చికిత్స

బీహార్ రాష్ట్రానికి ఎన్నికల జ్వరమొచ్చింది. రాజకీయాల్లో టక్కుటమార గోకర్ణ విద్యలన్నీ సహజంగా చూస్తుంటాము. ఈ రాష్ట్రంలో అలాంటి విద్యలు తెలిసిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సొంత పార్టీ 'జనసురాజ్' కూడా రంగంలో ఉంది. బీహార్‌లో అధికారం నుంచి ప్రస్తుత ఎన్డీఏను పదవీచ్యుతిని చేయాలని ఆయన ఆకాంక్ష. ఇతరత్రా పార్టీల వారు హేమాహేమీలు. రాజకీయాల్లో తన మాటే నెగ్గించుకోటానికి ఎంతకైనా వెనుకాడని నితీష్ కుమార్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండడం, పశుదాణా కుంభకోణంలో తనకు తానే సాటి అని కటకటాలను చూసొచ్చిన లాలూ ప్రసాద్ యాదవ్, ఇప్పుడాయన వారసులు కూడా ఎవరికి వారే అన్న చందాన బీహార్ ఎన్నికలలో ఎవరి పాత్రవారు నిజా యితీగా పోషిస్తున్నట్లే చెప్పాలి. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవని అందరికీ తెలిసిందే. ఇప్పుడదే జరిగింది. లాలూప్రసాద్ వారసులుగా చెలామణీ అవుతున్న తేజ్‌ప్రతాప్ యాదవ్, మరోపక్క లాలూ వారసత్వానికి తానే సరైన వారసుడనిపించుకున్న తేజస్వియాదవ్‌లు రాజకీయ వ్యూహ ప్రతి వ్యూహాలు పన్నుతున్నారు. ఎవరికి ఏ అంశం కలిసి వస్తుందో ఇప్పుడే చెప్పలేమని విశ్లేషకులు తమ కళ్లెదుట జరుగుతున్న రాజకీయాలను పరిశీలిస్తున్నారు. జెడియు నేత నితీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి అభ్యర్థుల ఖరారులో చాలా లుకలుకలు ఎదురు చూసాయి. కాని చిన్న చిన్న పార్టీలు తమ అసంతృప్తిని బాహాటంగానే వెళ్లగక్కారు. విపక్ష ఫ్రంట్‌గా చెప్పబడే ఆర్‌జెడి, కాంగ్రెస్‌ల మధ్య ఇంకా సర్దుబాట్లు పూర్తిస్థాయిలో జరుగలేదు. లాలూ తనయుడు జనశక్తి జనతాదళ్ స్థాపించాడు. ఆ పార్టీకి లాలూ తనయ రోహిణి ఆచార్య ఆశీస్సులున్నాయి. ఇలా లాలూ సామ్రాజ్యం చీలికలు పేలికలు అయినా, ఆయన మరో కుమారుడు తానే కాబోయే ముఖ్యమంత్రినని స్వయంగా ప్రకటించుకుని మహా కూటమిని నిర్దేశించే పనిలో పడ్డాడు. ఇంటిపోరు అలా ఉండగా కాంగ్రెస్‌తో చెలిమి చేయడంలోనూ వ్యూహాత్మకంగా వ్యవహరించలేకపోతున్నాడు. ఇవన్నీ అవకాశంగా తీసుకుని జనసురాజ్ అన్ని స్థానాల్లోనూ పోటీ చేసే స్థాయిలో ఉందని చెప్పుకుంటూ ప్రశాంత్ కిషోర్ తాను ప్రస్తుతానికి అసెంబ్లీ ఎన్నికలో పోటీకి దిగడంలేదు. ఇది కూడా ఒక వ్యూహమే. ఆ పార్టీకి వ్యూహకర్త, ఆకర్షణీయ శక్తి ఆయనే కనుక జనం ఎలా స్వాగతిస్తారో చూడాలి. నితీష్‌కుమార్‌తో విభేదించి బయటపడినప్పటి నుంచి ప్రశాంత్ ఊరూరా ఇంటింటికీ తిరుగుతూ జనాన్ని ఆకట్టుకున్నాడు. ఇప్పుడు ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ ఎన్నికల కమిషన్ బీహార్‌లో అమలు చేస్తున్న ఓటర్ల సంస్కరణ 'సర్'తో విబేధించి జనంలో బాగా గుర్తింపు వచ్చింది. అధికార పార్టీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్ డ్రామాలాడుతోందని ప్రజలే భావించే పరిస్థితి ఏర్పడింది. రాహుల్ గాంధీతో తలపడి ఆనక సుప్రీంకోర్టు మొట్టికాయలు తిన్న ఎన్నికల కమిషన్ కాస్త పరపతి కూడా కోల్పోయింది. తన చిత్తశుద్ధిని నిరూపించుకునే పనిలో ఆ ప్రభుత్వ సంస్థ బాగా తంటాలుపడుతోంది. అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో స్వయంగా దిగడమే కాకుండా నలుగురు ఎన్డీయే రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ప్రచారగోదాలోకి దింపింది. సర్దుబాట్లు జరిగినా జరుగకపోయినా దాదాపు ప్రధాన పార్టీలు ముందస్తు జాగ్రత్తలతో తమ తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించేశారు. ఇలాంటి వ్యూహం బెడిసికొట్టి చివరాఖరుకు 'రెబల్స్' బెడదతో ఇబ్బంది పడే అవకాశం లేకపోలేదు. బీహార్‌లో తమకు 40 స్థానాల్లో ముస్లిం జనాభా ఉన్నందున అక్కడ తామెందుకు పోటీ చేయరాదని అనుకున్న ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలో థర్డ్ ఫ్రంట్ ఏర్పడి రంగంలోకి దిగింది. సర్దుబాట్లు, సమాలోచనలు ఒకపక్క జరుగుతుండగానే ఏయేపార్టీకి ఎవరెవరు స్టార్ కంపెయినర్లుగా ఉండాలో యోచన చేస్తున్నారు. ఈసారి ఆ రాష్ట్రంలో ఎన్నికలు అలాంటిలాంటి వ్యూహాలతో నడవవని అర్థమవుతోంది. ఎన్డీయేకు కూడా అంతర్గతంగా భాగస్వామ్య పక్షాలలో విభేధాలు పొడచూపాయి. చిరాగ్ పాశ్వాన్ (ఎన్‌జెపి) జితిన్ మాంఝీ, (హిందూస్థానీ అవామా మోర్చా) ఉపేంద్ర కుష్వాహ (రాష్ట్రీయ లోక్ మోర్చా) లు తమకు కేటాయించిన సీట్లు, స్థానాల విషయంలో ఏ మంత సంతోషంగా లేరు. కాగా భారత్‌లో ఎన్నడూ లేని విధంగా రాజకీయ వ్యూహాలు ఎన్నికల కమిషన్, పార్టీల ప్రాభవం, ఓటర్ల ప్రలోభాలు వంటి వాటికి ఈసారి జరుగుతున్న బీహార్ ఎన్నికలు నమూనాగా ఉండగలవన్న అంచనాలున్నాయి. బీహార్‌లో దాదాపు చిన్న చితకా పార్టీలు ఒంటరిగానో, పెద్ద పార్టీలతో కలిసో సీట్ల పంపకాలు చేసుకుని పోటీలోకిదిగాయి. మహాగఠ్‌బంధన్ నుంచి వికాస్ శీల్ ఇన్సాఫ్ పార్టీ బయటపడింది. ఏ పార్టీ మహిళలకు తగిన దామాషాతో సీట్లు కేటాయించలేదని తేలిపోయింది. ఎన్నికల నిర్వహణ విషయానికొస్తే తాము సజావుగానే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పుకునేందుకు ఎన్నికల కమిషన్ ఆపసోపాలు పడుతోంది. ఏమయితేనేం అన్ని అగ్ని పరీక్షలను తట్టుకుని నిలబడుతూ ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలియచేసింది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ సర్వే విశ్వసనీయతను దెబ్బతీసేందుకు కొన్ని రాజకీయ పార్టీలు, ఎన్‌జిఓలు సుప్రీంలో పిటిషన్లు వేసాయని ఇసి సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇక నిబద్ధతతో ఎన్నికల నిర్వహణ ఒక్కటే ఎన్నికల కమిషన్ బాధ్యతగా మిగిలింది.

అవసరానికి ఆదుకొనే స్నేహితులుండడం అదృష్టం. అసలు స్నేహితుల అవసరం రాకపోవడం ఇంకా అదృష్టం.



ఆస్కార్‌వైల్డ్

ఎప్పుడు ఎలా చనిపోయేదీ నీవు నిర్ణయించలేవు. ఇప్పుడు ఎలా జీవించాలన్నదే నీవు నిర్ణయించగలవు.



రామకృష్ణ పరమహంస

## ప్రజావాక్కు



### అడ్డగోలుగా ఓట్ల తొలగింపు

మనదేశంలో ప్రతీ ఎన్నికల సందర్భంలో ఓటర్ల జాబితాలో నుంచి పేర్ల తొలగింపు లేదా జాబితాలో అత్యధిక ఓట్లుచోటు చేసుకోవటం వివాదాస్పదమవుతోంది. అనేక మంది ఓటరుకార్డు ఉండీ ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవటంతో తిరిగి వెళ్ళిపోవటం పరిపాటి అవుతోంది. ఒక ఓటరుఓటు వేయకుండా తిరిగి వెళ్ళిపోవటం లేదా ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపు వంటివి ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాలు ఈ ఓటర్ల జాబితా నిర్వహణలో దశాబ్దాలుగా విఫలమవుతున్నాయి. ఇప్పుడు వెల్లువెత్తుతున్న 'ఓట్ చోరీ' నినాదం ఎన్నికలసంఘం వైఫల్యమేనని చెప్పవచ్చు. ఓట్ల తొలగింపుకు శాస్త్ర పద్ధతి లేకుండా, అడ్డగోలుగా తొలగించటం గర్హనీయం. ఎన్నికల సంఘం ఎన్నికలను సజావుగా సాగించటంపై పెట్టే శ్రద్ధ, ఎన్నికల జాబితాలో అవకతవకలు లేకుండా చూడటంపై పెట్టాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### పర్యాటకరంగం ప్రాముఖ్యత

ఏపిలో ఇటీవల పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కొన్ని జిల్లాలోగల ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాముఖ్యత గల ప్రాంతాలను గుర్తించారు. వాటిలో ప్రత్యేకంగా తీరప్రాంతాల్లో గల చిత్తడి నేలలను కారిడార్ నిర్మాణం చేయాలనే సంకల్పం ఎంతో విలువైనది. దానిలో వెనుకబడిన జిల్లాలో కొన్ని ప్రాంతాలు ఎంతో అభివృద్ధికి ఆస్కారం ఉంది. భౌగోళిక సానుకూలత ఉన్న వాటికి తదుపరి చర్యలు వివిధ శాఖల నివేదిక ప్రకారం అంచెలవారీగా జరగాలి. ఈబృహత్ పథకానికి స్థానిక ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించగలరు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### నియామకాలు జరపాలి

సర్కారు కళాశాలల్లో, పాఠశాలల్లో ప్రతి ఏడాది అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం అంటూ పత్రిక ప్రకటనలు చూస్తుంటే నవ్వేస్తుంది. టీచర్ల కొరత ఉన్నా కూడా మోడల్ పాఠశాలల్లో పది ఏండ్లు అయినా ఇంకా ఒక్క నియామకం జరగలేదు. అరకొర జీతాలకు అతిథి అధ్యాపకులను నియమించుకుని ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది. ఇలాంటి విద్యతో ప్రపంచం గర్వించేలా తెలంగాణను చేస్తా అంటే నమ్మాలా.

- ప్రశాంత్ గురుడు, గోధుర్, జగిత్యాల

### కనీస పెన్షన్ పెంపు ఇప్పట్లో లేనట్లేనా?

ఇటీవల జరిగిన సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో కనీస పెన్షన్ పెంపు అంశం చర్చకు వచ్చి అధికారికంగా ప్రకటిస్తారని దేశవ్యాప్తంగా వున్న ఈ.పి.యస్. పెన్షన్ దారులు ఎదురు చూసారు. కానీ కనీస పెన్షన్ పెంపుపై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడం పైఅంతా నిరాశవ్యక్తం చేస్తున్నారు. ఈ.పి.యస్ 95 పథకానికి చెందిన ఎన్నో వేలమంది పెన్షన్ దారులు ఎప్పటినుంచో కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతంనెలకు రూ.1000గా ఉన్న కనీస పెన్షన్ను రూ. 7,500 పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. మొన్న జరిగిన సిబిటి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు కానీ కనీస పెన్షన్ పెంపుపై ప్రస్తావనే తీసుకురాలేదు.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన'ను రద్దు చేయడం ఎంతో సముచితమైన నిర్ణయం. ఇప్పటి వరకు ఈ నిబంధన కారణంగా ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు ఎన్నికల్లో పోటీ చేయలేకపోయారు. దీనివల్ల అనేక మంది సామాన్య ప్రజలు, ప్రజాసేవ చేయాలనే ఆసక్తి ఉన్నవారు వెనుకబడిపోయారు. ప్రభుత్వం ఈ నిబంధనను తొలగించడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను మరింత విస్తరించింది. ఒక వ్యక్తి కుటుంబ పరిమాణం ఆధారంగా రాజకీయ హక్కులను పరిమితం చేయడం న్యాయబద్ధం కాదని స్పష్టంగా చెప్పవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కొరతతో ఈ నిబంధన కారణంగా చాలామంది అర్హత కోల్పోయారు. ఇప్పుడు ఈ నిర్ణయంతో సాధారణ ప్రజలు కూడా స్థానిక పాలనలో భాగస్వామ్యం అవ్వగలరు.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### కొత్త డ్యాములను నిర్మించాలి

భారత దేశంలో అతిపురాతన నదులు చెరువులు, కుంటలు, వాగుల చెక్ డ్యాములను పునరుద్ధరించి కొత్త డ్యాములను నిర్మించాలి. ఎప్పుడో బ్రిటీష్ వారి కాలంలో నిర్మించిన ఆనకట్టలు శిథిలావస్తకు చేరుకుంటున్నాయి. వర్షాకాలంలో ఈ ఆనకట్టలు తెగిపోవడం వల్ల ముంపు గ్రామాలు మునిగిపోవడం జరుగుతుంది. కావున ప్రభుత్వం తక్షణం పాత డ్యాంల స్థానంలో కొత్తవి నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

-డి. చాంద్ బాషా, కర్నూలు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చూసి పోయేవారే..చేయూతనిచ్చేవారేరి?

**మరో జీవ నాధారం లేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో మాత్రమే వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగి రైతులు కాడి కింద పెడితే అంతకంటే ప్రమాదకర పరిస్థితి మరొకటి ఉండదు. ఇలాంటి సమయంలో ప్రజాపాలకుల మని చెప్పుకునేవారు ఆపన్నహస్తం అందివ్వాలి. కానీ నేతలు వాగ్దానాలు, వాచావాత్సల్యాలతో సానుభూతి వర్షాలు కురిపిస్తున్నారు. ఇవి రైతుల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. అందుకే ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. కమిటీలు, సమీక్షలు, నివే దికలంటూ కాలయాపనకు ఇది తరుణంకాదు. అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతినడం దేశానికి క్షేమం కాదు. ఎద్దు విడిచిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్రలో లేదనే విషయం పాలకులు విస్మరించరాదు.**

దామెర్ల సాయిబాబ

'వానలో తలకడుకుందామని వెళ్లితే వడగండ్లు పడ్డట్టు'గా ఉంది తెలుగు రాష్ట్రాల్లో రైతుల పరిస్థితి. ఒకప్పుడు చుక్కనీటి కోసం వెంపర్లాడిన అన్నదాతలు గత నాలుగైదు నెలలుగా విడవకుండా కురుస్తున్న వర్షాలతో విలవిల్లాడిపోతున్నారు. ఈ పంట, ఆపంట అని కాదు పండ్ల తోటలతోసహా దాదాపు అన్ని పంటలకు అపారనష్టం జరిగింది, జరుగుతున్నది. రైతులపై పగబట్టిందా? లేక పిచ్చి పట్టిందా అన్నట్లుగా ప్రకృతి వ్యవహరిస్తున్నది. దేశవ్యాప్తంగా వ్యవసాయరంగం పరిస్థితి ఇలానే ఉన్నా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మరింతగా విపత్కర పరిస్థితులు అలుముకుంటున్నాయి. గత రబీ సీజన్‌లో అకాల వర్షాలు, వరదలతో జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. చేతికి అంది వస్తుందనుకున్న సమయంలో విరుచుకుపడిన వరుణదేవుడి ప్రభావం రైతుల నెత్తిన పిడుగుపాటుగా పరిణమించింది. అక్కరకురాని సమయంలో కురిసిన ఆ వర్షాలతో రైతులకు అపారనష్టం జరిగింది. ఇక వానాకాలం పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతున్నది. గత రెండు, మూడు నెలలుగా కురుస్తున్న వర్షాలు మెట్టపంటలకు తీవ్రనష్టం కలిగించాయి. ముఖ్యంగా వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. దిగుబడులు సగానికి సగం తగ్గిపోయాయి. మరొకపక్క మార్కెట్ దగాఉండనే ఉంది. గతంలో క్వింటాలుకు పది, పన్నెండు వేలకుపైగా అమ్మిన పత్తి నేడు ఆరేడు వేలకు మించడంలేదు. అది కూడా దళారుల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంకొకపక్క విడవని వర్షాలు భయపెడుతున్నాయి. ఒక్కపత్తి రైతులే కాదు, కూరగాయలు మొక్కజొన్న, వరి రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. నష్టాలు అంచనాల్లో అధికారులు మునిగి తేలుతున్నారు. ఇప్పటికీ ఎంతమేరకు నష్టం జరిగిందో స్పష్టంగా తెలియడం లేదనే చెప్పొచ్చు. కేంద్ర బృందాలు కూడా పర్యటించి, పరిశీలించిపోయాయి. పరామర్శలకు, పర్యటనలకు విరామం లేదు కానీ సహాయం ఎప్పుడు చేస్తారో? ఎలా చేస్తారో? చెప్పేవారు లేకుండా పోతున్నారు. అందుకే చూసిపోయేవారి కానీ చేసేవారు కన్పించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పుడు మళ్లీ రబీ సాగు ముంచుకొస్తున్నది. నవంబరులో ఈ ఖరీఫ్ ముగిస్తే డిసెంబరు, జనవరి నాటికి రబీ సాగు నాట్లు, విత్తనాలు విత్తడం పూర్తి కావాల్సి ఉంటుంది. దీనికి మళ్లీ పెట్టుబడి కావాలి. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. మరొకపక్క ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉన్నది. రైతులను ఆదుకొనేందుకు అంతో ఇంతో చేస్తున్నా వాగ్దానాల వర్షాలు కురిపిస్తున్నా హామీలకులకు నమ్మకం కుదరడం లేదు. రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని, రైతుల ఆదాయాన్ని ఐదేళ్లలో రెట్టింపు చేస్తామని చెప్పిన పెద్దలు ఐదేళ్లలో ఆదాయం రెట్టింపు సంగతి దేవుడెరుగు పెట్టుబడిని రెట్టింపు చేశారు. కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నా పెరిగిన ఎరువులు, క్రిమిసంహారక మందులతోపాటు సాగు ఖర్చులు కూడా పొంతన లేకుండాపోతున్నది. తాజాగా దేశంలో వందవెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయరంగంలో సమూల మార్పులు తీసుకవచ్చేందుకు ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని మొన్న శనివారం నరేంద్రమోడీ ప్రారంభించారు. దాదాపు 24వేల కోట్ల రూపాయలతో పదకొండు మంత్రిత్వ శాఖలకు చెందిన 36 పథకాలను కలగలిపి ఈ సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టారు, 11 వేల 440 కోట్ల రూపాయలతో మిషన్ ఫర్ ఆత్మనిర్భర్ ఇన్ పల్సెస్‌ను లాంచనంగా మోడీ ప్రారంభించారు. పశుపోషణ మత్స్య, ఆహారశుద్ధి రంగాలకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను ప్రధాన మంత్రి ప్రారంభించారు. గతంలో కూడా రైతుల

## ఒక్క మాట

సంక్షేమం కోసమే లక్షలకోట్ల వ్యయంతో అనేక పథకాలు చేపట్టారు, ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా, మరెన్ని కోట్లాది రూపాయలు సబ్సిడీ రూపంలో అందిస్తున్నా రైతుల పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. గత పది, పదిహేనేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నోపథకాలు ప్రవేశపెట్టాయి. కోట్లాది రూపాయలు వ్యవసాయరంగానికి కేటాయించారు. కొన్ని రాష్ట్రాలు ఉచిత విద్యుత్ బకాయిలు రద్దు లాంటి కార్యక్రమాలు చేపట్టాయి. ఇక తెలంగాణలో (రైతుబంధు) రైతుభరోసా , రుణమాఫీ లాంటి కార్యక్రమాలు కొంత ఊరట ఇచ్చిన మాట వాస్తవమే. ఇన్ని రకాలుగా రైతులకు చేయూతనిస్తున్నా వారి ఆర్థిక పరిస్థితి ఏమాత్రం మెరుగుపడకపోగా రోజురోజుకు మరింత దిగజారిపోతున్నది. వ్యవసాయరంగమే ఒక పెద్ద సంక్షోభంలో కూరుకుపోతున్నది. అందుకు కారణాలేమిటో? కారకులెవరో పాలకులకు తెలియంది కాదు. ప్రకృతి సృష్టిస్తున్న విపత్తులను ఏదోరకంగా రైతులు భరిస్తున్నారు. కానీ తోటి మానవుడు చేస్తున్న మోసాల నుండి బయటపడలేక కుప్పకూలిపోతున్నాడు. వ్యవసాయరంగానికి మూలం విత్తనాలు. క్రిమిసంహారక మందులు అనేది అందరికి తెలిసిందే. విత్తే దగ్గర నుండి విక్రయించే వరకు అన్ని స్థాయిల్లో తోటి మనుషులు దగాకు గురవుతున్నారు. రైతులను నిలువునా మోసం చేస్తున్న ఈ దళారుల నుండి రైతులను కాపాడడంలో పాలకులు విఫలమవుతున్నారని చెప్పొచ్చు. ఈ పార్టీ, ఆపార్టీ అని కాదు. ఏ పార్టీ అధికారంలో ఉన్న రైతులకు మాటలు, దళారులకు మూటలు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు సరఫరాకాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు అవసరమైతే చట్టానికి మరింత పదును పెడతామని, గత రెండు, మూడు దశాబ్దాలుగా చెప్తూనే ఉన్నారు. కొన్నిరాష్ట్రాల్లో ఈ నకిలీ, నాసిరకం విత్తనాల వ్యాపారులను పట్టుకోవడానికి పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేయిస్తున్నారు. ఆ తనిఖీల్లో కోట్లాది రూపాయల విలువైన నకిలీ, నాసిరకం సరుకులు పట్టుబడుతున్నాయి. కేసులు పెడుతున్నారు. కానీ ఆ కేసుఏమౌతున్నాయి? అదే నకిలీ వ్యాపారులు తమ కార్యక్రమాలను మళ్లీ ఎలా కొనసాగించగలుతున్నారు? అన్నీ ప్రశ్నలే. ఇక కొనుగోళ్లలో జరుగుతున్న మోసాలు అన్నీ ఇన్నీ కావు. మొన్న హన్మకొండ జిల్లా శాయం పేట ప్రాంతంలో కొనుగోళ్లలో జరిగిన భారీ మోసం పరాకాష్ఠగా చెప్పొచ్చు. రైతులనే కాదు ఏకంగా ప్రభుత్వానికి కూడా కుచ్చుటోపి పెట్టారు. బహుశా దేశంలోనే ఇలాంటి దగా ఎక్కడా జరిగి ఉండకపోవచ్చు. కొందరు ఉద్యోగులు తమ బినామీ పేర్లపై వడ్లు పండించినట్లు, మార్కెట్‌కు తీసుకువచ్చినట్లు నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత ఆ వడ్లను తూకం వేసి గోడౌన్‌కు తరలించినట్లు రికార్డులు సృష్టించారు. రవాణా, హమాలీ, తూకం ఖర్చులన్నీ లెక్కలు రాశారు. కోటిఎనభైఆరు లక్షల రూపాయలు పన్నెండు మంది రైతుల ఖాతాల్లో బ్యాంకుల్లో జమచేసుకొని భోంచేశారు. ఫిర్యాదు అందడంతో విజిలెన్స్ విభాగం చేపట్టిన దర్యాప్తులో విస్తుపోయే విషయాలు తెలిసింది. అసలు వడ్లు లేవు. మొత్తం అంతా బోగసే. అన్ని రికార్డులు సృష్టించి డబ్బు భోంచేశారు. కేసు నమోదు చేసి ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్నది. ఇలాగా రైతులనుమోసం చేసే దళారులు ఎందరో ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వ్యవసాయరంగంపై వెచ్చించిన లక్షలాది కోట్ల రూపాయల్లో పదో వంతు నిజమైన రైతులకు చేరి ఉంటే భారతదేశంలో వ్యవసాయరంగం పరిస్థితి ఇలా ఉండేది కాదేమో. ప్రస్తుతం ప్రకృతి వైపరీత్యాలు రైతుల వెన్నువిరిచేస్తున్నాయి. ఎప్పుడు ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకుంటున్నా రాష్ట్రాలకు కేంద్రం అందిస్తున్న సహాయం కంటితుడుపుగానే ఉంటుంది. రైతు లేనిదే రాజ్యమేలేదు. రైతు సంక్షేమ ప్రభుత్వం రైతుశ్రేయస్సే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకుంటున్న పాలకులు అపారనష్టాలతో అప్పుడు ఊబిలో కూరుకుపోతున్న అన్నదాతలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రైతుల పరిస్థితి ఆవేదన భరితంగా ఉందని చెప్పొచ్చు. మరో జీవనాధారం లేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో మాత్రమే వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగి రైతులు కాడి కింద పెడితే అంతకంటే ప్రమాదకర పరిస్థితి మరొకటిఉండదు. ఇలాంటి సమయంలో ప్రజాపాలకుల మని చెప్పుకునేవారు ఆపన్నహస్తం అందివ్వాలి. కానీ నేతలు వాగ్దానాలు, వాచావాత్సల్యాలతో సానుభూతి వర్షాలు కురిపిస్తున్నారు. ఇవి రైతుల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. అందుకే ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. కమిటీలు, సమీక్షలు, నివేదికలంటూ కాలయాపనకు ఇది తరుణంకాదు. అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతినడం దేశానికి క్షేమంకాదు. ఎద్దు విడిచిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్రలో లేదనే విషయం పాలకులు విస్మరించరాదు. ●

# మహాసముద్రాలను ఛేదిస్తున్న సాంకేతికత


డి.మోహన్

భారతదేశ వైజ్ఞానిక ఆకాంక్షలు అంతరిక్షానికే పరిమితం కాకుండా ఇప్పుడు మహాసముద్రాల అట్టడుగున ఉన్న అగాధాలను కూడా ఛేదిస్తున్నాయి. ఇటీవల ఇండోఫ్రెంచ్ సహకారంలో భాగంగా ఇద్దరు భారతీయ శాస్త్రవేత్తలు అట్లాంటిక్ మహాసముద్రంలో 5,000 మీటర్ల లోతుకు విజయవంతంగా ప్రయాణించారు. ఈ చారిత్రక విజయం దేశ వ్యూహాత్మక, శాస్త్రీయ, ఆర్థిక భవిష్యత్తుకు కొత్త ద్వారాలు తెరిచింది. గతంలో ఇస్రో చంద్రయాన్, గగన్‌యాన్ వంటి మిషన్లతో అంతర్జాతీయ వేదికపై తన సత్తాను నిరూపించుకోగా ఇప్పుడు మన దేశం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ వంటి సంస్థల ద్వారా సముద్ర పరిశోధనలో తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. దశాబ్దాలుగా లోతైన సముద్ర అన్వేషణ అనేది అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా, జపాన్ వంటి కొన్ని అగ్రశ్రేణి దేశాల ఆధిపత్యంలో ఉంది. ఈ దేశాలు మాత్రమే సముద్రాల క్లిష్టమైన వాతావరణాన్ని తట్టుకోగల అధునాతన సాంకేతికతను కలిగి ఉన్నాయి. లోతైన సముద్రంలో ఉండే అధిక పీడనం, శీతల ఉష్ణోగ్రతలు, పూర్తి చీకటి వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అత్యాధునిక డిజైన్, బలమైన మెటీరియల్స్ అవసరం. ఈ నేపథ్యంలో, భారత శాస్త్రవేత్తలు సాధించిన విజయం ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ ఘనత మన దేశం ఈ అగ్రశ్రేణి దేశాల సరసన నిలవగలదని నిరూపించింది. ఇది కేవలం సాంకేతిక విజయం మాత్రమేకాకుండా, దేశ దీర్ఘకాలిక వ్యూహాత్మక దార్శనికతకు ఒక సంకేతం. భూమి ఉపరితలంలో ఉన్నదాదాపు 70 శాతం సముద్రమే అయినా అందులో 5 శాతం కంటే తక్కువ భాగాన్ని మాత్రమే మనం పూర్తిగా అన్వేషించాం. ఈ లోతైన సముద్రాలు అపారమైన ఖనిజ వనరులకు నిలయాలు. వీటిలో ముఖ్యమైనవి చూస్తే మొదటివి పాలిమెటాలిక్ నోడ్యూల్స్. ఈ బంగాళాదుంప ఆకారపు ఖనిజాలు నికెల్, కోబాల్ట్, రాగి మాంగనీస్‌లను కలిగి ఉంటాయి. ఇవి ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీకి, పునరుత్పాదక ఇంధన సాంకేతికతకు అత్యంత అవసరం. రెండోది హైడ్రోథర్మల్ సల్ఫైడ్‌లు. ఇవి బంగారం, వెండి, రాగి, ఇతర లోహాలతో కూడిన ఖనిజాలు. ఇవి సముద్ర అడుగున ఉన్న అగ్నిపర్వతాల వద్ద ఏర్పడతాయి. చివరివి రేర్ ఎర్త్‌మెటల్స్. ఇవి స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్లు, రక్షణ రంగ పరికరాల తయారీలో కీలకమైనవి. భవిష్యత్తులో ఈ ఖనిజాల కోసం దేశాల మధ్య పోటీ తీవ్రం కానుంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో ఈ వనరుల ప్రాముఖ్యత పెరుగుతున్న దృష్ట్యా, వాటిపై స్వయంప్రతిపత్తిని సాధించడం మనదేశ జాతీయ భద్రతకు, ఆర్థికాభివృద్ధికి అత్యంత కీలకం. ఈలక్ష్యాలను సాధించడానికి ఈ అన్వేషణలు ఒక పునాది వేస్తాయి. భారతదేశం ఇప్పటికే ఇంటర్నేషనల్ సీబెడ్ అథారిటీ ద్వారా మధ్య హిందూ మహాసముద్రంలో 75,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఒక మైనింగ్ సైట్‌ను కేటాయించుకుంది. ఈ సైట్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి, లోతైన సముద్ర అన్వేషణ, మైనింగ్ సాంకేతికతలను అభివృద్ధి చేయడం తప్పనిసరి. ఈ చారిత్రక ఘనత సాధించడంలో ఫ్రాన్స్‌తో ఉన్న భాగస్వామ్యం చాలా ముఖ్యమైనది. ఫ్రెంచ్ సబ్‌మెర్సిబుల్ సహకారంతో లోతుకు వెళ్లడం, భారతీయ శాస్త్రవేత్తలకు క్లిష్టమైన డీప్‌సీ ఆపరేషన్లలో విలువైన అనుభవాన్ని అందించింది. ఈ సహకారం మన శాస్త్రవేత్తలకు నైపుణ్యాన్ని అందించడమే కాకుండా మన స్వదేశీ ప్రాజెక్టు అయిన మత్స్యఆరువేల సబ్‌మెర్సిబుల్ అభివృద్ధికి కూడా ఉపయోగపడింది. ●

# ట్రంప్ నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

వి.వి.కే.సురేష్

స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో ప్రపంచ దేశాలకు ఆర్థిక నీతి సూత్రాలు వల్లించిన అమెరికా ఆర్థికంగా తీవ్రమైన గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. అమెరికా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన తర్వాత డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై భారీ సుంకాలతో ఏకపక్ష వాణిజ్య యుద్ధానికి (ట్రేడ్ వార్) తలపడ్డాడు. 2008లో ప్రారంభమైన అమెరికన్‌ఆర్థిక సంక్షోభం నేటికీ కొనసాగుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక సంక్షోభాలు సహజ సిద్ధమని ఎన్నోసార్లు రుజువైంది. సంక్షోభాల ప్రభావానికి ప్రధానంగా గురయ్యేది సామాన్య ప్రజలే, సంపన్నులు కాదు. ఒక వైపు లాభాపేక్ష, దురాశ మరో వైపు తీవ్రస్థాయి యాంత్రీకరణ, ఉపాధి కొరత వంటి కోట్లాది మంది ప్రజల జీవన స్థితిగతులను దుర్భరం చేస్తున్నాయి. తాజాగా అమెరికా ఆర్థిక వ్యవస్థ షట్‌డౌన్‌కు గురైంది. ప్రభుత్వ నిధుల విడుదల ఆగిపోయింది. ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోయి అక్కడి ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడింది. గత కొన్ని నెలలుగా ప్రపంచ దేశాలపై సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ అనేక ప్రకటనలు చేశాడు. అమెరికా అగ్రవాదానికి, పెత్తనానికి సవాళ్లు ఎదురయ్యాయి. డాలర్ ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు ట్రంప్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. చైనా, బ్రెజిల్, ఇరాన్ వంటి కొన్ని దేశాలు వెంటనే ధీటుగా స్పందించాయి. ఏకపక్షంగా సుంకాలు విధించడాన్ని అమెరికన్ ఫెడరల్ కోర్టు కూడా తప్పు పట్టింది. ట్రంప్ తీసుకున్న పలు ఏకపక్ష నిర్ణయాల పట్ల అమెరికా ప్రజల నుండి కూడా తీవ్రవ్యతిరేకత వ్యక్తమవుతోంది. భారత్ తమపై అత్యధిక శాతం టారిఫ్‌లు విధిస్తోందని, రష్యా నుండి చమురు దిగుమతులను వెంటనే నిలిపి వేయాలని, లేకుంటే మరో 25 శాతం అదనపు సుంకాలు విధిస్తామని, అసలు రష్యా ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధానికి భారత్, చైనాలే కారణమని ఇలా అనేక ఆరోపణలు ట్రంప్ భారత్ పై వరుసగా చేస్తూనే ఉన్నాడు. వివిధ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు సవ్యంగా జరిగేలా చూసేందుకుగాను గాట్ స్థానంలో 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ) ఏర్పడిన విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఉనికి కూడా నేడు ప్రశ్నార్థకంగా మారిపోయింది. మన దేశంపై ట్రంప్ మొత్తం 50 శాతం దిగుమసుంకాలు విధించడంతో వాణిజ్యంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. మరోవైపు అమెరికా, భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. చర్చలు కొనసాగుతున్నాయి. అయితే భారత్‌కు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి వ్యవసాయోత్పత్తులు, పాలపొడి వంటి ఇతర ఉత్పత్తులు పెద్ద ఎత్తున ఎగుమతి చేయాలని, 140 కోట్లకు పైగా జనాభా కల్గిన ఇండియాలోని భారీ మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని అమెరికా తహతహలాడుతోంది. అందుకుగాను సరళమైన సుంకాలతో తమకు అనుమతి



ఇవ్వాలని కొన్ని దశాబ్దాలుగా అమెరికా మన దేశంపై ఒత్తిడి చేస్తోంది. మన ప్రభుత్వం తలొగ్గితే దేశీయ చిన్న, సన్నకారు రైతులు, పాడి రైతుల జీవితాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతుంది. భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి అమెరికా 50 శాతం సుంకాలు విధించడంతో జౌళివస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, వజ్రాలు, స్వర్ణాభరణాలు, పాదరక్షలు, సుగంధ ద్రవ్యాలు, రబ్బర్, రొయ్యలు, చేపలు, ఇతర మత్స్య సంపదతో సహా వీటన్నిటి ఉత్పత్తిలో భాగస్వాములైన కొన్నిలక్షల మందిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ట్రంప్ సుంకాల దెబ్బకు పెద్ద ఎత్తున ఎగుమతులు ఆగిపోతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా అభివృద్ధి చేస్తానని, తయారీ రంగంలో దేశాన్ని మేటిగా నిలుపుతానని, అన్నింటా అమెరికాయే ఫస్ట్ అని నినదిస్తూ, శ్వేతజాతి దురహంకారాన్ని రెచ్చగొట్టిరెండో దఫా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ పెట్రేగిపోతున్నాడు. భారత్‌పైనే గాక బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో, కెనడా తదితర దేశాలపై భారీ సుంకాలు విధించి అమెరికా మళ్లీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని, ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి చేస్తున్న యత్నాలు అంతర్జాతీయ వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. అమెరికాలో విడుదలయ్యే మన సినిమాలపైన 100 శాతం, ఫార్మాకు సంబంధించి బ్రాండెడ్ ఔషధాలపై 100శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే మన దేశం ఎక్కువగా జనరిక్ మందులను ఎగుమతి చేస్తుండటంవల్ల ప్రస్తుతానికి పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే మన కలపపై 10 శాతం, ఫర్నిచర్‌పై 25 శాతం సుంకాలు మోపుతామని చెప్పారు. అమెరికా జారీ చేసే హెచ్1బి వీసాలపై ట్రంప్ ఎన్నో ఆంక్షలు విధించారు. అన్ని రంగాల సంస్థలు కృత్రిమ మేధ (ఏ.ఐ) సాంకేతికతను వినియోగించడంపైన దృష్టి సారించాయి. ఐ.టి రంగ నిపుణులకు ఇది పెద్ద పిడుగు లాంటి వార్త. హెచ్ 1బి వీసాల సహాయంతో అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి పలు ఐ.టి కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేస్తాయి. సుమారు 70 శాతం మంది భారతీయులే ఉంటారు. ఇప్పుడు కొత్త ధరఖాస్తుదారులు లక్ష డాలర్ల రుసుం చెల్లించాల్సి ఉంటుంది. గత సంవత్సర కాలంలో హెచ్ 1బి వీసాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం గమనార్హం. ట్రంప్ నిలకడలేని నిర్ణయాలవల్ల అనేకమంది యువత భవిష్యత్ అగమ్యగోచరంగా వుంది. హెచ్1 బీ వీసా ధరఖాస్తుల ఫీజు పెంపుదలకు వ్యతిరేకంగా పలు సంస్థలు, యూనివర్శిటీ ప్రొఫెసర్లు అమెరికాలోని న్యాయస్థానంలో ఇటీవల దావాదాఖలు చేయడం జరిగింది. ఏ దేశంతోనైనా వాణిజ్యపరమైన సంబంధాలు, ఒప్పందాలు పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికగానే జరగాలి. ట్రంప్ నిర్ణయాలు అమెరికాకు నష్టం కలిగిస్తాయని ఆయుధ తదితర పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళనవ్యక్తం చేయటంతో పెంటగన్ సూచనపై కంపెనీలు తమకు అవసరమైన నిపుణులను ఉద్యోగాలలోకి తీసుకోవచ్చునని మినహాయింపు ఇవ్వడం కొంత మేరకు ఊరట కలిగించేదే. భారత్ అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఖరారయితే, అది ఎంత వరకూ మన దేశ ప్రయోజనాలను కాపాడేలా ఉంటుందో చూడాలి. స్వతంత్రమైన విదేశాంగ, వాణిజ్య విధానాలను భారత్ గతంలో అనుసరించేది. కానీ గత పన్నెండు సంవత్సరాలుగా మనప్రభుత్వం అనుసరిస్తున్న విదేశీ విధానాల్లో వచ్చిన పెనుమార్పులు మన స్వతంత్రతనుదెబ్బతీస్తున్నాయి. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో మన ప్రభుత్వ ఆలోచనలు, అనుసరిస్తున్న విధానాలు వెంటనే మార కపోతే దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందని గ్రహించాలి. ●

# గుంటూరు వార్త

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ ఏర్పాట్లు నిర్వహణ చర్చించిన ఎస్పీ జిందాల్

గుంటూరు క్రైమ్, అక్టోబర్ 17,ప్రభాతవార్త: పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీన జరగనున్న ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులతో చర్చించారు , మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ ఆక్టోపస్ గ్రౌండ్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిందాల్ అమరవీరుల స్తూపం, వీవీఐపీ వీఐపీ కూర్చునే వేదికలు, పోలీస్ గార్డ్



ఆఫ్ హానర్ ప్రాంతం, స్టేజి నిర్మాణ పనులు ,ఇతర లాజిస్టిక్ ఏర్పాట్లను సమీక్షించి, పలు ముఖ్య సూచనలు చేశారు. అన్ని నిర్మాణ పనులను నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని, ప్రతి విభాగం సమన్వయంతో, కచ్చితత్వంతో పనిచేయాలన్నారు. అమరవీరుల త్యాగాలను ప్రతిబింబించేలా కార్యక్రమాన్ని గౌరవప్రదంగా , అద్భుతంగా నిర్వహించాలన్నారు. పోలీస్ అమరవీరుల సం స్మరణ



దినోత్సవం కార్యక్రమం పోలీస్ శాఖకు గర్వకారణమైన రోజు అన్నారు.. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పోలీస్ సిబ్బందికి గౌరవం, బాధ్యత అని చెప్పారు. అమరవీరుల స్ఫూర్తిదాయక చిత్రాలు, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ సిబ్బంది ధైర్య సాహసాలను ప్రతిబింబించే ఫోటో గ్యాలరీ ఏర్పాటుకు సంబంధించిన ప్రదేశాన్ని ఎస్పీ పరిశీలించారు. అదేవిధంగా, గ్యాలరీ రూపకల్పనపై సంబంధిత అధికారులకు వివరమైన సూచనలు




అందజేశారు. ఈ సమీక్ష కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏపీ ఎస్పీ 6వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ మురళీ, గుంటూరు జిల్లా అదనపు ఎస్పీ (ఎ వీ) రవికుమార్, నార్త్ డీఎస్పీ మురళీ కృష్ణ , ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, [illegible] బెటాలియన్ అధికారులు, ఇంజినీరింగ్ మరియు టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో నూతన వీసీ బాధ్యతల స్వీకారం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు17, ప్రభాతవార్త: వర్సిటీ నూతన రెగ్యులర్ వీసీగా నియమితులైన ఆచార్య ఎస్.వి.సత్యన్నారాయణ రాజు కొద్ది రోజుల్లో బాధ్యతలు చేపడతారని ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య రామినేని శివరాంప్రసాద్ వెల్లడించారు. ప్రభాతవార్తతో ఆయన మాట్లాడారు. ఈనెల 8న నూతన వీసి నియామకం జరిగిందని ఆయన తాను చేసే యూనివర్సిటీ నుంచి రిలీవ్ అయిన్యు త్వరలో నాగార్జున యూనివర్సిటీకి వస్తారని చెప్పారు. కాగా వర్సిటీలో 2024 జూలై నుంచి ఇన్‌చార్జ్ వీసి పాలన ఈనెల 8వ తేదీ వరకు సాగింది. ఇన్‌చార్జ్ వీసిగా పాలించిన ఆచార్య గంగాధరరావును ప్రభుత్వం విధుల నుంచి తప్పించింది. అప్పటి నుంచి దాదాపు మూడు వారాల సమయం తరువాత సత్యన్నారాయణ రాజు వీసిగా విధుల్లో చేరనున్నారు. ఇదిలా ఉండగా వీసి లేకపోవడంతో వర్సిటీలో రెగ్యులర్ కార్యకలాపాలు ఆగిపోయాయని కొందరు ఇన్‌చార్జ్ వీసిగా నియమిస్తారంటూ ప్రచారం చేశారు. చాలా మందికి ఇప్పటికీ వేతనాలు అందలేదని, వేతనాల కోసం పలువురు ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. కొన్ని కేటగిరిలకు ప్రతీ నెల 25వ తేదీ నుంచి వేతనాలకు బిల్లులు సిద్ధం చేస్తారు. తదుపరి నెల మొదటి వారంలోగా దాదాపు అందరికి వేతనాలు జమ చేయడం జరుగుతుంది. కానీ గత నెలలో బిల్లులు పెట్టినా కొందరికి వేతనాలు జమ కాలేదని వాపోతున్నారు. మాజీ వీసి గంగాధరరావు 8వ తేదీ వరకు విధుల్లో ఉన్నారు. అయినా వేతనాలు రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో రెగ్యులర్ వీసి వచ్చే వరకు వర్సిటీ కార్యకలాపాలు స్తంభించిపోనున్నాయంటూ ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారు. దీంతో వర్సిటీలో సాధారణ కార్యకలాపాలు కొనసాగాలంటే రెగ్యులర్ వీసి వచ్చేంత వరకు ఇన్‌చార్జ్ వీసిని నియమించాలనే డిమాండ్ వస్తుంది. ఏఎన్‌యుకు మరొకసారి ఇన్‌చార్జ్ పాలన రానుందని కొందరు జోస్యం చెప్తున్నారు. ఈ విషయాలను రెక్టార్ కొట్టిపారేశారు. నూతన రెగ్యులర్ వీసి సత్యన్నారాయణ రాజుతో తాను మాట్లాడినట్లు చెప్పారు. వర్సిటీలో జరుగుతున్న ఫేక్ ప్రచారాలను నమ్మవద్దని, పాలన సాఫీగా సాగుతుందన్నారు. త్వరలో వసతిగృహాల సందర్శన చేస్తానని, అలాగే అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడి అకడమిక్‌గా తరగతులు రెగ్యులర్‌గా జరిగేలా చర్యలు తీసుకుంటామని తరగతులు ఆకస్మిక సందర్శన కూడా చేపడతామని పేర్కొన్నారు. కొత్త విద్యార్థుల రాకతో వర్సిటీలో విద్యా వాతావరణం కోలాహలంగా మారిందన్నారు.

## గత 6 నెలల్లో మీ శాఖ పనితీరు ఎలాఉంది?


### విభాగాధిపతులనుంచి స్పందన కోరిన మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 17: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి 6 నెలల్లో (ఏప్రిల్ సెప్టెంబర్, 2025) వైద్యారోగ్య మంత్రిత్వ శాఖలోని 10 వివిధ విభాగాల పనితీరును సమీక్షించడానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ నూతన పంథా చేపట్టారు. ఈ కాలంలో ఆయా విభాగాలు సాధించిన ఫలితాలు, సమస్యలు /అడ్డంకులు పరిష్కారం, సాధించిన మార్పు ఆధారంగా పనితీరు బాగా ఉందా, సంతృప్తి కరంగా ఉందా లేదా అని మీరే చెప్పాలని 10 విభాగాధిపతులకు మంత్రి సూచించారు. 20 అంశాల ఆధారంగా పనితీరును మదింపు చేయాలని మంత్రి సూచించారు. ఏప్రిల్ సెప్టెంబర్ కాలానికి సంబందించి వివిధ విభాగాలు అందించే సమాచారం ఆధారంగా మంత్రి సత్యకుమార్ వైద్యరోగ్య శాఖ పనితీరును సమీక్షించనున్నారు. 14,000 ప్రభుత్వ డిస్పెన్సిరీలు, ఆసుపత్రులు, పలు ఆరోగ్య పథకాల అమలుకు సంబంధించి వైద్య సేవలు, పథకాల అమలు నాణ్యత, ఫలితాల మదింపు పై దృష్టి సారించిన మంత్రి వినూత్నంగా విభాగాధిపతుల నుంచే పనితీరు అంచనాలు కోరడం విశేషం. పనితీరు,ఫలితాలను నిర్దిష్టంగా అంచనా వేయడానికి స్పష్టమైన కొలమానాలుండాలని భావించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, ఈ దిశగా 20 అంశాలను సూచించారు.

వైద్య సేవలు, పథకాల అమలులో మెరుగుకోసం ఆయా శాఖలు ప్రవేశపెట్టిన / సాధించిన ఐదు మార్పులు ఏవి, ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిలో పరిస్కారం చేసిన వాటి వివరాలు, నూతన మౌలిక సదుపాయాల కల్పన, వైద్య సిబ్బంది నియామకాలు, ఓపి మరియు ఐపి సేవల్లో ప్రగతి, డయాగ్నోస్టిక్ సేవల సంఖ్య మరియు పరికరాల కొనుగోలు, వైద్యులు మరియు ఇతర సిబ్బంది హాజరు, బడ్జెట్ కేటాయింపులు మరియు గత 6 నెలల్లో ఖర్చు వివరాలు, వైద్య సేవల విస్తరణ మరియు నూతన సేవల ప్రారంభం మొదలైనవి. వివిధ విభాగాధిపతుల నుండి ప్రత్యక్షంగా పనితీరు అంచనాపై స్పష్టమైన స్పందన మరియు 20 వివిధ అంశాలకు సంబంధించి సమాచారం ఆధారంగా త్వరలో మంత్రి సత్యకుమార్ యాదవ్ చేపట్టానున్న సమీక్షపై మంత్రిత్వ శాఖలో చర్చ జరుగుతోంది.

## . సమాజ ప్రయోజనాల కోసం కృత్రిక మేథస్సు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయం,అక్టోబరు17, ప్రభాతవార్త: నేటి ఆధునిక యుగంలో ప్రతీ రంగం కృత్రిమ మేథస్సు (ఏఐ)పై ఆధారపడుతుందని అమెరికాలోని శాన్‌డియాగోలో ఉన్న ఎక్సిక్లెన్స్ సంస్థ సిఇఓ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ఆర్.సుబ్ర హ్మణ్యం పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం టెక్నలాజికల్ అడ్వాన్‌సెస్ ఇన్ ఏఐ: కంప్యూటింగ్, కమ్యునికేషన్స్ అండ్ కంజ్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఫర్ సొసైటల్ బెనిఫిట్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా పాల్గొన్న డాక్టర్ సుబ్రహ్మణ్యం కీలకోపన్యాసం చేశారు. ఆయన మాట్లాడుతూ



భవిష్యత్ ఉద్యోగాలు ఏఐ సాంకేతికతలను ఆధారం చేసుకుని ఉంటాయన్నారు. విద్యార్థులు ఏఐ డేటా సైన్స్, కంప్యూటింగ్ వంటి రంగాలలో పునాది జ్ఞానం సాధించాలన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమనుతాము సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కార దృక్పదం, బహుముఖ ఆలోచనా శక్తి, సృజనాత్మకత అనేవి భవిష్యత్ ఇంజనీర్లకు అత్యంత అవసరమన్నారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేథస్సు, విద్య, పరిశోధన, సమాజ అభివృద్ధిలో కలిగిస్తున్న మార్పులపై ప్రస్తావించారు. విద్యార్థులు కేవలం ఉపాధి అవకాశాల కోసం కాకుండా సమాజ సమస్యల పరిష్కారానికి కూడా ఏఐను ఉపయోగించగలగాలని సూచించారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్.లింగరాజు, ఐఎంఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ డి.బి.రత్నాకర్‌లు మాట్లాడారు. ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'గ్రీవెన్స్ డే"లో అర్జీలు స్వీకరించిన సిఆర్డిఏ అడిషనల్ కమిషనర్ భార్గవ తేజ

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 17: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సిఆర్డిఏ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. వార్షిక కౌలు చెల్లింపు, గ్రామకంఠం సమస్యలు, రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ తదితర సమస్యల గురించి పలువురు రాజధాని ప్రాంతవాసులు తమ అర్జీలను "గ్రీవెన్స్ డే"లో అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవ తేజ ఐఏఎస్ గారికి అందజేశారు. అర్జీదారులు అందజేసిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ గారు అర్జీదారులకు తెలియజేశారు. ఏపీ సిఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అర్జీదారులు తెలియజేసిన పలు ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. సమస్యలు పరిష్కరించటంలో అలసత్వం వద్దని అదనపు కమిషనర్ గారు అధికారులకు సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



గ్రీవెన్స్ డేలో 39 ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఇవి: 1.అమరావతిలో భూమి వ్యవహారాలు = 35 2. ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా = 3 3. సామాజిక సంక్షేమం = 1 గ్రీవెన్స్ డేలో గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్(బిళిలీ) నోడల్ అధికారి పి.జయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.శేషిరెడ్డి, కే.ఎస్.భాగ్యరేఖ, పి. పద్మావతి, ఏ.జి.చిన్ని కృష్ణ, జి. రవీందర్, బి. సాయి శ్రీనివాస్ నాయక్, సిఆర్డిఏ సామాజిక సంక్షేమ విభాగ దీదిదీవీ బొర్రా శ్రీనివాసరావు, ఎస్టేట్స్ విభాగ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే(లితి) ఎస్. రవీంద్ర ప్రసాద్, డెవలప్మెంట్ ప్రమోషన్ విభాగ జోనల్ జాయింట్ డైరెక్టర్ సి.హెచ్. మధుసూధనరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## వెంకటపాలెంలో గ్రామసభ నిర్వహించిన సిఆర్డిఏ కమిషనర్ కన్నబాబు

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 17: ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతులతో సిఆర్డిఏ అధికారులు నిర్వహించే గ్రామసభ అక్టోబర్ 16వ తేదీ సాయంత్రం వెంకటపాలెంలో జరిగింది. గ్రామసభలో సిఆర్డిఏ కమిషనర్ కె.కన్నబాబు ఐఏఎస్ గారు, అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవతేజ ఐఏఎస్ గారు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. గ్రామంలోని రైతులు ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను, గ్రామాభివృద్ధికి సిఆర్డిఏ తీసుకోవాల్సిన చర్యలను కమిషనర్ గారికి వివరించారు. స్థానికులు చెప్పిన పలు సమస్యలను సావధానంగా విన్న కమిషనర్ గారు.. కొన్ని సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించారు. మిగిలిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే స్థానికంగా మౌలికవసతుల కల్పనకు చేపడుతున్న కార్యకలాపాలను గ్రామస్తులకు తెలియజేశారు. అమరావతి నిర్మాణంలో రైతులు, భూయజమానులు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని కమిషనర్ గారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కమిషనర్ గారు, సిఆర్డిఏ అధికారులు చేసిన విజ్ఞప్తికి రైతుల నుంచి సానుకూల స్పందన లభించింది. గ్రామసభలో డైరెక్టర్ ల్యాండ్స్(క్యాపిటల్ సిటీ) వసంతరాయుడు, దిళిదీతి ప్లానింగ్ విభాగ డైరెక్టర్ బి.సురేష్ కుమార్, సామాజిక సంక్షేమ విభాగ గ్రూప్ డైరెక్టర్ వి.రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఎస్.భాగ్యరేఖ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వరల్డ్ ట్రామా డే అవగాహన కార్యక్రమం

గుంటూరు ఈస్ట్ క్రైమ్, అక్టోబర్ 17, ప్రభాతవార్త: వరల్డ్ ట్రామా డే సందర్భంగా కొత్తపేట ఏరియాలోని అమృత హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేయడం జరిగింది.




ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తపేట సీఐ శ్రీ ఎం వీరయ్య ట్రాఫిక్ సిఐ అశోక్ కుమార్ పాల్గొని రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత ఆ వ్యక్తి కుటుంబం ఆర్థిక కష్టాలలోకి వెళుతుందని, వాహన శోధకులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ద్విచక్ర వాహనములను నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, ర్యాష్ డ్రైవింగ్, స్నేక్ డ్రైవింగ్, చేయరాదని, మైనర్స్ నీ వాహనములు నడుపుటకు ఇవ్వరాదని చెప్పారు. అందరికీ కుటుంబాలు ఉన్నాయన్న విషయం దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలన్నారు. డాక్టర్ హేమంత్ ఉప్పుటూరి, డాక్టర్ మద్ది వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

తుళ్ళూరు,అక్టోబర్ 17,ప్రభాతవార్త : రాజధాని ప్రాంతంలో భూములిచ్చిన రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.శుక్రవారం తుళ్ళూరు సీఆర్డీఏ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్సడే లో పలువురు రైతులు అడిషనల్ కమీషనర్ భార్గవ్ తేజను కలసి తమ సమస్యలను వివరించారు.రైతులు మాట్లాడుతూ ప్లాట్లకు సంబంధించిన రహదారి పనులు,పూలింగ్‌కు ఇవ్వని భూములకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించడం,పలు టెక్నికల్ ఇబ్బందుల కారణంగా ప్లాట్ల హ్యాండోవర్ ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు.ఈ అంశాలన్నింటిని ఓర్పుతో విన్న అడిషనల్ కమీషనర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ,రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు వేగవంతం చేస్తామని,సంబంధిత విభాగాలతో చర్చించి త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

## పశ్చిమలో మెప్మా అధికారులతో సమీక్షా సమావేశం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు వెస్ట్, అక్టోబర్ 17,ప్రభాతవార్త : పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలోమెప్మా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మెప్మా కార్యాలయాల పనితీరులో పారదర్శకత పూర్తిగా ఉండాలన్నారు.ప్రతి సీఈవో,ప్రతి ఆర్పితో,ప్రతి ఆర్పి తమ పరిధిలోని గ్రూపులతో క్రమం తప్పకుండా మీటింగ్‌లు ఏర్పాటుచేసి,ఆ సమావేశాల మినిట్స్‌ను నమోదు చేసి సంబంధిత అధికారులకు నివేదించాల్సిన



అవసరం ఉందన్నారు.మెప్మా వ్యవస్థలో డెటా పారదర్శకత పూర్తిగా లోపించిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.వందల కోట్ల రూపాయల సా క్రమ్‌లకు సంబంధించిన ఫిర్యాదులు బయటకు వచ్చినా ఇప్పటికీ వ్యవస్థను సరిచేసే ప్రయత్నం జరగలేదన్నారు.బ్యాంకులు,సీఈఓలు,సిఎంఓలు వంటి అని న స్థాయిల్లో పారదర్శకత లేకుండా జరిగే అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా క్రింది స్థాయిలో ఉన న మెప్మా సిబ్బంది పనిచేస్తే వారి పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.డ్వాక్రా పథకాన్ని రాష్ట్రానికి తీసుకొచ్చింది చంద్రబాబు నాయుడేనని ఎమ్మెల్యే గుర్తు చేశారు.మెప్మా సిబ్బంది ఎవరైనా ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలుచేస్తే లేదా అవినీతి పద్ధతులు అనుసరిచే వారి లాగిన్‌లను వెంటనే రద్దుచేయాలి.మెప్మా,గుంటూరు పశ్చిమలో పూర్తి పారదర్శకంగా ఉండాలన్నారు.ప్రజల ప్రయోజనమే ప్రధాన లక్ష్యం ఎవరైనా అవినీతి పరంగా వ్యవహరిస్తే వారిని తపి ంచడంలో ఎలాంటి ంశయం ఉండదని ఎమ్మెల్యే స్పష్టంచేశారు.ప్రజల కోసం పనిచేయడం,న్యాయం చేయడం మన బాధ్యత గుంటూరు పశి చమలో పారదర్శకతతో నిండిన పరిపాలన తప్పనిసరి అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

## పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ డే

గుంటూరు క్రైమ్ , అక్టోబర్ 17,ప్రభాతవార్త : జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ సిబ్బంది వినతులు,సమస్యల పరిష్కారానికై పోలీసు స్టాఫ్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది నుండి వివిధ వినతులు,ఫిర్యాదులను స్వీకరించి,వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను



ఆదేశించారు.కార్యక్రమంలో మొత్తం 15మంది పోలీస్ సిబ్బంది తమ బదిలీలు,సర్వీసు సంబంధిత సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు సమర్పించగా వాటిపై ఎస్పీ సానుకూలంగా స్పందించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.సిబ్బంది తమ సమస్యలను నేరుగా ఎస్పీ కార్యాలయానికి వచ్చి తెలియజేయ వచ్చని కూడా ఆయన పేర్కొన్నారు.విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది నిబద్ధత,క్రమశిక్షణ,సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమమైన పోలీస్ సేవలు అందించాలని,ప్రజల్లో భరోసా కల్పించే విధంగా కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

## 19న అవగాహన...లో ఆరోగ్యసభ

గుంటూరు కల్చరల్,అక్టోబర్ 17,ప్రభాతవార్త : అవగాహన సంస్థ గత 18సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈవారం ఆయుర్వేద వైద్యవిధానంతో సంపూర్ణ ఆరోగ్యం అన్న అంశంపై సభ నిర్వహించనుంది.అక్టోబర్ 19 ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్యసభకు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ పి.ఎస్.ఆర్.శివకళ్యాణ్ ప్రధానవక్తగా పాల్గొంటారన్నారు.జీవనశైలిలో చేసుకోవలసి మార్పుల గురించి తెలియజేయబడే ఈ ఆరోగ్యసభ కు ప్రజలు విరివిగా హాజరు కావలసిందిగా అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి-ఎమ్మెల్సీ ఆలపాటి

గుంటూరు విద్య,అక్టోబర్ 16,ప్రభాతవార్త : స్థానిక ఇన న్నర్ రింగ్‌రోడ్డులోని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నివాసంలో అర్బన్ బ్యాంక్ చైర్మనో బోనబోయిన శ్రీనివాస యాదవ్,రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ బ్రాహ్మణ నిరుద్యోగ యువతకు మంచి అవకాశాలు కల్పించేందుకు సమాఖ్య




చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.బ్రాహ్మణ సామాజిక వర్గంతోపాటు ఇతర సామాజిక వర్గాలకు మెగా జాబ్‌మేళాలో అవకాశం కల్పించడం శుభతరణం అని క్యూర్ కోడ్ ద్వారా జాబ్ మేళాలో రిజిస్టర్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నిరుద్యోగులకు మంచి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు.నేటి పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు విశేష కృషి చేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పులిపాక ప్రసాద్,జాబ మేళా మెంబర్లు,కొప్పర్తి సీతారమేష్,మంచికంటి దివాకర్,గుంటూరు జిల్లా అధ్యక్షులు లలిత శాస్త్రి,కార్యదరి మురళీకృష్ణ,జిల్లా కార్యదర్శి యేటూరి చక్రధర్,మాటేటి నాగరాజు,మాదిరాజు తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 22 వరకు ప్రదర్శన

గుంటూరు విద్య,అక్టోబర్ 17,ప్రభాతవార్త : ప్రపంచంలో అతిపెద్ద జ్యూవెలరీ సంస్థ మలబార్ గోల్డ్ డైమండ్స్ తమ గుంటూరు షోరూంలో మైన్ డైమండ్స్ షోని ప్రారంభించింది.ఈ షోకి ముఖ్యఅతిధులుగా డాక్టర్ హిమజా మామిడాల,డాక్టర్ కె.వి.పవన్‌కుమార్,పెద్ది రమణరావు (వ్యాపారవేత్త) చేతుల మీదుగా ప్రారంభమైంది.వినియోగదారులు,శ్రేయోభిలాషులు,మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.గుంటూరు షోరూంలో అక్టోబర్ 17నుంచి 22వ తేది వరకు ఈ డైమండ్ షో కొనసాగుతుంది.కారక్రమంలో నదీర్ స్టోర్ హెడ్, జితిన్,గోపికిరణ్ మార్కెటింగ్ మేనేజర్,మలబార్ సిబ్బంది పాల్గొన్నారు.

## కుల ఆధారిత వివక్ష అణచివేతపై నిరంతర పోరాటం అవసరమే




గుంటూరు కల్చరల్,అక్టోబర్ 17,ప్రభాతవార్త : కుల అసమానతలను ఎదుర్కొనడానికి,ఉద్యోగాలు అవసరమే కానీ అవిమాత్రమే సరిపోవని,కుల ఆధారిత వివక్ష అణచివేతలపై నిరంతర పోరాటం అవసరమేనని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.సంస్థకార్యాలయంలో కొత్త ముసుగులతో ముందుకెళుతున్న కులం అన్న అంశంపై చర్చజరిగింది.చర్చలో సీనియర్ విద్యావేత్త విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో కుల వ్యవస్థను పటిష్టం చేసేందుకు మనువాద శక్తులు ప్రయత్నాలను తీవ్రతరం చేశాయని ఆ దుర్మార్గపు ఆలోచనలతోనే ఉన్నతస్థాయి అధికారులపై కూడా దాడులు జరుగుతున్నాయన్నారు.రాయ్‌బరేలీ లో హరిఓం వాల్మీకి హత్య,చండీఘడ్‌లో ఐపిఎస్ అధికారి వై. పూరణ్ కుమార్ ఆత్మహత్య, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ మీద బూటు విసిరే ప్రయత్నం లాంటివి దేశంలో కుల రహిత అధికార సామ్యం ఒక మిధ్య అని నిరూపిస్తున్నా యన్నారు.అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ సిజేఐ గవాయ్ రాజ్యాంగం వ్యవస్థలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించినా సామాజిక వ్యవస్థలో ఆయన స్థానం మారలేదని బూటు దాడి ఘటన గుర్తు చేస్తుందన్నారు.

R.V.R. & J.C. COLLEGE OF ENGINEERING (Autonomous)
Chandramoulipuram, Chowdavaram, Guntur Dt-522019, Approved by AICTE, Permitted by Govt. of AP
Affiliated to ANU :: Non-minority Institution: NAAC 'A+' Grade
B.Tech. Courses Accredited by NBA - CSE, IT, EEE, MECH, ECE ... 
Website: www.rvrjce.ac.in, Ph:0863-2288201

ADMISSION NOTIFICATION FOR FIRST YEAR B.TECH CATEGORY-B SEATS UNDER MANAGEMENT QUOTA

Applications are invited from eligible candidates for admission into First Year B.Tech., Category-B seats under Management Quota for the academic year 2025-26 for the following courses.

| B.Tech Course | Chemical | Civil | CSE | CSB | CSD | CSM | CSO | ECE | EEE | IT | ME |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| Sanctioned intake | 60 | 120 | 360 | 60 | 180 | 180 | 60 | 180 | 120 | 180 | 120 |
| Category B Seats under Management Quota | 18 | 36 | 108 | 18 | 54 | 54 | 18 | 54 | 36 | 54 | 36 |

Applications can be directly obtained from the College Office from 19.10.2025 to 23.10.2025. Filled in applications along with copies of relevant certificates and non-refundable Registration fees of Rs 1,000/- for APEAPCET 2025 Qualified Candidates and Rs 1,200/- for Not-Qualified / Not Appeared in APEAPCET-2025 Candidates in cash or by DD drawn in favour of the College can be submitted in the College Office in person between 10.00 am to 4.00 pm on or before 23.10.2025. Applications can be submitted through online also. The eligibility and admission will be as per Government rules. Tuition Fee shall be paid as per the Govt. Orders. Selected list will be displayed on the College website and Notice Board as per rules. Please go through the College website www.rvrjce.ac.in for further details.

Chowdavaram, 18-10-2025.
Sd/- SECRETARY & CORRESPONDENT

## మాయబజార్‌లో ట్రాఫిక్ సమస్యకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు వెస్ట్,,అక్టోబర్ 17,ప్రభాతవార్త : మాయబజార్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు.నియోజకవర్గంలో డిప్యూటీ మేయర్ సజీల,సర్కిల్ఇన్‌స్పెక్టర్ అశోక్ లతో కలసి ఎమ్మెల్యే నసీర్ మాయబజార్ ప్రాంతాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా మాయబజార్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.ఈ ప్రాంతంలో వందల సంఖ్యలో వ్యాపారులు,కార్మికులు పనిచేస్తున్నారన్నారు.అయితే ట్రాఫిక్ సమస్య అధికంగా ఉన్నందున ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి స్థానిక అక్రమణలు తొలగించాలని వ్యాపారులను ఎమ్మెల్యే కోరారు.కార్యక్రమంలో కార్పొరేటర్ చీష్తి,సయ్యద్ అన్వర్,ఎస్ఎస్పీ జాదా,హిదాయతుల్లా,జునేత్,సుభాని,ఫహీముల్లా,ఖాశీం షరీఫ్,కలీం,గఫారి,రసూల్ ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రవాణా శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు వెస్ట్,అక్టోబర్ 17,ప్రభాతవార్త : కొత్త జీఎస్టీ రేట్లుఅమల్లోకి వచ్చిన తర్వాత మొత్తం 375రకాల వస్తువులు,ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అన్నారు.డైరీ ఉత్పత్తులు,కార్ల నుండి ఎలక్ట్రానిక్స్ వరకు ధరలు భారీగా తగ్గుతున్నాయన్నారు.రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆయా కంపెనీలు ధరల తగ్గింపు ప్రకటనలు చేశాయన్నారు.జీఎస్టీ సంస్కరణలు సెప్టెంబర్ 22నుంచి అమల్లోకి వస్తున్నాయన్నారు.కేంద్రం 5,18శాతం పన్ను శ్లాబులను కొనసాగిస్తూ 12,28శ్లాబులను తొలగించిందన్నారు.ఏ వస్తువుల ధరలు తగ్గుతున్నాయి? ముఖ్యమైన వాటి జాబితా గురించి ప్రజలకు అవగాహన ఉండాలని సూచించారు.

## కాల్వలో పడి వ్యక్తి ఆత్మహత్య



కాకుమాను అక్టోబర్ 17 ప్రభాతవార్త: మండల పరిధి గరికపాడులో గురువారం రాత్రి వ్యక్తి బైక్పై వచ్చి కొమ్మమూరు కాల్వ వంతెనపై నుంచి కాల్వలోకి దూకాడు. ఇతను మృతదేహం అప్పాపురం దాటిన తర్వాత కొమ్మమూరు కాలువలు లభ్యమైనది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. బైక్ను వంతెనపైనే వదిలివేయడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ వ్యక్తి ఆత్మహత్యా యత్నం చేశాడా లేదా ప్రమాదవశాత్తూ పడిపోయాడా అనే దానిపై స్పష్టత లేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మిట్టపల్లి కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికైన విద్యార్థులు

యడ్లపాడు, అక్టోబర్ 17, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని మిట్టపల్లి కాలేజి అఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఎంపికలలో కళాశాలల నుంచి 34మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపి కృష్ణ తెలిపారు.



కళాశాలలో బిటెక్ 4వ సంవత్సరం చదువుతున్న సిఎస్ఇ, ఎఐ, డిఎస్, ఐటి, ఈసిఈ విభాగాల విద్యార్థులకు క్యూ స్పైడర్స్ కంపెనీ ఎంపికలను నిర్వహించటం జరిగిందన్నారు. ఇందులో కళాశాలలకు చెందిన 34మంది ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వారికి వార్షిక వేతనం 3.5లక్షల నుండి 9.5లక్షల వరకు ఉంటుందని కంపెనీ హెచ్అర్ ప్రతినిధులు తెలిపారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను సెక్రటరీ ఎంబివి సత్యనారాయణ అభినందించారు. ఈ పోటీ ప్రపంచంలో అధునిక సాంకేతికలు అందిపుచ్చుకుంటే విజయఅవకాశాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎవో సిహెచ్ శ్రీనివాసరావు, టిపివో కె విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గవాయి మీద జరిగిన దాడిని ఖండిస్తూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత



యడ్లపాడు, అక్టోబర్ 17, ప్రభాతవార్త : సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బిఅర్ గవాయి మీద జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్అర్‌పిఎస్ కార్యకర్తలు తహశీల్దార్ విజయశ్రీకి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు వివరిస్తూ బిఅర్ గవాయి మీద షూ విసిరిన వ్యక్తిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, అలాగే ఈ దాడి వెనుక ఉన్న వ్యక్తులు, శక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నామని జిల్లా ఎమ్అర్‌పిఎస్ అధ్యక్షుడు అద్దంకి బాబు మాదిగ తెలిపారు.

## అంతర్జాతీయ బాలికాదినోత్సవ వారోత్సవాలలో భాగంగా విద్యార్ధినులకు క్రీడాపోటీలు

యడ్లపాడు, అక్టోబర్ 17, ప్రభాతవార్త : మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అంతర్జాతీయ బాలికాదినోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ టీచర్స్ మరియు ఐటిసి, అసిస్ట్ అధ్వర్యంలో విద్యార్థినులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలు పొందిన విద్యార్ధినులకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎమ్ కె వెంకటరామిరెడ్డి, ఎన్ తాండవకృష్ణ, ఎన్ శివరామకృష్ణ, పి మేరిశౌరీలు, అసిస్ట్ స్టాఫ్ మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు టి పున్నమ్మ, బి అనురాధ, టి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



## డ్వాక్రా గ్రూపుల్లో అంతుచిక్కని అవినీతి

పెదకూరపాడు, అక్టోబరు 17 ప్రభాతవార్త : డ్వాక్రా గ్రూపుల్లో అంతుచిక్కని అవినీతి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణ, గ్రామాలు అనే తేడా లేకుండా పెదకూరపాడు నియోజకవర్గంలో డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. నెలకు ఒక గ్రూపు చొప్పున గ్రూపులోని సభ్యులు మరొక గ్రూపుకు వెళ్ళిపోవడంతో పాటు మరికొందరు రద్దు చేసుకుంటున్నారు. అమాయకులుగా ఉన్న డ్వాక్రా సభ్యులను గ్రూపు లీడర్లు నగదు విషయంలో తమకు పర్సంటేజ్ ఇవ్వాలంటూ మోసాలకు పాల్పడుతున్నారు.

## ఘనంగా మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు



రాజుపాలెం, అక్టోబరు 17 ప్రభాతవార్త : వైకాపా అధినేత వై.ఎస్.జగన్ వీర అభిమాని, పార్టీ సీనియర్ నాయకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మండలంలో ఆయన అభిమానులు, స్నేహితులు ఘనంగా నిర్వహించారు. కొండమోడు పరిధిలోని వీరమ్మకాలనీలో దీనమ్మ అండ్ రూరల్‌డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న అనాథ పిల్లల, వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం కేక్ కట్‌చేసి మిఠాయిలను పంచిపెట్టారు. అదే విధంగా చిన్నారులకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లమేకల నాగయ్య, వెంకటేశ్వర్లు, షేక్ హుస్సేన్, వంకదారు శివకాంత్, షేక్.సైదా, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్యశాలలో శిక్షణ

రాజుపాలెం, అక్టోబరు 17 ప్రభాతవార్త : ఆయుర్వేద వైద్యశాలలో శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ సిపిఆర్ పై శిక్షణ, ప్రతిజ్ఞ చేయించామన్నారు. ఎవరైనా శ్వాస తీసుకోవడం ఆగిపోతే అత్యవసర ప్రాణాలను కాపాడే ప్రక్రియను సిపిఆర్ అంటారన్నారు. గుండె, ఊపిరితిత్తులకు సంబంధించి సిపిఆర్‌ను చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సుజాత, ఆయుష్ సిబ్బంది లక్ష్మీనారాయణ, యోగా టీచర్ వెంకటరమణ, అలేఖ్య, రాణి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా బాలికల విద్యాలయ వసతి గృహం పరిశీలన

క్రోసూరు, అక్టోబర్ 17, ప్రభాతవార్త: క్రోసూరు మండలంలో పేదకుటుంబాల తల్లిదండ్రులు ఎక్కడెక్కడ నుంచో ఎన్నో ఆశలతో తమ పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని వసతి గృహాలకు పంపుతారని, ఈ చిన్నారులను మన సొంత పిల్లలకంటే బాగా చూసుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నతంగా ఎదిగేలా చేయి పట్టి నడిపించాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ వసతి గృహ వైద్య సిబ్బందికి సూచించారు శుక్రవారం పలనాడు జిల్లా క్రోసూరు మండలం క్రోసూరు లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వసతిగృహం మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాలు ను సందర్శించి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా బాలికలకు సిపిఆర్ పై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కూచిపూడి ఋషి సిపిఆర్ పై డిమాండ్ స్టేషన్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షి ంచడానికి ఉపయోగించే ఒక జీవ రక్షక ప్రక్రియ కార్డియో పల్మనారి రెస్పిటేషన్ సిపిఆర్ అని ఈ ప్రక్రియ ద్వారా ఎవరైనా ఒక వ్యక్తి గుండెపోటు వల్ల గాని విద్యుత్ షాక్ వల్ల గాని నీటిలో మునిగిపోవడం వల్ల గాని శ్వాస లేదా గుండె పని చేయటం ఆగిపోయినప్పుడు ఈ సీపీఆర్ చేసి ప్రాణాలను రక్షి ంచవచ్చు అన్నారు ఈ సి పి ఆర్ లో వ్యక్తికి కృత్రిమ శ్వాసను అందించడం, ఛాతిపై కుదింపులు చేయటం జరుగుతుందన్నారు కేజీబీవీ ప్రిన్సిపాల్ చిలక ఇందిరా ప్రియదర్శిని హెల్త్ సూపర్వైజర్ శివుడు సి హెచ్ ఓ ఋషి ఆశ కార్యకర్త చంద్రిక వసతి గృహ ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

## ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం నిర్వహించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని వినతులు అందించారు. ప్రజల నుండి నేరుగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అందరి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు.

## పీఎం కేంద్రీయ విద్యాలయ వార్షిక విద్యా పరీక్షలు

సత్తెనపల్లి టౌన్, అక్టోబర్17 ప్రభాతవార్త : పీఎం కేంద్రీయ విద్యాలయ సత్తెనపల్లి లో వార్షిక విద్యా పరీక్షలు విజయవంతంగా పూర్తి అయ్యాయి. పాఠశాలకు ఎక్సలెంట్ స్కూల్ అవార్డుఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన వార్షిక లో విద్యాపరమైన వార్షిక తనిఖీ అత్యంత విజయవంతంగా



ముగిసింది. ఈ తనిఖీకి హైదరాబాద్ జిల్లా సహాయ కమిషనర్ ఇజ్రాయెల్ అధ్యక్షత వహించారు. ఆయనతో పాటు వివిధ నిపుణులతో కూడిన పూర్తి తనిఖీ కమిటీ ఇన్‌స్పెక్షన్ చేశారు .కార్యక్రమం ప్రారంభ పాఠశాల వార్షిక పత్రిక గుంజన్ ను ఆవిష్కరించడం జరిగింది. తరువాత కమిటీ సభ్యులు పాఠశాల విద్యా కార్యక్రమాలు, సహపాఠ్య కార్యకలాపాలు, భవన నిర్మాణ సౌకర్యాలు, పరిశుభ్రత, అలంకరణ, మరియు విద్యార్థి ఉపాధ్యాయ సంబంధాలు వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించారు.కమిటీ సభ్యులు తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, కళా విభాగం మొదలైన అన్ని విభాగాలలో ఉన్న శ్రద్ధ, క్రమబద్ధత మరియు సమర్థ నిర్వహణను ప్రశంసించారు. విద్యార్థులు చూపిన కళలు, సంగీతం, క్రీడలు మరియు ప్రాజెక్ట్ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఎ.ఎ.ఇజ్రాయెల్ పాఠశాల ఉపాధ్యాయులకు అభినందిస్తూ అన్నారు. ప్రధానాచార్యులు జగదీష్ కుమార్ గుప్త తమ నాయకత్వ నైపుణ్యం, దూరదృష్టి మరియు అంకితభావంతో పాఠశాల భవనాన్ని ఆకర్షణీయంగా, క్రమబద్ధంగా తీర్చిదిద్దడమే కాకుండా, విద్యా వాతావరణం, క్రమశిక్షణ మరియు విద్యార్థుల ప్రతిభతో ఈ పాఠశాల మొత్తం ఆదర్శంగా నిలిచింది. ఇక్కడి కార్యకలాపాలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి.తనిఖీ అనంతరం, పాఠశాల విశేషాలను గుర్తిస్తూ, ప్రధానాచార్యులు జగదీష్ కుమార్ గుప్త కి అరైజ్ సంస్థ ప్రదానం చేసిన"ఎక్సలెంట్ స్కూల్ అవార్డ్ ను ఎ. ఎ. ఇజ్రాయెల్ స్వయంగా.అదనంగా, గుంటూరు ప్రాంతంలో నిర్వహించిన హిందీ పోటీలలో పాఠశాల మొదటి స్థానం పొందింది. సమాజ సేవ మరియు సామాజిక బాధ్యతల కోసం పాఠశాలకు సోషల్ సర్వీస్ సర్టిఫికేట్ కూడా ప్రదానం చేయాలి.10వ తరగతి విద్యార్థుల అద్భుత ఫలితాల ఉద్దేశిస్తూ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు ప్రశంసల సర్టిఫికెట్లుఅందజేయబడ్డాయి. చివరగా ప్రధానాచార్యులు జగదీష్ కుమార్ గుప్తా కమిటీ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు .

## బాణసంచా విక్రయ కేంద్రాలకు అనుమతి తప్పనిసరి



క్రోసూరు, అక్టోబర్ 17, ప్రభాతవార్త: క్రోసూరు మండలంలో అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తే ప్రేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని క్రోసూరు మండల ఎస్ ఐ పి. రవి బాబు హెచ్చరించారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన ద్వారా ఎస్ ఐ. పి. రవి బాబు మాట్లాడుతూ క్రోసూరు మండల పరిధి లోని 20 గ్రామాలలో ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసిన, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసిన, విక్రయాలు జరిపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందని మండల ఎస్ ఐ.పి.రవిబాబు హెచ్చరించారు. దీపావళిని పురస్కరించుకుని బాణాసంచా తయారీ, విక్రయదారులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా విక్రయాలు జరిపితే చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని క్రోసూరు ఎస్ ఐ. పి. రవిబాబు హెచ్చరించారు. దీపావళి పండుగను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని ఎస్ ఐ.పి. రవిబాబు కోరారు.

## వైకాపా ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ





అచ్చంపేట, అక్టోబర్ 17 (ప్రభాతవార్త): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించాలనే యత్నాలను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పల్నాడు జిల్లా పెద్దకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట పట్టణంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ చిలకా చంద్రయ్య, సర్పంచ్ కంబాల వీరబాబు, జడ్పీటీసీ ప్రతాప్ రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, వైసీపీ టౌన్ పార్టీ అధ్యక్షుడు సైదా, మాజీ సర్పంచ్ తురగా మల్లిఖార్జున రావు, మాజీ వైసీపీ కన్వీనర్ సాయిరెడ్డి, వైసీపీ నాయకులు చంద్రబాబు, బీరువాల జానీ, కమల్, కొమరాల రమేష్, సక్షైన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటీకరణ చర్యలను అడ్డుకోవడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు చేస్తున్న ఈ ప్రయత్నానికి ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలని కోరుతున్నాము. ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రజల సొత్తు. వాటిని ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లనివ్వకూడదు. ప్రజల హక్కులను కాపాడేందుకు అందరూ ఈ కోటి సంతకాల కార్యక్రమంలో భాగస్వాములవ్వాలి" అని పిలుపునిచ్చారు.

## పరిశుభ్రతపై దృష్టి పెడితే గ్రామాలు అభివృద్ధి-ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర,అక్టోబరు 17 ప్రభాతవార్త: గ్రామాల్లో పరిశుభ్రత..వ్యర్థాల నిర్వహణ..మొక్కలు పెంపకం..పర్యావరణ అనుకూల ఆవిష్కరణల వంటి వాటిపై దృష్టి పెట్టడం వలన గ్రామాలు మరింత అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు.శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు..కార్యదర్శులకు థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు.డిప్యూటి ఎంపీడీఓ భార్గవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పద్మావతి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు.ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూగ్రామాలను సుందరంగా తీర్చిదిద్దటానికి ప్రజల సహకారం అవసరం అన్నారు.కార్యక్రమంలో పరిపాలనాధికారి శరణు కిషోర్‌కుమార్,సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి,వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొటన్నారు.



## చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

కొల్లిపర,అక్టోబరు 17 ప్రభాతవార్త: చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ దళితుడు కావటం వలనే దాడి జరిగిందని..దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా యువసేన నాయకుడు రవి అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని అత్తోట,శిరిపురం, చివలూరు,తూములూరు తదితర గ్రామాల్లో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది దాడి చేయటం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీ





నిర్వహించారు.అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకులు దాడిచేసిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ నిరసన వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ పై దాడిచేయటం హేయమైన చర్య అన్నారు.అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు తహశీల్దార్ సిద్ధార్థకు వినతి పత్రం అంజేసారు.ఈ కార్యక్రమంలో కొండమూడి బోసు,మల్లమాటి జయరావు,అత్తోట సుధీర్,అత్తోట రాంబాబు,మల్లిక,తాడికొండ వరప్రసాద్ సాపాటి చిట్టి,కొల్లిపర జయరావు,వంశీ తదితరులు పాల్గొన్నారు.

## సీజేఐపై దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలి: ఎమ్మార్పీఎస్

మాచర్ల, అక్టోబరు 17 ప్రభాతవార్త: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు మాచర్లలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం



వద్ద వారు మాట్లాడుతూ దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి కూడా శిక్షణ పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలని, అందుకోసం సుప్రీంకోర్టులో ప్రజాస్వామిక వాదులుగా గుర్తించబడ్డ సీనియర్ జడ్జిలతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇన్‌ఛార్జి తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాచర్ల దానియేలు, మండల ఇన్‌ఛార్జి మాచర్ల రూబేను మాదిగ, పట్టణ అధ్యక్షుడు మరియబాబు, ఊరే మార్క్ మాదిగ, స్టూడెంట్ లీడర్ హరీష్, రమేష్, శివ, పవన్, సందీప్ తదతర నాయకులు పాల్గొన్నారు.

## నేడు నాగార్జునకొండను సందర్శించనున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

విజయపురిసౌత్, అక్టోబరు 17 ప్రభాతవార్త: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కుటుంబ సమేతంగా తిలకించనున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని హిల్‌కాలనీకి హెలికాప్టర్‌లో గవర్నర్ చేరుకొని అక్కడ నుంచి విజయవిహార్‌కు వెళ్తారు.



అనంతరం తెలంగాణ టూరిజం లాంచీలో నాగార్జునకొండకు చేరుకుంటారు. అక్కడ మ్యూజియాన్ని తిలకించి రాత్రి హిల్‌కాలనీలోని విజయవిహార్‌లో బస చేస్తారు. ఆదివారం మధ్యాహ్నం తిరిగి విజయవాడకు చేరుకుంటారు.

## అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు: ఆర్డీవో మురళీకృష్ణ



గురజాల, అక్టోబరు ప్రభాతవార్త : అనుమతులు లేకుండా దీపావళి టపాసులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళి టపాసుల విక్రయదారులు టపాసుల అమ్మకాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. టపాసుల అమ్మకాల సమయంలో ప్రమాదాలు జరగకుండా అధికారులు సూచనలు పాటించాలన్నారు. జీఎస్టీ అనుమతికి రూ. 5400, నగర పంచాయతీకి రూ. 1500, అగ్నిమాపక శాఖకు రూ. 500, పోలీసు శాఖకు రూ. 150లు చలానాలు చెల్లించి అనుమతులు పొందాలన్నారు.

## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికియత్నం అమానుషం

కారంపూడి, అక్టోబరు 17 ప్రభాతవార్త: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణ మాది ఆదేశాల మేరకు కారంపూడి మండల ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ



నిర్వహించారు. స్థానిక మాచర్ల రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ తహశీల్దారు కార్యాలయం వరకు సాగింది. ఈ రానయలీలో ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు తాళ్లూరి జీవరత్న మాదిగ మాట్లాడుతూ భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఎవరెవరు ఉన్నారో గుర్తించి తగిన శిక్ష పడేలా కేంద్రం చొరవ చూపాలన్నారు. దేశ సర్వోన్నత ప్రధాన న్యాయమూర్తిపైనే దాడులు జరుగుతుంటే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. కారకులైన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. డిప్యూటీ తహశీల్దారు విద్యాసాగర్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కారంపూడి మండల ఎంఎస్పీ అధ్యక్షులు కడియం మరియదాసు మాదిగ, అధికార ప్రతినిధి కోట దాసు, ప్రధాన కార్యదర్శి తాళ్లపోగు చంటి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ గజ్జల



సత్తెనపల్లిటౌన్, అక్టోబరు 17 ప్రభాతవార్త : పట్టణంలోని 10వ వార్డు కౌన్సిలర్ పెద్దింటి వెంకటేశ్వర్లు - గోవిందమ్మ కుమారుడు దీప్‌చంద్ వివాహ కార్యక్రమానికి సత్తెనపల్లి వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి కుటుంబానికి శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు సహారా మౌలాలి, నాయకులు అచ్యుత శివప్రసాద్, గుంటూరు జాని, కె.శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు, సతీష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గ్రీన్ విలేజ్‌లపై శిక్షణా కార్యక్రమం

సత్తెనపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త : క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌లపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. అభివృద్ధి లక్ష్యాలలోని థీమ్-5 అయిన పరిశుభ్రత - పచ్చదనం గురించి సర్పంచ్‌లకు, పంచాయితీ కార్యదర్శులకు, హరితరాయబారులకు శిక్షణ ఇచ్చామని ఎంపిడివో బండి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.



మొత్తం 234 మంది శిక్షణకు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ఆఫ్ ట్రైనర్‌లుగా షేక్.రెహమాన్, పంచాయితీ కార్యదర్శి కుంభా వెంకటేశ్వర్లు, కె.అంజిరెడ్డి, కృష్ణప్రసాద్, చలంచర్ల శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ విజయ్‌సుందర్, డిజిటల్ అసిస్టెంట్‌లు రాకేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## దీపావళి టపాసుల తాత్కాలిక షాపుల పరిశీలన



సత్తెనపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త : పట్టణంలో దీపావళి టపాసుల తాత్కాలిక షాపుల ఏర్పాటు కొరకు మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌రావు, తహశీల్దార్ లు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని తారకరామాసాగర్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో షాపుల ఏర్పాటు కొరకు, పార్కింగ్ కొరకు స్థలాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా షాపులను వ్యాపారులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి

సత్తెనపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త : గుర్తు తెలియని వృద్ధుని మృతదేహాన్ని కంటెపూడి బస్టాండ్ వద్ద శుక్రవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వృద్ధునికి సుమారు 60 సంవత్సరాల ఉంటుందని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440796231 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఈ సందర్భంగా పోలీసులు తెలియజేశారు.




## జిఎస్‌టి పై అవగాహన



అమరావతి, అక్టోబరు 17 ప్రభాతవార్త : జిఎస్‌టి పై అవగాహన కార్యక్రమాన్ని ఎంపిడివో పార్వతీ శుక్రవారం నిర్వహించారు. అమరావతిలోని క్రోసూరు రోడ్డులో పలు వ్యాపార దుకాణాలను వారు సందర్శించి వినియోగదారులతో పాటు వ్యాపారులతో మాట్లాడారు. వీరాంజనేయ ఆర్టికల్స్ నిర్వాహకులు పి.నరేష్‌కు వారు జిఎస్‌టికి సంబంధించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవో నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

## తుప్పు పట్టిన స్వచ్ఛ రిక్షాలు



పెదకూరపాడు, అక్టోబరు 17 ప్రభాతవార్త : మండలంలో స్వచ్ఛ రిక్షాలు తుప్పుపట్టి విరిగిపోతున్నాయి. గ్రామాలలో పారిశుద్ధ్య మెరుగుదలకు అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ అవి క్షేత్రస్థాయిలో ప్రయోజనాన్ని ఇవ్వడం లేదు. చెత్త సేకరణకు ఇంటింటికి వెళ్ళవలసిన రిక్షాలు మరమ్మత్తులకు గురై తప్పుపట్టి మూలనపడ్డాయి. దీని వలన పలు గ్రామాలలో గృహాలకు చెత్త రిక్షాలు రాకపోవడంలో ప్రజలు చెత్త వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్త రిక్షాలకు మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రద్దు చేయాలి

వేమూరు అక్టోబరు 17 (ప్రభాతవార్త) : ప్రభుత్వం నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలను చంద్రబాబునాయుడు ప్రభుత్వం ప్రైవేటీకరించడం రద్దు చేయాలని వేమూరు మండల వైఎస్ఆర్సీపీ కన్వీనర్ దాది సుబ్బారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ చేపడుతున్న సంతకాల సేకరణలో భాగంగా శుక్రవారం మండలంలోని వెల్లబాడు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతి కోసం ఆనాడు వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని 17మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిందన్నారు. వాటిలో కొన్ని పూర్తయ్యాయని మిగిలినవి ప్రభుత్వం పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు అందించాల్సి ఉండగా చంద్రబాబునాయుడు ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. ఇందు కోసం పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీల్లో ప్రైవేటీకరణ రద్దు చేయాలంటూ ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నారని ఈ సంతకాలలో గవర్నర్కు అందిస్తామన్నారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ గురించి సాల్సిన అంశాలను గురించి పార్టీ శ్రేణులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎలమటి మోహనరావు, మండల పరిశీలకులు మోహనరావు, గ్రామ సర్పంచ్ యల్లబాటి బుల్లయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు దుండం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పెన్షన్ పంపిణీ డ్యూటీల నుండి మినహాయించాలి

వేమూరు అక్టోబరు 17 (ప్రభాతవార్త) : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలను పెన్షన్ పంపిణీ డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం ఎంపీడీవో పి.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బి.అగస్టీన్ మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీలకు పెన్షన్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఇప్పటికే పని భారం పెరిగి టెన్షన్‌తో విధులు నిర్వహిస్తున్నారని వారికి ఐసిడిఎస్ విధులు మినహా మరే ఇతర పనులు అప్పగించవద్దని కోరారు. ఈ మేరకు అంగన్‌వాడీలకు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖకు సంబంధం లేని పనులు కేటాయించవద్దని, పెన్షన్ డ్యూటీల నుండి మినహాయించాలని, మహిళ అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. అయితే సర్క్యులర్ జారీ అయ్యి రెండు నెలల గడిచినా అంగన్‌వాడీలకు పెన్షన్ డ్యూటీ రద్దు చేయలేదని, వెంటనే శిశు సంక్షేమ డైరెక్టర్ వారి ఉత్తర్వుల ప్రకారం అంగన్‌వాడీలకు పెన్షన్ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సువర్ణ, ఎమ్.మేరీ, బొడ్డు జయప్రద, ఎమ్.విజయదుర్గ, టి.తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## మహిళల ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన కల్పించాలి

వేమూరు అక్టోబరు 17 (ప్రభాతవార్త) : మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల పట్ల వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ జరీనా పర్వీన్ తెలియజేశారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎస్ఆర్ సిహెచ్ అనే కార్యక్రమంపై ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ జరీనా పర్వీన్ మాట్లాడుతూ యుక్త వయస్సులో ఆడ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఆ సమస్యలను ఎవరి ద్వారా అయితే పరిష్కారం అవుతుందో వారి ద్వారా పరిష్కరించడానికి ప్రయత్నం చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలియజేశారు. మరీ ముఖ్యంగా చిన్న వయస్సులో గర్భిణీ రావడం వలన తల్లి బిడ్డ ఎదుర్కొనే సమస్యలు చాలా ఉన్నాయని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచిగా డెలివరీ చేసి ఇంటికి పంపించడం జరిగిందని అని చెప్పారు. బాల్య వివాహాలు చేయడం వలన లేదా బాల్య వివాహం చేసుకున్న ఇబ్బందులు గుర్తొచ్చే ఆడపిల అని తెలియజేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వస్తున్నటువంటి అంగన్‌వాడీ సంతులిత ఆహార గర్భిణీలు, బాలింతలు పొందుకొని లబ్ధి పొందాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ బాలింతలకు గర్భిణీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వారికి అన్ని విధాలుగా తోడ్పాటు కల్పించాలని అందుకు అంగన్‌వాడీ వర్కర్స్ ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పున్నారావు, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ ట్రస్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ యస్.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో "వేదాశీర్వచన సభ"

తెనాలి టౌన్ అక్టోబర్ 17 (ప్రభాతవార్త): తెనాలిపట్టణ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక శాసనసభ్యులు,రాష్ట్రఆహార పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ కి వేద ఆశీర్వచనసభ వేడుకగా జరిగింది. బ్రాహ్మణ సంఘీయులందరూ మంత్రి నాదెండ్లకు అభినందనలు తెలియజేస్తూ వేద ఆశీర్వచన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన మాగంటి వెంకట సుబ్రహ్మణ్య రత్నాకరశాస్త్రిని అభినందించారు. బ్రాహ్మణులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని కూటమి ప్రభుత్వ హయాంలో వారికి అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ మండపంలో తెనాలి పట్టణ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేదాశీర్వచన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్గా నియమితులైన పట్టణానికి చెందిన సీనియర్ జనసేన పార్టీ నాయకులు, తెనాలి పట్టణ బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి, మాగంటి వెంకట సుబ్రహ్మణ్య రత్నాకరశాస్త్రి కి వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ గా నియమితులైన మాగంటి వెంకట సుబ్రహ్మణ్య రత్నాకరశాస్త్రిని వేద పండితులు ఆశీర్వదించి, తదుపరి రత్నాకరశాస్త్రి కి ఘనసన్మానం చేశారు. అనంతరం మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ, అర్హులైన బ్రాహ్మణులకి సంక్షేమ పథకాలు అందించటం, వారిని సమాజంలో మంచిస్థానం కల్పించటం కూటమిప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున బ్రాహ్మణసోదరులు, సోదరీమణులు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## హత్యకేసులో నిందితుడి అరెస్ట్

తెనాలి టౌన్ అక్టోబర్ 17 (ప్రభాతవార్త): గత మంగళవారం పట్టణంలోని చెంచుపేటలో సంచలనం కలిగించిన జూటూరి తిరుపతిరావు హత్య కేసులో నిందితుడైన గండికోట వెంకట సుబ్బారావుని త్రీటౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి స్వగ్రామమైన కోడితాడిపర్రు లో నెలకొన్న వివాదాలే హత్యకు దారితీసాయని డిఎస్పి.బి. జనార్ధన్ రావు,సిఐ శ్రీనివాసరావు లు వెల్లడించారు. గతంలో ముద్దాయి పలు కేసుల్లో నిందితునిగా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల కథనం మేరకు, బాపట్ల జిల్లా కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి తిరుపతిరావు, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు, వైద్య చికిత్స నిమిత్తం పట్టణంలోని



పినపాడు లో ఉంటున్న తన పెద్ద కుమార్తె గండికోట దుర్గ ఇంటి వద్ద ఉంటూ చికిత్స తీసుకునే క్రమంలో, మంగళవారం ఉదయం కూరగాయల తీసుకునే నిమిత్తం, చెంచుపేటలోని రైతుబజార్ వెళ్లి తిరిగి వస్తూ దారిలో టిఫిన్ తీసుకుంటుండగా, ముద్దాయి గండికోట వెంకట సుబ్బారావు వెనుకగా వచ్చి కొబ్బరి బోండాలు నరికే కత్తితో విచక్షణ రహితంగా తిరుపతిరావును హత్య చేసి పారిపోయాడని, మృతి చెందిన తిరుపతిరావు భార్య జూటూరి ఇందిరా ఇచ్చిన ఫిర్యాదుకు మేరకు, పోలీసు వారికి అందిన సమాచారం మేరకు, శుక్రవారం నిందితుడు గండికోట వెంకట సుబ్బారావుని సోమ సుందర పాలెం వీళ్లే దారిలో అరెస్టు చేయడం జరిగిందని డిఎస్పి తెలియజేశారు. గత కొంతకాలంగా హతుడు తిరుపతిరావుకి నిందితుడైన గండికోట వెంకట సుబ్బారావుకి మధ్య గ్రామంలోని రామాలయం గుడి కి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, అలాగే ముద్దాయి వ్యక్తిగత కుటుంబ వ్యవహారాల్లో హతుడైన తిరుపతిరావు జోక్యం చేసుకోవడం సహించలేక, హత్య చేసినట్లు నిందితుడు సుబ్బారావు పోలీసుల ఎదుట తన నేరాన్ని అంగీకరించాడు. అరెస్ట్ చేసిన ముద్దాయిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు త్రీ టౌన్ సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

## దేవాలయం అభివృద్ధికి నూతన కమిటి పనిచేయాలి

పొన్నూరు, అక్టోబరు 17,ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయం అభివృద్ధికి నూతన కమిటి శక్తివంచన లేకుండా పనిచేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కోరారు. స్థానిక దేవాలయం కళ్యాణ మండపంలో నూతన



ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవ సభలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ మాట్లాడారు. ప్రభుత్వం కమిటీకి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. ఈ ప్రాంగణంలోని అన్ని దేవాయాలను ఒకేచోటకు చేర్చిన ఘనత జగన్నాథస్వామివారికే దక్కుతుందన్నారు. 1960ప్రాంతంలో ఇక్కడ ఈ విగ్రహాలు తయారు చేయించి ఇక్కడ ప్రతిష్టాపన చేసి స్వర్ణపురికి ఒక ప్రధాన్యత రావడానికి కారణమయ్యారన్నారు. ఎన్నో ఏళ్ళుగా మాతృశ్రీ లక్ష్మీ కాంతమ్మ(అమ్మ) మన మధ్యన లేకపోయినా ఆమె కూడా జగన్నాథస్వామి యొక్క పరంపరని కొనసాగించి అభివృద్ధిలో భాగస్వాములయ్యారన్నారు. పాలకవర్గానికి, అర్చకులకు నేను విన్నవించేది ఏంటంటే గుడిని గుడిగా చూద్దాం, గుడి అనేది రాజకీయాలకు అతీతమైందన్నారు. గత పాలకులు వారి పాలనా కాలం ఐదేళ్ళలో గుడిని అపవిత్రం చేశారన్నారు. పూజారి యొక్క బాధ్యత దేవుని ప్రార్థించడం, పాలకవర్గం బాధ్యత ఏదైతే పెద్దలు నిర్ధేశించిన ఆచారాలను, సంప్రదాయాలను సక్రమంగా జరిగేవిధంగా చూడడమన్నారు. పరిపాలన చేయాల్సిన బాధ్యత కార్యనిర్వహణాధికారిదన్నారు. పూజారులు కావచ్చు, పాలకవర్గం సభ్యులు కావచ్చు, సిబ్బంది కావచ్చు గుడికి మంచి చేసే ఉద్దేశంతో ఉంటే తాను ప్రశ్నించనని, గుడికి నష్టం వాటిల్లుతుంది, ఆచారాలకు అపచారం జరుగుతుందంటే ఊరుకునే ప్రశక్తే లేదన్నారు. దేవాలయం పవిత్రతను, విశిష్టతను కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నూతన కార్యవర్గం చేత కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాధ్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విలువల ఆధారంగా నాయకత్వాన్ని పెంపొందించుకోవాలి

పొన్నూరు, అక్టోబరు 17,ప్రభాతవార్త: విద్య అనేది కేవలం జ్ఞాన సంపాదనకే పరిమితం కాకుండా, విలువల ఆధారంగా నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకరరెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ ఆర్థిక సౌజన్యంతో స్కూల్ ఆఫ్ లా అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ పరిధిలోని డిపార్టుమెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో కల్టివేటింగ్ ఎథికల్ బిజినెస్ లీడర్స్ అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ సదస్సును శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బి.సుధాకరరెడ్డి మాట్లాడుతూ నేటియువత వ్యాపార



రంగంలోకి అడుగుపెడుతున్నప్పుడు సామాజిక బాధ్యతతో కూడిన నైతిక విలువలే వారికి మార్గదర్శకాలు కావాలని సూచించారు. ఆధునిక మేనేజిమెంట్ విద్యలో భారతీయ విలువలు, సాంప్రదాయ జ్ఞానం, నైతిక దృక్పథం, సుస్థిరతలను సమన్వయపరచాల్సిన అవసరాన్ని వివరించారు. భారతీయ జ్ఞాన వ్యవస్థల ఆధారంగా మేనేజిమెంట్ విద్యలో కొత్త దిశను సృష్టించే ప్రయత్నం జరుగోతందన్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో నైతిక వ్యాపార దృక్పథం, సామాజిక బాధ్యత, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎ.సూర్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక సంస్థల్లో ఎదురయ్యే నైతిక సమస్యలను ఆచరణాత్మ కోణంలో విశ్లేషించారు. పుదుచ్చేరి యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ యార్లగడ్డ శ్రీనివాసులు భారతీయ తత్వశాస్త్ర సంప్రదాయాల ప్రాధాన్యతను నైతిక నాయకత్వ అభివృద్ధితో అనుసంధానించి వివరించారు. ఐఐటీ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎంపి గణేష్ మాట్లాడుతూ ఆధునిక అభివృద్ధి తత్వాలతో పాటు ప్రాచీన భారతీయ జ్ఞానాన్ని సమన్వయం చేయడం ఎంత అవసరమో వివరించారు. భారతీయ జ్ఞాన సంప్రదాయాల శాశ్వత విలువలను నేటి గ్లోబలైజ్డ్ వ్యాపార ప్రపంచానికి అన్వయించాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వందకు పైగా ప్రతినిధులు హాజరై తమ పరిశోధనా పత్రాలను సమర్పించగా, అనేక ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించబడ్డాయి. ఈ సదస్సు మేనేజ్‌మెంట్ విద్యార్థులకు మాత్రమే కాకుండా పరిశ్రమ నిపుణులు, యువ పరిశోధకులు, సమాజానికి కూడా మేలు చేసే విలువైన వేదికగా నిలిచింది. కార్యక్రమంలో విజ్ఞాన్ వర్సిటీ వీసి కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం కొనుగోలుదారులు సురక్షా యాప్ సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరు, అక్టోబరు 17,ప్రభాతవార్త: మద్యం ప్రియులు, మద్యం కొనుగోలుదారులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎక్సైజ్‌శాఖ జారీ చేసిన సురక్షాయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ సిఐ మేడికొండ రమేష్ కోరారు. ఇటీవల అక్కడక్కడ నకిలీ మద్యం, కల్తీ మద్యం అనే పుకార్లు షికార్లు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వమే పారదర్శకత కోసం ప్రత్యేకంగా సురక్షా యాప్‌ను తయారు చేసిందన్నారు. దీని ద్వారా మనం షాపుకు వెళ్ళి మద్యం బాటిల్ కొనుగోలు చేస్తే సదరు బాటిల్ ఎక్కడ తయారైంది, తయారైన తేదీ, సమయం, ఎమ్మార్పీ ధర తదితర విషయాలన్నీ తెలుస్తాయన్నారు. సురక్షాయాప్‌ను ప్రతి మద్యం దుకాణదారుడు డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. వినియోగదారులు కూడా ఈయాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. షాపుల నిర్వాహకులు



వినియోగదారుడు బాటిల్ కొనుగోలు చేసి సంబంధిత షాపులోనే యాప్ సహాయంతో పూర్తి సమాచారం కూడా తెలుసుకోవచ్చన్నారు. తప్పని సరిగా ప్రతి షాపులో ఈ యాప్ వినియోగంలో ఉండాలన్నారు. వినియోగదారుడు స్కాన్ చేయమని అడిగినట్లయితే షాపు నిర్వాహకులు స్కాన్ చేసి వివరాలను తెలియజేయాలి ్సందేనన్నారు. షాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. సిఐ రమేష్ సురక్షా యాప్‌పై అవగాహన కల్పించారు.


## వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రైతులు మద్దతు పలకాలి

పొన్నూరు, అక్టోబరు 17,ప్రభాతవార్త: ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తుందని, దీన్ని అడ్డుకునేందుకు ప్రతి ఒక్క వర్గం ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలం సుద్దపల్లి, శ్రీరంగపురం తదితర గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత జగన్మోహనరెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతులు, రైతు కూలీల మద్దతను కూడగట్టారు. పొలాల్లో పర్యటించి రైతులు, రైతు



కూలీల వద్ద నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నటువంటి మెడికల్ కళాశాలలను ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రైవేటీకరణ చేస్తూ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. జగన్మోహనరెడ్డి పిలుపు మేరకు గ్రామాల్లో ప్రతి గడపగడపకు తిరిగి మెడికల్ కాలేజిల ప్రైవేటీకరణపై నిరసనగా సంతకాలు సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ అయినట్లయితే అన్ని వర్గాలకు నష్టం జరుగుతుందన్నారు. వైద్య విద్య పేదవారికి దూరమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ శ్రీరామరెడ్డి, నియోజకవర్గ పెన్షనర్ల ప్రచార విభాగం అధ్యక్షుడు చిర్రా అక్కిరెడ్డి, భాస్కరరెడ్డి, శంకరరావు, చందు సాంబశివరావు, మట్టుపల్లి పోతురాజు, దానబోయిన గోపి, అప్పిరెడ్డి, యాతం మమత, జాని, వేణు, చిరంజీవి, బాలచంద్రరావు, దాసరి దానమ్మ, కాజేషు, వెంకటరెడ్డి, క్రాంతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రేషన్ బియ్యం తరలింపుపై ఉక్కుపాదం మోపుతాం



పొన్నూరు, అక్టోబరు 17,ప్రభాతవార్త: అక్రమ రేషన్ బియ్యం తరలింపుపై ఉక్కుపాదం మోపుతామని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ హెచ్చరించారు. ఇటీవల కాలంలో పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకొంటున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. వచ్చిన సమాచారం మేరకు పట్టణ సిఐ వీరానాయక్, ఎస్సై వాగాల శ్రీహరి, సిబ్బందితో షరాఫ్ బజారులో హెచ్‌డీఎఫ్‌సి బ్యాంకు దగ్గరకు వెళ్ళగా అక్కడ అశోకా లైలాండ్ ట్రాలీ వాహనం ఆగి ఉంది. దాని పక్కన ముగ్గురు వ్యక్తులు నిలబడి ఉన్నారు. పోలీసులను చూసి ముగ్గురు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వలపన్ని వారిని అదుపులోకి

తీసుకొన్నారు. షేక్ మోమునుబాషా, అవ్వారు శ్రీనివాసరావు, చందనం అంకమ్మనాయుడు ఉన్నారు. మోమున్ బాషాను పిడిఎస్ బియ్యం ఎక్కడి నుండి తీసుకొని వస్తున్నావు అని అడుగగా పట్టణంలోని రేషన్ డీలర్ మునీర్ వద్ద ప్రభుత్వం ఇచ్చిన గొనె సంచులు కొనుగోలు చేసి మా డ్రైవర్ల సహాయంతో రేషన్ అక్రమ రవాణా చేసి బోడపాడు గ్రామానికి చెందిన గోవతోటి ఆనంద్ వద్దకు పంపిస్తున్నట్లు చెప్పాడు. 31 సంచులు పిడిఎస్ బియ్యం(ఒక్కొక్కటి 50కిలోలు) కలిగి ఉన్నట్లు, మొత్తం 1550కిల్లో పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ముగ్గురుపై కేసులు నమోదు చేసినట్లు అర్బన్ సిఐ వీరానాయక్ చెప్పారు. సంబంధిత వ్యక్తులు తెలిపిన సమాచారం మేరకు ఇంకా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం: మంత్రి నాదెండ్ల

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 17 (ప్రభాతవార్త):ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించటానికి, కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని రావి సాంబయ్య బాలుర పురపాలక ఉన్నత పాఠశాలలో,




ప్రముఖ జ్యూయలరీ సంస్థ జోష్ లుక్కాస్ వారి సౌజన్యంతో 12 లక్షలరూపాయలు విలువైన మౌలిక సామాగ్రిని మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులతో కలిసి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖధికారి మేకల లక్ష్మీ ్మనారాయణ, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్లపై వ్యర్థాలు తొలగించరా... అసహనం వ్యక్తంచేసిన ఛైర్మన్ రాధిక



తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 17 (ప్రభాతవార్త):పట్టణంలోని పలు వీధుల్లో రోడ్లపై ఎప్పటినుంచో ఉన్న వ్యర్థాలు తొలగించకపోవటం చూసి మున్సిపల్ ఛైర్మన్ తాడిబోయిన రాధిక పారిశుధ్య కార్మికులపై అసహనం వ్యక్తం చేశారు. పురపాలక సంఘ పరిధిలోని 37వ వార్డులో శుక్రవారం ఉదయం మున్సిపల్ ఛైర్మన్ తాడిబోయిన రాధిక పర్యటించారు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మొవ్వ ఏసుబాబుతో కలిసి వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులు పరిశీలించి, పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. పలు వీధుల్లో రోడ్లపై వ్యర్థాలు చూసిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ వహించవద్దని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, ఆమె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో 37వ వార్డు కౌన్సిలర్ గొడవర్తి సాయి హరే రామ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఎం.ఏసుబాబు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపా లీగల్ సెల్ కమిటీ నియామకం

తెనాలి టౌన్ అక్టోబర్ 17 (ప్రభాతవార్త): తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ కమిటీని, నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్చార్జి, మాజీమంత్రి, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం ప్రకటించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన, లీగల్ సెల్ సమావేశంలో అధ్యక్షుడిగా ఇందుపల్లి



రాజారాం, ప్రధాన కార్యదర్శిగా తాడిశెట్టి వెంకటేశ్వరరావు తో సహ 18 మందికి నూతన కమిటీలో స్థానం కల్పించారు. అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్తగాఎన్నికైన కమిటీ సభ్యులకు, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు, జన్ను శశి కుమార్, అన్నం పిన్నారావు, అప్పల కిషోర్, సుభాష్ బాబు అనిత, పలువురు న్యాయవాదులు, తెదేపా నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

## మంత్రివర్గంలోకి ఎమ్మెల్సీ ఆలపాటి?!

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 17 (ప్రభాతవార్త): రాష్ట్ర మంత్రివర్గంలోకి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని తీసుకుంటున్నారా? విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మంత్రి స్థానంలోకి, తెలుగుదేశం పార్టీకి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్దదిక్కుగా ఉన్న సీనియర్ నాయకులు, కృష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తో ఆస్థానాన్ని భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. గత శాసనసభ ఎన్నికల్లో కూటమి పార్టీల పొత్తులో భాగంగా తెనాలి ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన మాజీమంత్రి, ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని శాసనమండలి కోటాలో మంత్రిగా నియమించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కూటమి పార్టీల పొత్తులో భాగంగా తెనాలి అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించినా, అధిష్టానం ఆదేశాలతో కూటమి అభ్యర్థి గెలుపుకు ఎంతగానో కృషిచేసి, అత్యధిక మెజారిటీ రావటంలో, ఆలపాటి రాజేంద్రప్రసాద్ కష్టాన్ని గుర్తించిన చంద్రబాబు, గత ఎన్నికలప్రచారంలో, ఆలపాటి రాజేంద్రప్రసాద్ నా మనిషని, ఆయనకు తగిన గౌరవం కల్పిస్తామని ఆనాడు, పట్టణంలో నిర్వహించిన బహిరంగసభలో ప్రజల మధ్య ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నట్లు సమాచారం. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, నాలుగు దశాబ్దాల పాటు తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ కలిగిన నేతగా పార్టీకి విధేయతతో, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, పార్టీకి కష్ట కాలంలో అండగా నిలబడిన నాయకుడిగా, గుంటూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పెద్దదిక్కుగా వ్యవహరిస్తూ, గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆనాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకుడిగా, ప్రజల్లో కార్యకర్తల్లో గుర్తింపు తెచ్చుకున్న, ఆలపాటి రాజేంద్రప్రసాద్ నేడు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కానున్నారు. విద్యార్థి సంఘ నేతగా, తెలుగు యువత నాయకుడిగా, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆలపాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. గత వైసిపి హయాంలో తెనాలి నియోజకవర్గంలో పార్టీకి, కార్యకర్తలకి, వెన్నుదన్నుగా నిలబడి ప్రభుత్వం పై పోరాటాలు చేసిన ఘనత ఆలపాటిది. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను నిర్వీర్యం చేయగా, తన సొంత నిధులతో పట్టణంలో మార్కెట్ సెంటర్లో మరియు బుర్రిపాలెం రోడ్డు లోని శివాజీ చౌక్ ప్రాంతంలో తన సొంత నిధులతో అన్నా క్యాంటీన్లను నిర్వహించడం, అర్హత ఉండి ప్రభుత్వం నుండి పెన్షన్ రాని వారికి తన సొంత నిధులతో పెన్షన్లు అందజేయటం, సమస్యలతో వచ్చిన కార్యకర్తలకు కానీ, ప్రజలకు గాని అండగా నిలబడి, సమస్య పరిష్కరించే వరకు నిద్రపోని వ్యక్తి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అని, గత ఎన్నికల ముందు నియోజకవర్గమంతా పాదయాత్ర నిర్వహించి కూటమి అభ్యర్థికి అత్యధిక మెజారిటీ రావడంలో ఆలపాటి పాత్ర ఎనలేనిదని కార్యకర్తలు బాహాటముగా చెప్పుకుంటారు.



## పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

పొన్నూరు, అక్టోబరు 17,ప్రభాతవార్త: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పేదలకు మెరుగైన, సరైన వైద్య సేవలను అందించాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హెచ్చరించారు. పట్టణంలోని 23వ వార్డు, అంబేద్కర్‌నగర్‌లో ఉన్నటువంటి ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వారిపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మూడు రోజులు మాత్రమే డిప్యుటేషన్‌పై వైద్యులు వస్తున్నారన్న విషయాన్ని తెలుసుకొన్నారు. వైద్యశాలకు వచ్చే రోగుల వివరాలను, వారికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది సరైన సమాధానం చెప్పక



పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు వైద్యశాలలను ఏర్పాటు చేస్తే, సేవలు అందించాల్సిన డాక్టర్లు, సిబ్బంది అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం ఏంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో లాగా ఉద్యోగాలు చేయాలంటే కుదరని హెచ్చరించారు. తప్పనిసరిగా పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించాల్సిందేనన్నారు. రోగులకు అందించే సేవలను, రక్త పరీక్షలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు అందించిన సేవలకు సంబంధించిన రికార్డులను అడిగి మరీ పరిశీలించారు. ఫార్మసీ విభాగాన్ని పరిశీలించారు. కాలం చెల్లిన మందులను వెంటనే తీసేయాలన్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించి అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు వైద్య సేవలను సక్రమంగా అందించకపోవడం సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, అర్బన్ సిఐ లావూరి వీరానాయక్, నాయకులు బండ్లమూడి బాబూరావు, పఠాన్ పిరోజ్‌ఖాన్, ఆరె ప్రసాద్, చెన్నుపాటి భాస్కర్, తదితరులున్నారు.

## ఘనంగా ధ్వజస్తంభ పున: ప్రతిష్ఠాపన



చిలకలూరిపేట, అక్టోబర్ 17, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణం, పందరిపురం 5వ లైన్ నందు వేంచేసియున్న దత్తాత్రేయ స్వామి వారి దేవస్థానం నందు ధ్వజస్తంభ పునః ప్రతిష్ట మరియు గోపుర కలశ ప్రతిష్ట మహోత్సవమునకు ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిధిగా హాజరై, కమిటీ వారు ఏర్పాటుచేసిన ప్రత్యేకపూజల్లో పాల్గొని, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు

## ఆలయంలో టిడిపి నేతల పూజలు



నాదెండ్ల, ప్రభాతవార్త: నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు మాజీమంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారి తనయులు ప్రత్తిపాటి శరత్ పుట్టిన రోజు సందర్భంగా టీడీపీ నాయకులు నన్నపనేని టరిష్ ఆధ్వర్యంలో దేవస్థానం లో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అయ్యప్ప స్వామి మాలధారులకు ఏర్పాటు చేసిన బిక్ష కార్యక్రమాన్ని ప్రత్తిపాటి వెంకట కుమారి గారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ పెంట్యాల శేషయ్య, టీడీపీ నాయకులు వలేటి హిమవంతరావు, పెదవల్లి రామారావు, కాట్రూ శ్రీను, సలిసం శ్రీను, గుంటూ కోటి, దొడ్డ చైతన్య, శ్రీనివాసరావు , ముఖ్య నాయకులు, దేవస్థానం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ జాన్ డేవిడ్ జయంతి



చిలకలూరిపేట, అక్టోబర్ 17, ప్రభాతవార్త: ఏఎంజీ, ఫార్ కార్నర్స్ , వేద సంస్థల వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ ఎస్ జాన్ డేవిడ్ జయంతిని ఆ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్ కార్నర్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జెస్సియస్ బర్నాబాస్ ఆధ్వర్యంలో డాక్టర్ జాన్ డేవిడ్ కు ఘనంగా నివాళులర్పించారు. ఉదయం డాక్టర్ జాన్ డేవిడ్ కుటుంబ సభ్యులతో పాటు ఆయా సంస్థల సిబ్బంది, పలువురు సేవకులు డేవిడ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థన చేశారు అనంతరం చిలకలూరిపేట పట్టణంలోని రిజిస్టర్ ఆఫీస్ వద్దగల జాన్ డేవిడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎఎంజి సంస్థ ప్రాంగణంలో జరిగిన సభలో పాల్గొన్న పలువురు జాన్ డేవిడ్ సేవలను కొనియాడారు. డాక్టర్ జాన్ డేవిడ్ పేద వర్గాల అభ్యున్నతికి విశేషమైన సేవలందించారని ఆయన సేవలు వెల కట్టలేనివని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ఉష ప్రియం డాక్టర్ జాన్ సులక్షన్ బోర్డు సభ్యులు సాంబయ్య, మోజస్, పాస్టర్లు పీటర్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఉద్యోగుల మోసాలకు రైతులపై కక్ష సాధింపులకు పాల్పడమేంటి?

## శ్మశానాన్ని ఆక్రమించిన వైసీపీనేతపై తక్షణమే చర్యలు తీసుకోండి : ప్రత్తిపాటి



చిలకలూరిపేట, అక్టోబర్ 17, ప్రభాతవార్త: తాము రుణం కోసం తాకట్టు పెట్టిన బంగారం స్థానంలో నకిలీ బంగారం ఉంచి, నమ్మకంతో తమను మోసగించారని, న్యాయస్థానం చెప్పినా వినకుండా, ఎన్నోఏళ్లుగా తమకు న్యాయం చేయకుండా కోర్టులు, కేసులంటూ బ్యాంక్ మేనేజ్ మెంట్ తమను అష్టకష్టాలు పెడుతోందని యడ్లపాడు మండలంలోని పలు గ్రామాల రైతులు తమ ఆవేదనను మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసు కొచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించి కూటమి నాయకులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా యడ్లపాడు మండల కేంద్రంలోని ప్రధాన బ్యాంక్ లో గోల్డ్ అప్రైజర్, మరికొందరు సిబ్బంది కలిసి చేసిన మోసానికి బ్యాంకు మేనేజ్ మెంట్ తమను వేధిస్తోందని, రుణాలు ఇవ్వకుండా.. తాకట్టులో ఉన్న బంగారం తిరిగివ్వకుండా ముప్పుతిప్పలు పెడుతోందని సదరు మండలంలోని పలు గ్రామాల రైతులు ప్రత్తిపాటికి తెలిపారు. రైతుల ఆవేదనపై స్పందించిన ఎమ్మెల్యే బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. ఎప్పుడో జరిగిన మోసం ఇప్పటికీ తేలకపోవడమేంటని.. సమస్య పరిష్కరించకుండా ఎన్నాళ్లు అమాయక రైతుల్ని ఇబ్బంది పెడతారని ప్రత్తిపాటి ప్రశ్నించారు. రోజుల వ్యవధిలో సమస్య పరిష్కరించాలని లేకుంటే రైతుల ఆగ్రహానికి మీరే మూల్యం చెల్లించాల్సి వస్తుందని, సమస్య త్వరగా పరిష్కరించకుంటే రైతులు బ్యాంకు వద్ద ధర్నా చేస్తామంటున్నారని ప్రత్తిపాటి అధికారులకు తేల్చిచెప్పారు. ఎవరూ అధైర్యపడవద్దని, సమస్య పరిష్కరించేలా చొరవ తీసుకుంటానని ప్రత్తిపాటి రైతులకు భరోసా ఇచ్చారు.

**శ్మశానాన్ని ఆక్రమించిన వైసీపీ మాజీ కౌన్సిలర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోండి:**

పట్టణంలోని 12, 13 వార్డుల పరిధిలోఆర్.సీ.ఎమ్ చర్చి ఎదురుగా ఉన్న హిందూ, క్రైస్తవ శ్మశానాన్ని ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టిన వైసీపీ మాజీ కౌన్సిలర్ షేక్ కాలేషావలి వ్యవహారంపై టీడీపీ నేతలు, స్థానికులు ప్రత్తిపాటికి ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మాజీమంత్రికి ప్రధాన అనుచరుడిగా ఉన్న సెంట్రింగ్ మేస్త్రి అయిన కాలేషావలి శ్మశానాన్ని ఆక్రమించి షెడ్లు వేసి, వాటిని ఇతరులకు లీజుకు ఇచ్చాడని, కొంత స్థలాన్ని ఇతరులకు అమ్మినట్టు అగ్రిమెంట్లు సృష్టించాడని స్థానికులు ఎమ్మెల్యేతో చెప్పారు. సమస్యపై స్పందించిన ప్రత్తిపాటి... తక్షణమే కాలేషావలిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పోలీసుల సహకారంతో శ్మశానం మొత్తం రీ సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించి.. వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫ్వానిని ఆదేశించారు. వైసీపీని ప్రజలు ఛీకొట్టినా.. వారు చేసిన అక్రమాలు మాత్రం ఇంకా ప్రజల్ని పీడిస్తూనే ఉన్నాయని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్మశాన ఆక్రమణ వెనక ఎవరున్నా వదిలిపెట్టవని, స్థానికులకు మొత్తం శ్మశానాన్ని త్వరలోనే అప్పగిస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు.

## ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న మర్రి రాజశేఖర్



చిలకలూరిపేట, అక్టోబర్ 17, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణము పందరిపురంలో రెండు శతాబ్దాల క్రితం (సుమారు 200 సంవత్సరాల క్రితం) నిర్మితమైన తొలి ఆలయం అత్యంత మహిమగల ఆలయంగా పేరొందిన గంగా పార్వతీ సమేత సుందరేశ్వర దత్తాత్రేయ ఆంజనేయ స్వామి వార్ల దేవాలయం. ఈ ఆలయానికి ధ్వజస్తంభం మార్పు చేయవలసిన అవసరం ఏర్పడింది.ఆ ఆలయానికి అవసరమైన ధ్వజ స్తంభాన్ని చిలకలూరిపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గ్రంధి ఆంజనేయులు గారు దాతగా ఎంతో వ్యయంతో సమకూర్చిన ధ్వజస్తంభం ఆలయానికి అందించారు. ఈరోజు ఆ ఆలయానికి నూతన ధ్వజస్తంభ పున ప్రతిష్ఠ మరియు కలశ ప్రతిష్ఠ వేద పండితుల మంత్రోచ్ఛారణలతో, భక్తుల కోలాహలం మధ్య ధ్వజ స్తంభ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొనవలసినదిగా శాసనమండలి సభ్యులు శ్రీ శ్రీమతి మర్రి రాజశేఖర్ లలితమ్మ గార్లను ఆలయ ధర్మకర్త తెలికేపల్లి అయోధ్య రామయ్య గారు మరియు భక్త బృందం ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ వేడుకలో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు స్వీకరించిన మర్రి రాజశేఖర్ లలితమ్మ గార్లు, శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య గారు, శ్రీ సోమేపల్లి వాసు గారు...ఈ ప్రతిష్టా మహోత్సవములో వారి వెంట గేరా లింకన్ గారు, కొండెబోయిన ఆంజనేయులు గారు, బి వెంకట్రామిరెడ్డి గారు, ఇమ్మడి జానకిపతి గారు, పమిడి శ్రీనివాస్ గారు, కట్టా జవహర్ గారు, నార్నె హనుమంతరావు గారు, నిడమానూరు హనుమంతరావు గారు, గొట్టిపాటి సాంబశివరావు గారు, షేక్ బాబా ఫక్రుద్దీన్ గారు తదితరులున్నారు

## దంత సంరక్షణ కార్యక్రమం

చిలకలూరిపేట, అక్టోబర్ 17, ప్రభాతవార్త: రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట కేర్ డెంటల్ కాలేజీ సహకారంతో శ్రీ శారదాంబ జడ్పీహెచ్ఎస్ హస్కూల్ లో పిల్లలకు దంత సంరక్షణ నివారణ కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ధనలక్ష్మి గారు రోటరీ క్లబ్ అధ్యక్షులు ప్రసాదు ఉప్పుటూరి సెక్రటరీ బోడి రామ సుబ్బారావు గల్లా సాంబశివరావు ఓ బూరి సాంబశివరావు ప్రోగ్రాం కార్య నిర్వాహకులు కాపు వెంకట్రావు పాల్గొనడం జరిగింది

## రూరల్ పరిధిలో దీపావళి బాణాసంచా దుకాణాలను తనిఖీ చేసిన నరసరావుపేట ఆర్డీఓ

చిలకలూరిపేట, అక్టోబర్ 17, ప్రభాతవార్త: రానున్న దీపావళి పండుగ సందర్భంగా, పేట రూరల్ పరిధిలోని బాణాసంచా దుకాణాలలో భద్రతా ప్రమాణాలు మరియు లైసెన్స్ లను నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) తనిఖీ చేశారు. స్థానిక బొప్పుడిలో ఉన్న క్రాకర్ షాపులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, బాణాసంచా దుకాణాలకు సంబంధించి లైసెన్సులు, నిల్వ పరిమాణం, అగ్నిమాపక భద్రతా చర్యలు (ఫైర్ సేఫ్టీ మెజర్స్) ఎలా ఉన్నాయో పరిశీలించినట్లు తెలిపారు. బొప్పుడిలోని సీ మార్ట్ (ది ల్ఫ్యుమ్మ) ను మొదటగా తనిఖీ చేసినట్లు చెప్పారు. తహసీల్దార్, ఫైర్ డిపార్ట్ మెంట్, పోలీస్ డిపార్ట్మెంట్ అధికారులతో కలిసి తాము దుకాణాలను సందర్శించినట్లు తెలిపారు. తనిఖీ చేసిన సీ మార్ట్ దుకాణాలు ఏర్పాటు చేసుకున్న విధానం సంతృప్తికరంగా ఉందని ఆర్డీఓ పేర్కొన్నారు.



చిలకలూరిపేటలో మొత్తం 24 దుకాణాలు ఉన్నాయని, వాటిలో 17 రిటైల్ షాపులు మరియు 7 హోల్ సేల్ షాపులు ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని దుకాణాలను తనిఖీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారా లేదా అని పరిశీలిస్తున్నామన్నారు.స్థానికులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. ఈ దీపావళి పండుగను అందరూ చాలా జాగ్రత్తతో జరుపుకోవాలని కోరుకుంటున్నానని, ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆమె తెలిపారు.

## ఎన్ఈసి కళాశాలలో విద్యార్థులకు వర్క్‌షాప్

రొంపిచర్ల, అక్టోబర్ 17 ప్రభాతవార్త : నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం ఇగ్నైట్ - 2 డే వర్క్‌షాప్ ఆన్ ఇన్నోవేషన్ ఇంట్రాప్రెన్యూర్షిప్ అండ్ స్టార్టప్స్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇన్నోవేషన్ అనేది విద్యార్థుల భవిష్యత్తును అద్భుతంగా మలిచేశక్తి అని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలు కోరుకునేవారిగా ఉండవద్దన్నారు. ఉద్యోగాలు ఇచ్చే ఆవిష్కరణలు చేసి నాయకులుగా ఎదగాలన్నారు. సృజనాత్మకత ఆలోచన, వ్యాపార దృక్పథం ఉండాలని సూచించారు. ఈ వర్క్‌షాప్‌లో మొత్తం 34 టీములు, 136 మంది విద్యార్థులు పాల్గొని సాంకేతిక, సామాజిక, పర్యావరణ సంబంధిత అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌తో పాటు యూకేకు చెందిన వరదరాజన్ కృష్ణ, జపాన్‌కు చెందిన ప్రతినిధులు, మారూరి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

## త్రికోటేశ్వరస్వామి ఆలయ హుండీల లెక్కింపు



నరసరావుపేట, అక్టోబర్ 17 ప్రభాతవార్త : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో వేంచేసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపులను శుక్రవారం నిర్వహించారు. ఆలయ ఈవో, సహాయక కమిషనర్ డి.చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. హుండీల ద్వారా రూ.55,76,935లు, అన్నదానం హుండీ ద్వారా రూ.4,20,319లు కానుకల రూపంలో స్వామివారికి అందించడం జరిగిందన్నారు. మొత్తం 102 రోజులకు రూ.59,97,254లు రావడం జరిగిందన్నారు. హుండీ లెక్కింపులలో గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, దేవస్థానం పర్యవేక్షకులు చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. అదే విధంగా వెండి 330 గ్రాములు, బంగారం 51 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, విదేశీ కరెన్సీ 96 అమెరికన్ డాలర్లు, 140 కెనడా డాలర్లు, 100 యూఏఈ డాలర్లు భక్తులు కానుకలుగా స్వామివారికి సమర్పించారని ఈవో డి.చంద్రశేఖరరావు తెలియజేశారు.

## ఎస్‌కెఆర్‌బిఆర్ కళాశాలలో ఎన్‌సిసి సెలక్షన్స్



నరసరావుపేట, అక్టోబర్ 17 ప్రభాతవార్త : ఎస్‌కెఆర్‌బిఆర్ కళాశాలలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఎన్‌సిసి సెలక్షన్స్ జరిగాయి. జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. వివరాలను మేజర్ వై.అంజిరెడ్డి, పాలకవర్గ ప్రతినిధి కె.వి.పురుషోత్తమరావులు శుక్రవారం తెలియజేశారు. మేజర్ మహ్మద్ సబూర్, హవల్దార్ పి.రమేష్ నియామక అధికారులుగా పాల్గొన్నారు. విద్యార్థులు శారీరక దృఢ పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు బి, సి సర్టిఫికెట్‌కు అర్హులు అవుతారని తెలిపారు. ఎన్‌సిసి సర్టిఫికెట్‌తో ఉన్నత ఉద్యోగాలలోనూ, విద్యలోనూ ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని మేజర్ వై.అంజిరెడ్డి తెలియజేశారు. ప్రిన్సిపాల్స్ సి.హెచ్.వెంకటనాగిరెడ్డి, వెంకటశివ, వై.రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ స్టేట్ మీట్‌కు వాగ్దేవి విద్యార్థులు ఎంపిక





నరసరావుపేట, అక్టోబర్ 17 ప్రభాతవార్త : అండర్-19 ఎస్‌జిఎఫ్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ స్టేట్ మీట్‌కు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వివరాలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఒగూరి నాగేశ్వరరావులు శుక్రవారం తెలియజేశారు. చుండూరు జూనియర్ కళాశాలలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలలో తమ కళాశాల నుండి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. బేస్‌బాల్ స్టేట్ మీట్‌కు ఎం.వెంకటేశ్వర్లు, సాఫ్ట్‌బాల్ టీమ్‌కు ఎన్.ఎల్.సాయిశ్రీనాథ్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్ 1,2,3 తేదీలలో కడపలో జరగబోయే బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్‌లో పాల్గొంటారని వారు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రామ కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, అచ్యుతరావు, పి.డి.రాయల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## విప్రో సంస్థకు ఎంపికైన తిరుమల విద్యార్థులు



నరసరావుపేట, అక్టోబర్ 17 ప్రభాతవార్త : ప్రముఖ మల్టీనేషనల్ సంస్థ విప్రో టెక్నాలజీలో స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 143 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. విప్రో కంపెనీతో కళాశాల ఎంఓయు కుదుర్చుకుంది. వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.నారాయణ శుక్రవారం తెలియజేశారు. 200 మంది విద్యార్థులను ఆరు కోర్సుల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 210 మందికి వివిధ విభాగాలలో పరీక్షలు నిర్వహించి 143 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. గోల్డ్, సిల్వర్ బ్రాంజ్ పద్ధతి ప్రకారం 143 మందికి జావా, ఫుల్‌స్టాక్ సర్టిఫికేషన్స్‌ను ప్రధానం చేశారు. నవంబర్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు.

## సంగం డెయిరీని సందర్శించిన కెరిడ్జ్ పాఠశాల విద్యార్థులు



నరసరావుపేట, అక్టోబర్ 17 ప్రభాతవార్త : సంగం డెయిరీని కెరిడ్జ్ ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. రెండు రోజుల పాటు తమ పాఠశాలకు చెందిన 6,7,8,9 తరగతుల విద్యార్థులు సంగం డెయిరీని పరిశీలించినట్లు ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలియజేశారు. పాల సేకరణ, పాలతో తయారు చేసే పదార్థాలు, ప్యాకేజింగ్, పాలు ఆధారిత ఉప ఉత్పత్తులు, పంచదార, వెన్నె, పెరుగు, నెయ్యి, ఐస్‌క్రీమ్ తయారీపై అవగాహన కల్పించారన్నారు. అదే విధంగా ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం ఆరెంజ్ కలర్ డే ను నిర్వహించారు. ఆరెంజ్ రంగులో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేషధారణ, ఆటలు, సృజనాత్మకత కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొన్నారని ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, ఇన్‌ఛార్జి కోట బాపూజీ పాల్గొన్నారు.

## కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి

నరసరావుపేట, అక్టోబర్ 17 ప్రభాతవార్త : కాపు సంఘం అధ్యక్షులు పోతుల శంకర్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు 496వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాపు సంఘం నాయకులు రాయల శ్రీనివాసరావు, అల్లంశెట్టి మోహన్‌రావు, రామిశెట్టి సుబ్బారావు, రంగిశెట్టి రామకృష్ణ, అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, ఎం.తిరుపతిరావు, మిరియాల సుబ్బమ్మ, జూపల్లి కోటేశ్వరరావు తదితరులు శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రజా రంజకంగా విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించాడని తెలిపారు. చారిత్రాత్మక యువ పురుషుని జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 9వతేదీన కోటప్పకొండలోని శ్రీకృష్ణదేవరాయ అన్నదాన సత్రంలో కార్తీక వనసమారాధన జరుగుతుందని తెలియజేశారు. అదే విధంగా లక్ష్మినాయుడు ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించి ఆ కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు.



## హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ పై అవగాహన

నకరికల్లు,అక్టోబర్ 17 ప్రభాతవార్త : హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్‌వెన్షన్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ పై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్‌వెన్షన్ సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. మున్సిపల్ గరల్స్ హై స్కూల్‌లో ప్రాజెక్ట్ మేనేజర్ హృదయ్‌రాజు, ప్రతినిధులు మేరీ విజయరజిని పాల్గొని మాట్లాడారు. హెచ్ఐవి వ్యాధి గ్రస్తుల పట్ల వివక్షత చూపవద్దన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలియజేశారు. ఎయిడ్స్ పై అపోహలు వీడాలని సూచించారు.

## బాలికను సమయస్ఫూర్తిగా రక్షించిన చీరాల శక్తి బృందం





బాపట్ల,అక్టోబర్17,ప్రభాతవార్త: చీరాల సబ్ డివిజన్ పరిధిలో ఒంటరిగా తిరుగుతున్న మైనర్ యువతిని చీరాల శక్తి బృందం సిబ్బంది గుర్తించి తల్లిదండ్రుల చెంతకు శుక్రవారం చేర్చారు. ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు గారి పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తున్న శక్తి బృందం సభ్యులు శివకుమారి, కానిస్టేబుల్ సుబ్బారావు, ఉమెన్ కానిస్టేబుల్ సునీత కోట్లబజార్‌లో సూట్‌కేసుతో ఒంటరిగా ఉన్న బాలికను గుర్తించారు. సదరు బాలికతో మాట్లాడగా, తల్లిదండ్రులతో గొడవ కారణంగా ఇంటి నుంచి వచ్చేసినట్లు తెలిపింది. అనంతరం చీరాల 1టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు, ఎస్సై రాజ్యలక్ష్మి సమక్షంలో తల్లిదండ్రులకు, బాలికకు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. శక్తి బృందం సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడాన్ని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అభినందించారు. తల్లిదండ్రులతో విభేదించి ఇంటి నుంచి బయటకు రావడం సరికాదని, ఇటువంటి సందర్భాల్లో ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయని యువత జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు.

## ప్రతి వాహన దారుడు విధిగా నిబంధనలు పాటించాలి

పిట్టలవానిపాలెం,అక్టోబర్17,ప్రభాతవార్త: చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద ఎం వెంకట శివకుమార్ శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ వాహనాలను నడిపే ప్రతి వ్యక్తి తగిన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజాదర్బార్: చీఫ్‌విప్ జీ.వీ



వినుకొండ,అక్టోబర్17,ప్రభాతవార్త: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట నందు చీఫ్‌విప్ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జీ.వీ పాల్గొన్నారు. వివిధ సమస్యలపై పట్టణంతోపాటు నియోజకవర్గంలోని గ్రామాలకు చెందిన ప్రజలు వినతులతో కూడిన అర్జీలను జీ.వీకి అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ప్రజలు సమస్యలతో సతమతమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం పూర్తిగా ప్రజల పక్షపాతి అని ప్రజాదర్బార్‌కు వచ్చే ప్రతి అర్జీని అధికారులు త్వరితగతిన పరిష్కారించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛఆంధ్ర,స్వర్ణాంధ్రపై అవగాహన



వినుకొండ,అక్టోబర్17,ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని జెడ్పి బాలికల పాఠశాల నందు విద్యార్థులకు స్వచ్ఛఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శానిటరీ ఇన్స్‌పెక్టర్,శ్రీ సాయి హాస్పిటల్ డాక్టర్ సుంకర అనూష తదితరులు పాల్గొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత,హ్యాండ్ వాష్, స్వచ్ దీపావళి, పర్యావరణ పరిరక్షణ, సింగిల్‌యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగం తదితర అంశాలను వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ శైలజ,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు గణితదీప్తి పుస్తకాలు పంపిణీ



నూజెండ్ల, అక్టోబర్17, ప్రభాతవార్త: మండలంలోని సీతారామపురం గ్రామంలోని ఎస్‌విఎస్‌సి హై స్కూల్ నందు పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏపీ గణిత ఫోరమ్ వారు రూపొందించిన గణితదీప్తి పుస్తకాలను ఉచితంగా స్కూల్ హెచ్ఎం శిష్టా కామేశ్వరరావు శర్మ శుక్రవారం అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ గణితం నందు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి గణితదీప్తి పుస్తకాలు ఎంతగానో దోహదం చేస్తామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలకు ఇసుక కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలి

బాపట్ల,అక్టోబర్17,ప్రభాతవార్త: ప్రజల అవసరాలకు ఇసుక కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులకు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అందుబాటులో గల ఇసుక రిచ్ వివరాల పై మైనింగ్ శాఖ అధికారిని ఆరా తీశారు. జిల్లాలో గాజుల లంక1, గాజులు లంక 2, ఓలేరు ఇసుక రీచ్ మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఓలేరు ఇసుక రిచ్ పై కోర్టు కేసు పెండింగ్ ఉన్నందున ఆ రీచ్ నుండి ఇసుక సరఫరా నిలిపివేయడమైనదని మైనింగ్ శాఖ అధికారి జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఇసుక సరఫరా చేసే వాహనాల రిజిస్ట్రేషన్, జిపిఎస్ తప్పనిసరిగా ఉండాలని ఆర్టీవోకు తెలిపారు. ఇసుక సరఫరాకు సంబంధించి కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. మైనింగ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఇసుక రీచ్ లను పరిశీలించాలన్నారు.. ఇసుక సరఫరా లో ప్రజల నుండి ఐ విఆర్ఎస్ ద్వారా సేకరించిన సమాచారం సంతృప్తికరంగా లేదని ఈ విషయమే తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మైనింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్,గనుల శాఖ సహాయ సంచాలకులు రామచంద్ర, జిల్లా రవాణా అధికారి పరంధామ రెడ్డి, చీరా ఆర్డీవో చంద్రశేఖర్ మరియు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## భార్యను హత్య చేసిన వ్యక్తికి జీవితఖైదు, రూ. 8 వేల జరిమానా



బాపట్ల,అక్టోబర్17,ప్రభాతవార్త: ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఏ.భారతి శుక్రవారం సంచలన తీర్పు వెలువరించారు. బాపట్ల జిల్లా, సంతమాగులూరులో భార్యను అతి కిరాతకంగా హత్య చేసి, సాక్ష్యాలను మాయం చేయడానికి ప్రయత్నించిన రావూరి వెంకట నారాయణ (33)కు జీవితఖైదుతో పాటు రూ. 8,000 జరిమానా విధించారు. నేరస్థులకు శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందని, ఇటువంటి తీర్పులు సమాజంలో నేర ప్రవృత్తిని అరికట్టడానికి దోహదపడతాయని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపిఎస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 2021 డిసెంబర్ 31న సంతమాగులూరులోని ఎస్.టి కాలనీకి చెందిన రావూరి వెంకట నారాయణ తన భార్య మరియమ్మ (31)ను అనుమానంతో కత్తితో దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని గ్రామ సమీపంలోని పంట కాలువలో పడవేశాడు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తన అల్లుడు ప్రసన్న ప్రశ్నించగా, హత్య విషయం చెప్పి పారిపోయాడు.అప్పటి ఎస్ఐ జి. శివన్నారాయణరావు కేసు నమోదు చేయగా, సీఐ ఎమ్. రాజేష్ దర్యాప్తు చేపట్టి ముద్దాయిని అరెస్ట్ చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఒంగోలు కోర్టులో జరిగిన విచారణలో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో, సీఐ కె. వెంకటరావు, ఎస్ఐ ఎమ్. పట్టాభిరామయ్య, కోర్టు సిబ్బంది వి. రాఘవరావు, కె. శ్రీనుల కృషి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి. వసుంధర, వై. ప్రశాంత కుమారిల వాదనలు నిందితుడి నేరాన్ని నిరూపించాయి.ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు.

## సముద్రతీర ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు



బాపట్ల,అక్టోబర్17,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా సముద్రతీర ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో తీరప్రాంత పోలీసు అధికారులతో ఎస్పీ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ మద్యం సేవించి ఎవరూ సముద్రంలోకి వెళ్ళకూడదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అని హెచ్చరించారు. సూచించిన ప్రదేశాల్లోనే యాత్రికులు స్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూర్యలంక, వాడరేవు, రామాపురం, నిజాంపట్నం బీచ్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్ నిఘా, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు.లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్‌లతో గజఈతగాళ్లను, మెరైన్ పోలీసులను సిద్ధంగా ఉంచాలన్నారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో సముద్రతీరాలకు వచ్చే అవకాశం ఉండడంతో తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.. ఏవైనా నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేపల్లె డీఎస్పీ ఏ. శ్రీనివాసరావు, బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మాతృ, శిశు మరణాలు అరికట్టాలి

బాపట్ల,అక్టోబర్17,ప్రభాతవార్త: మాతృ, శిశు మరణాలు అరికట్టాలని వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ సూచించారు. మాతృ, శిశు మరణాల నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాన్పుల సమయంలో తల్లులు మృతి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అద్దంకి, వేటపాలెం మండలాలలో గడిచిన 10 నెలల్లో మూడు మాతృ మరణాలు సంభవించడంపై ఆయన సమీక్షించారు.ప్రజల ప్రాణాల బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. మాతృ మరణాలు ఎలా తగ్గించగలమో అలా ప్రయత్నం చేస్తూ శ్రద్ధగా పనిచేయాలన్నారు. గర్భిణీలకు గుండె సమస్య ఉన్నట్లు గుర్తిస్తే తక్షణమే గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వారిని తరలించాలన్నారు. గర్భిణి మహిళలకు ఏడో నెల రాగానే గుండె పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. గర్భిణీలకు ఇచ్చే ఎన్ సి బి కార్డులను వైద్యాధికారులు నిరంతరం పరిశీలించాలన్నారు. వైద్య రంగంలో ప్రజల ప్రాణాలు రక్షించడం కీలక బాధ్యత అని వివరించారు. సమర్థంగా పనిచేయాలని పలు సూచనలు చేశారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నాదెండ్ల తహశీల్దార్



చిలకలూరిపేట, అక్టోబర్ 17, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గం, నాదెండ్ల మండల నూతన తహసీల్దార్ గా ఏపూరి వెంకటబాబు కుటుంబరావు బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాజీ మంత్రివర్యులు, నియోజకవర్గ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు, ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కుటుంబరావుని పుల్లారావు అభినందించారు

18-10Pg5 9_18-10Pg5.qxd 10/17/2025 10:39 PM Page 1



# అమెరికాలో మిన్నంటిన దీపావళి వేడుకలు



**న్యూయార్క్, అక్టోబరు 17:** అమెరికాలో దీపావళి సంబరాలు మిన్నంటాయి. దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ఈ వెలుగుల పండగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మేయర్లు, రాష్ట్ర గవర్నర్లు వంటి ప్రముఖ అమెరికన్ రాజకీయ నేతలు పాల్గొని, ప్రవాస భారతీయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ సమాజం అమెరికా అభివృద్ధికి అందిస్తున్న సేవలను వారు ప్రత్యేకంగా కొనియాడారు. న్యూయార్క్ నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్ తన అధికారిక నివాసమైన గ్రేసీ మాన్షన్‌లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూయార్క్ నగర సాంస్కృతిక, ఆర్థిక ప్రగతిలో భారతీయ సమాజం పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని అన్నారు. భారత కాన్సులేట్ జనరల్ తరఫున ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ కాన్సుల్ జనరల్ విశాల్ జయేష్‌భాయ్ హర్ష్.. వెలుగు, ఆశ, ఆనందానికి ప్రతీకైన దీపావళి సందేశాన్ని అందరికీ తెలియజేశారు. మరోవైపు న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ ఫ్లషింగ్‌లోని శ్రీ స్వామినారాయణ మందిరంలో జరిగిన దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రవాస భారతీయులకు నిరంతరం మద్దతు ఇస్తున్నందుకు గవర్నర్‌కు కాన్సులేట్ అధికారులు ధన్యవాదాలు తెలిపారు. ఫ్లోరిడాలోని టల్లాహస్సీలో ఉన్న ఫ్లోరిడా క్యాపిటల్‌లో మొట్టమొదటిసారిగా దీపావళి సంబరాలు నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర అధికారులు, ప్రవాస భారతీయ ప్రముఖులు పాల్గొన్నారు. టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో కూడా దీపావళి శోభ వెల్లివిరిసింది. హ్యూస్టన్ సిటీ హాల్‌లో మేయర్ జాన్ విట్‌మిర్‌తో కలిసి భారత కాన్సుల్ జనరల్ డీసీ మంజునాథ్ వేడుకల్లో పాల్గొన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే ఈ పండగను సిటీ హాల్‌లో నిర్వహించినందుకు మేయర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రదర్శించిన కథక్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# బీహార్‌లో మళ్లీ గెలుస్తాం

## - నితీశ్ నేతృత్వంలోనే ఎన్నికల బరిలోకి ఎన్డీయే
## - ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నాం: అమిత్‌షా

**పాట్నా, అక్టోబరు 17:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి కూడా భారీ మెజారిటీతో గెలువబోతున్నాం, మళ్లీ ఎన్‌డియే ప్రభుత్వం ఏర్పడబోతుందని కేంద్ర హోంమంత్రి, బిజెపి అగ్రనేత అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారంనాడు శరణ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈసారి బీహార్ ప్రజలకు నాలుగు దీపావళి పండగలు జరుపుకొనే అవకాశం వచ్చింది. శ్రీరాముడు అయోధ్యకు తిరిగివచ్చినందుకు మొదట దీపావళి చేసుకుంటారు. ఆ తర్వాత ప్రభుత్వ పథకం కింద మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేసినప్పుడు రెండోది, జిఎస్‌టిపై 5శాతానికి తగ్గించినప్పుడు మూడో దీపావళి. ఇక నవంబర్ 14న ఓట్ల లెక్కింపు రోజు నాలుగో దీపావళిని జరుపుకొంటారు. ఎన్‌డియేకు మోడీ ప్రధాన ఆకర్షణ అయినా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోనే బిహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు షా వెల్లడించారు. లాలూ, రబ్రీదేవి జంగిల్‌రాజ్ పాలనకు వ్యతిరేకంగా నితీశ్ పోరాడాడని గుర్తు చేశారు. బీహార్‌ను జంగిల్ రాజ్ నుంచి విముక్తి చేశారని కొనియాడారు. ప్రధాని మోడీ గత 11 ఏళ్లుగా బీహార్ అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని వివరించారు. ఎన్‌డియే ప్రభుత్వం ఏర్పాటు కాకముందు బీహార్‌లో వలసలు, దోపీడీలు, హత్యలు, కిడ్నాప్‌లు సాధారణంగా ఉండేవని గుర్తుచేశారు. మరోవైపు గ్యాంగ్ స్టర్ మహ్మద్ శాబుద్దీన్ కుమారుడు ఒసామాకు ఆర్‌జెడి టికెట్ కేటాయించడం పట్ల అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అభ్యర్థులను బరిలో దింపి బీహార్ ప్రజల భద్రతకు ఎలా హామీ ఇస్తారని ప్రశ్నించారు. అలాగే లాలూ ప్రసాద్ యాదవ్, మహాఘట్ బంధన్ పై అమిత్ షా విమర్శలు గుప్పించారు. లాలూ పాలనను చూసిన బీహార్ ప్రజలు, మళ్లీ తమ రాష్ట్రంలో మహాఘట్ బంధన్ తిరిగి అధికారంలోకి రావాలని కోరుకోవడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మిత్రపక్షాలను తక్కువగా చూస్తుందని దుయ్యబట్టారు. ఇతర పార్టీలను తక్కువ చేసి చూడడం వల్ల కాంగ్రెస్ కూడా చిన్నదిగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఉన్న ఈ అహంకారమే ఆ పార్టీని బీహార్ నుంచి బెంగాల్ వరకు అన్ని రాష్ట్రాలలో పట్టును కోల్పోయేలా చేసిందన్నారు. అంతకుముందు బీహార్‌లోని ఎన్‌డియేలో చీలికలు ఉన్నాయనే ఊహాగానాలను కేంద్ర హోంమంత్రి, అమిత్ షా తోసిపుచ్చారు. త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జెడియు అధినేత, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్‌డియే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాతే బిజెపి, దాని మిత్రదేశాలు సిఎం అభ్యర్థిని నిర్ణయిస్తాయని వెల్లడించారు. ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ అమిత్ షా కీలక విషయాలను వెల్లడించారు. 'ఎన్నికల ఫలితాల తర్వాతే సిఎం అభ్యర్థిని నిర్ణయిస్తాం... నితీశ్ కుమార్ మళ్లీ బీహార్ ముఖ్యమంత్రి అవుతారా? లేదా? అని నిర్ణయించేది నేను కాదు. ప్రస్తుతానికి, మేము నితీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్నికల బరిలో దిగుతున్నాం. ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్‌డియే పక్షాలన్నీ కలిసి కూర్చుని తమ ముఖ్యమంత్రి అభ్యర్థిని నిర్ణయిస్తాయి. 2020 ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని మోడీని నీతీశ్ కలిశారు. జెడియు కంటే ఎక్కువ సీట్లు గెలుచుకున్న బిజెపికి చెందిన అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కానీ తాము ఎల్లప్పుడూ కూటమిని గౌరవించాం. నితీశ్ కుమార్ సంపాదించుకున్న గౌరవం, ఆయన సీనియారిటీ ఆధారంగా ఆయనకే బీహార్ పగ్గాలు అప్పగించాం' అని అమిత్ షా ఈ సందర్భంగా గుర్తుచేశారు. పాట్నా పర్యటనలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను కలిశారు. బీహార్‌లో తాజా రాజకీయ పరిస్థితులపై దాదాపు 15 నిముషాలపాటు చర్చించారు. ఈ భేటీలో జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, బిజెపి సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## 2,000 తోమహాక్ క్షిపణులతో
# పుతిన్‌పై గురి!
## యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్, అక్టోబరు 17:** ఉక్రెయిన్-రష్యా మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పే అంశంపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను నయానో, భయానో ఒప్పించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ఉక్రెయిన్‌కు దీర్ఘశ్రేణి తోమహాక్ క్షిపణులు రెండు వేళ వరకు అందజేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పుతిన్‌తో ఫోన్‌కాల్ నేపథ్యంలో ఈ విషయంపై స్వయంగా ఆయనతో చర్చించినట్లు తెలిపారు. పుతిన్‌తో ఫోన్‌కాల్ విషయంపై విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు తోమహాక్‌లు అందించవద్దంటూ పుతిన్ మిమ్మల్ని కోరారా? అని ఓ రిపోర్టర్ ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి బదులిస్తూ.. 'ఉక్రెయిన్‌కు దయచేసి తోమహాక్‌లు ఇవ్వండి. నేను దాన్ని అభినందిస్తున్నా' అని పుతిన్ అంటాడు అని మీరు అనుకుంటున్నారా? అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. తర్వాత మీ ప్రత్యర్థికి 2 వేల తోమహాక్ క్షిపణలు ఇస్తే మీకు అభ్యంతరం ఉంటుందా? అని తాను పుతిన్‌ను ప్రశ్నించానని తెలిపారు. దీనిని పుతిన్ నుంచి బలమైన వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. 'నేను నిజంగా అలాగే అన్నాను. ఈ ఆలోచన పుతిన్‌కు నచ్చలేదు. తోమహాక్ అతి దారుణమైన, అతి విధ్వంసకర ఆయుధం. అలాంటి దీర్ఘశ్రేణి ఆయుధం తమపై కాల్పులు జరపాలని ఎవరూ కోరుకోరు' అని ట్రంప్ అన్నారు. ట్రంప్‌తో ఫోన్‌కాల్‌లో ఈ తోమహాక్ క్షిపణుల గురించి పుతిన్ మాట్లాడారని క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషాకోవ్ పేర్కొన్నారు. అవి ఉక్రెయిన్‌కు అందించడంతో.. అమెరికా-రష్యా సంబంధాలు దెబ్బ తింటాయని పుతిన్ ఉద్ఘాటించినట్లు తెలియజేశారు.

ఇక, పుతిన్‌తో అద్భుతమైన సంభాషణ జరిగిందంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా వివరించారు. మరికొన్ని రోజుల్లో హంగరీ రాజధాని బుడాపెస్ట్‌లో పుతిన్‌తో భేటీ కానున్నట్లు తెలిపారు. ఇక్కడి చర్చల్లోనైనా రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ముగింపునకు అడుగులు పడాలని భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.

## డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పు: సుప్రీంకోర్టు ఆందోళన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:** డిజిటల్ అరెస్టులు ఇటీవల సైబర్ నేరగాళ్ల ఎంచుకొన్న కొత్త పంథా ఇదే. దీని పేరు చెప్పి అవతలి వ్యక్తులను భయాందోళనకు గురిచేస్తూ పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేస్తున్నారు. దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి. తాజాగా ఈ మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సుమోటోగా తీసుకున్న ఈ కేసు విచారణ సందర్భంగా కేంద్రం, సిబిఐలకు వారి స్పందన తెలపాలని న్యాయస్థానం ఆదేశించింది. హర్యానాలోని అంబాలాకు చెందిన 73 ఏళ్ల ఓ మహిళ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌కి ఫిర్యాదు పత్రం రాశారు. తనను డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించారన్నారు. రూ.కోటి ఇస్తే అరెస్టు నుంచి బయటపడొచ్చని బెదిరింపులకు పాల్పడ్డారని, కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు చూపించి సొమ్ములు కాజేయడాన్ని సిజెఐతో సహా సీనియర్ న్యాయమూర్తులు తీవ్రంగా పరిగణించారు.

## హెచ్ - 1 బి ఫీజు పెంపుపై యుఎస్ ఛాంబర్ సవాల్



### అధ్యక్షుడు ట్రంప్‌కు మరో సమస్య
### ఫీజు హెచ్చింపు పూర్తిగా చట్ట విరుద్ధం

**వాషింగ్టన్, అక్టోబర్ 17:** హెచ్1బీ వీసా విషయంలో ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీవ్ర వివాదాస్పదంగా మారింది. హెచ్ 1బీ వీసా దరఖాస్తు ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచడాన్ని సవాల్ చేస్తూ యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు గురువారం వాషింగ్టన్‌లోని జిల్లా కోర్టులో ట్రంప్ ప్రభుత్వంపై దావా వేసింది. ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ ఫీజు పూర్తిగా చట్టవిరుద్ధమని, ఇది అమలైతే అమెరికన్ కంపెనీలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ తన పిటిషన్‌లో పేర్కొంది. "ఈ నిర్ణయం వల్ల కంపెనీలు తమ కార్మిక వ్యయాలను విపరీతంగా పెంచుకోవాల్సి వస్తుంది. లేదంటే దేశీయంగా ప్రత్యామ్నాయం లేని అత్యంత నైపుణ్యం కలిగిన ఉద్యోగులను నియమించుకోవడం తగ్గించుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇది అమెరికా ఆర్థిక ప్రత్యర్థులకు మేలు చేకూర్చే ప్రమాదకరమైన విధానమని అభిప్రాయపడింది. ఈ ఫీజు వల్ల అమెరికా కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను నియమించుకోవడం చాలా ఖరీదైన వ్యవహారంగా మారుతుందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నీల్ బ్రాడ్లీ ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు ఈ నిర్ణయాన్ని ట్రంప్ ప్రభుత్వం గట్టిగా సమర్థిస్తోంది. అమెరికన్లకే ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ ఫీజును తీసుకొచ్చినట్లు ట్రంప్ గతంలో తెలిపారు. ఈ విధానం వల్ల కంపెనీలు విదేశీ ఉద్యోగులను నియమించు కోవడానికి వెనకాడుతాయని, బదులుగా అమెరికన్ గ్రాడ్యుయేట్లకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకుంటాయని వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ వివరించారు. హెచ్1బీ నిబంధనలపై ట్రంప్ సర్కారుకు ఇది రెండో పెద్ద న్యాయ పరమైన సవాలు. ఈ నెల 3న కూడా కొన్ని యూనియన్లు, విద్యాసంస్థలు కలిసి కాలిఫోర్నియా కోర్టులో దావా వేశాయి. ఈ వివాదంపై గందరగోళం నెలకొనడంతో వైట్ హౌస్ గతంలోనే స్పష్టతనిచ్చింది. లక్షడాలర్ల ఫీజు వీసా కోసం దరఖాస్తు చేసుకునే కొత్తవారికి మాత్రమే.

## ఏకకాలంలో భారత్, అఫ్ఘాన్‌తో యుద్ధానికి సిద్ధం
### పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్



**ఇస్లామాబాద్, అక్టోబరు 17:** భారత్‌పై పాకిస్థాన్ మరోసారి పిచ్చి ప్రేలాపనలు చేసింది. అఫ్ఘానిస్థాన్ మనకు దగ్గరవడం జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతోంది. సరిహద్దు వెంట భారత్ డర్టీ గేమ్స్ ఆడేందుకు అవకాశాలున్నాయని దాయాది రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేసారు. తాలిబాన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. ఖ్వాజా ఆసిఫ్ టివి ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్‌తో కూడా సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రమైతే ఎలా? అని మంత్రికి ప్రశ్నకు ఎదురుకాగా.. 'అవును.. దానిని కొట్టిపారేయలేం. ద్విముఖ యుద్ధానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉంది. అందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి. వాటి గురించి నేను చర్చించను' అని చెప్పారు. అప్పుడే భారత్ గురించి నోరు పారేసుకున్నారు. అలాగే తమ దేశంలో నివసిస్తోన్న అఫ్ఘాన్ శరణార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. 'వారి వల్ల పాక్‌కు ఎలాంటి ఉపయోగం లేకపోగా.. వారి ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారు. పాక్‌లో అక్రమంగా నివసిస్తోన్న వారిని గుర్తిస్తున్నాం. వారు వెంటనే మా దేశాన్ని వీడాలి' అని వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో ఇరు దేశాల బలగాలు పలుచోట్ల పరస్పరం దాడులకు దిగిన సంగతి తెలిసిందే.

## ఆ అధికారుల ఇళ్లల్లో కరెన్సీ కట్టలు

### - సిబిఐ సోదాలు.. భారీగా నగదు సీజ్ - బంగారు ఆభరణాలు, కార్లు స్వాధీనం
### - పంజాబ్‌లో డిఐజి ఇంట్లో రూ.5 కోట్ల నగదు - ఎన్‌హెచ్ ఇఇ నివాసంలో రూ.2.62 కోట్లు లభ్యం



**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** పంజాబ్‌లో లంచం తీసుకుంటూ పట్టుబడిన డిఐజి హర్చరణ్ సింగ్ భుల్లార్, ఎన్‌హెచ్ఐడిసిఎల్ ఇఇ మైస్నం రితేన్ కుమార్ సింగ్ ఇళ్లలో సిబిఐ అధికారులు సోదాలు చేశారు. కళ్లు చెదిరేలా ఆ అధికారుల ఇళ్లలో నోట్ల కట్టలు బయటపడ్డాయి. డిఐజికి సంబంధించి పంజాబ్, చండీగఢ్‌లలో భుల్లార్ నివాసాల్లో సుమారు 5 కోట్ల నగదు, కిలోన్నర బంగారు ఆభరణాలు, స్థిరాస్తుల డాక్యుమెంట్లు, రెండు లగ్జరీ వాహనాల తాళాలు, 22 లగ్జరీ గడియారాలు లభ్యమయ్యాయి. లాకర్ తాళాలు, 40 లీటర్ల దిగుమతి చేసిన మద్యం, డబుల్ బ్యారెల్ గన్, పిస్టల్, రివాల్వర్, ఎయిర్‌గన్‌తో సహా తుపాకులు, మందుగుండు సామగ్రిని సిబిఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటు జాతీయ రహదారుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఐడిసిఎల్) ఎగ్జికూటివ్ డైరెక్టర్ మైస్నం రితేన్ కుమార్ సింగ్‌కు సంబంధించి గువహటి, ఘజియాబాద్, ఇంఫాల్ సహా పలు ప్రాంతాల్లో సిబిఐ అధికారులు సోదాలు చేశారు. లెక్కల్లో చూపని రూ.2.62 కోట్ల నగదు, భూములు, 20 అపార్ట్‌మెంట్లకు సంబంధించిన దస్త్రాలు లభించాయి. నిందితుడు, అతని కుటుంబ సభ్యుల పేరు మీదు ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో తొమ్మిది ప్రీమియం అపార్ట్‌మెంట్ యూనిట్లు, ఒక ప్రీమియం ఆఫీస్ స్థలం, మూడు నివాస ప్లాట్లు, బెంగళూరులో లగ్జరీ అపార్ట్‌మెంట్, నివాస ప్లాట్, గువహటితో నాలుగు అపార్ట్‌మెంట్లు, రెండు నివాస ప్లాట్లు, ఇంఫాల్ వెస్ట్‌లో వ్యవసాయ భూమి, రెండు హోమ్‌స్టెడ్ ప్లాట్‌లు ఉన్నట్లు గుర్తించారు. ఆరు హై-ఎండ్ లగ్జరీ కార్లు, లక్షల విలువైన రెండు ఖరీదైన గడియారాలను కూడా సిబిఐ అధికారులు సీజ్ చేశారు.

## సంక్షిప్తంగా..

### ముత్తాఖీ ప్రెస్‌మీట్‌కు మహిళా జర్నలిస్టులు



**వాషింగ్టన్, అక్టోబరు 17:** ఇటీవల భారత్‌కు వచ్చిన అఫ్ఘాన్ విదేశాంగ మంత్రి అమిర్‌ఖాన్ ముత్తాఖీ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉద్దేశపూర్వకంగానే మహిళలు పాల్గొనకుండా నిషేధం విధించారంటూ విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. తర్వాత ఆయనే స్వయంగా తన ప్రెస్‌మీట్‌కు రావాల్సిందిగా మహిళా జర్నలిస్టులను ఆహ్వానించారు. దీనిపై తాజాగా అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు సిడ్నీ కామ్లేజర్ డోవ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మహిళల సమాన హక్కుల కోసం ఎదురొడ్డి నిలబడిన జర్నలిస్టులను చూస్తూ సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. కామ్లేజర్ డోవ్ భారత్‌లోని మహిళా జర్నలిస్టులను ప్రశంసిస్తూ.. భారత్‌కు చెందిన మహిళా జర్నలిస్టులు తమ సమాన హక్కుల కోసం ధైర్యంగా పోరాడారన్నారు.

### ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఇంటికి బాంబు బెదరింపు


**చెన్నై, అక్టోబరు 17:** భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నివాసానికి బాంబు బెదిరింపు రావడం శుక్రవారం చెన్నైలో తీవ్ర కలకలం సృష్టించింది. గుర్తుతెలియని వ్యక్తులు పంపిన ఈమెయిల్ హెచ్చరికతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే, క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం ఈ బెదిరింపు కేవలం ఉత్తిదేనని తేల్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చెన్నైలోని ఎస్టేట్ పోలీస్ స్టేషన్‌కు ఈ రోజు ఒక ఈమెయిల్ వచ్చింది. నగరంలోని మైలాపూర్ ప్రాంతంలో ఉన్న ఉపరాష్ట్రపతి నివాసంలో బాంబు పెట్టినట్లు ఆ మెయిల్‌లో ఉంది. ఈ హెచ్చరికను ఉన్నతాధికారులు అత్యంత తీవ్రంగా పరిగణించారు. వెంటనే సీనియర్ పోలీసు అధికారులు, బాంబ్ డిటెక్షన్ నిపుణులు, స్నిఫర్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి హుటాహుటిన రంగంలోకి దిగారు. అయితే, విచారణలో ఒక ఆసక్తికర విషయం బయటపడింది. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఈ ఏడాది సెప్టెంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన బెదిరింపు వచ్చిన మైలాపూర్‌లోని ఇంటిని దాదాపు ఏడాది క్రితమే ఖాళీ చేసినట్లు పోలీసు వర్గాలు ధృవీకరించాయి. ప్రస్తుతం ఆయన చెన్నైలోని అత్యంత కీలకమైన పోయెస్ గార్డెన్ ప్రాంతంలో ఉంటున్నారు.

### ఏడువేల కిలోమీటర్ల వేగంతో 'ధ్వని' క్షిపణి

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** రక్షణ రంగంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధిస్తుంది. హైపర్ సోనిక్ క్షిపణులపై ప్రయోగాలను ముమ్మరం చేస్తోంది. హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ (హెచ్‌జివి) 'ధ్వని ' పరీక్షలను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని డిఆర్‌డిఒ ప్రయత్నిస్తున్నది. అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, డ్రోన్ల ప్రాజెక్టులపై భారత రక్షణ రంగం దృష్టి సారిస్తోంది. 2025 డిసెంబర్ నాటికి హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్ ధ్వని పరీక్షలను పూర్తి చేయాలని ప్రయత్నిస్తోంది. బ్రహ్మోస్ ఆపరేషన్ సింధూర్‌లో వినియోగించిన శక్తివంతమైన క్షిపణి బ్రహ్మోస్ భారతదేశం , రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఒక ఒక సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్. దీనిని భూమి, సముద్రం , గాలి నుండి ప్రయోగించవచ్చు. అంతే కాదు,ఇది అత్యంత వేగవంతమైన , శక్తివంతమైన క్షిపణి వ్యవస్థలలో ఒకటిగా పరిగణించబడుతుంది.

ధ్వనివేగానికి మూడు రెట్లు వేగాన్ని కలిగి ఉంది, దాని పరిధి 300 కిలోమీటర్ల వరకు ఉంటుంది.

### సైనిక స్థావరంపై ఉగ్రవాదుల దాడి



**గువాహతి, అక్టోబరు 17:** ఈశాన్య రాష్ట్రం అసోంలో ఉద్రిక్తత నెలకొంది. భారత సైనిక స్థావరం లక్ష్యంగా ఉగ్రవాదులు మరోసారి పంజా విసిరారు. 24 గంటల వ్యవధిలోనే ఇది రెండో దాడి కావడం ఆందోళన కలిగిస్తోంది. టిన్ సుకియా జిల్లాలోని కకోపథార్ పట్టణంలో ఉన్న 19 గ్రెనేడియర్స్ యూనిట్‌కు చెందిన ఆర్మీ క్యాంప్‌పై శుక్రవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగింది. గుర్తుతెలియని దుండగులు క్యాంప్‌పైకి గ్రెనేడ్లు విసిరి, కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు సైనికులు గాయపడినట్లు అధికారులు తెలిపారు. స్థానిక కథనాల ప్రకారం అర్ధరాత్రి 12:15 గంటల ప్రాంతంలో మొదలైన కాల్పులు దాదాపు అరగంట పాటు కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ దాడి వెనుక యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం ఇండిపెండెంట్ (ఉల్ఫాఐ) హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని మన్‌మావ్‌లో అస్సాం రైఫిల్స్ దళాలపై ఉల్ఫాఐ తిరుగుబాటుదారులు దాడికి పాల్పడినారు.

# గుజరాత్ కొత్త మంత్రివర్గం ప్రమాణం

### కొత్త కూర్పులో 26 మంది..
### క్రికెటర్ జడేజా భార్యకు కేబినెట్ బెర్త్
### ఉప ముఖ్యమంత్రిగా హర్ష్ రమేష్ భాయ్



**అహ్మదాబాద్, అక్టోబరు 17:** గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. 26 మంది సభ్యులతో కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది. శుక్రవారం వారంతా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో కొత్త మంత్రులతో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర హోం మంత్రి హర్ష్ సంఘవి ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త మంత్రివర్గంలో క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజా కు కూడా చోటు దక్కింది. ఆమె కూడా ఇవాళ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ సహా పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. టీమిండియా క్రికెటర్ రవీంద్ర జడేజా తన కూతురుతో కలిసి హాజరయ్యారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో మంత్రులంతా నిన్న మూకుమ్మడిగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ వారి రాజీనా మాలను ఆమో దిం చారు. అనంతరం సీఎం భూపేంద్ర పటేల్ నిన్న రాత్రి గవర్నర్‌ను కలిశారు. మంత్రుల రాజీనామాలను అధికారికంగా గవర్నర్‌కు సమర్పించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుల, ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని సమతుల్యం చేయడం, ప్రభుత్వంలో కొత్త శక్తిని నింపేందుకు బీజేపీ విస్తృత వ్యూహంలో భాగంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. గుజరాత్ ఉప ముఖ్యమంత్రి గా బీజేపీ నేత హర్ష్ రమేష్‌భాయ్ సంఘవీ శుక్రవారంనాడు ప్రమాణస్వీకారం చేశారు. గుజరాత్ మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా 16 మంది రాష్ట్ర మంత్రులు గురువారం రాజీనామా చేశారు. సంఘవితో పాటు బీజేపీ నేతలు స్వరూజ్‌జీ ఠాకోర్, ప్రవీణ కుమార్ మాలి, రుషీకేశ్ పటేల్, దర్శన్ వాఘేలా, కున్వర్‌జీ బవలియా, రివబ జడేజా, అర్జున్ మోద్వాడియా, పర్సోత్తమ్ సోలంకి, జితేంద్ర వాఘాని, ప్రఫుల్ పాన్‌షేరియా, కునుభాయ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్, ముఖ్యమంత్రి పటేల్ సమక్షంలో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. గుజరాత్ 6వ ఉప ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన వ్యక్తి సంఘవి. కాంగ్రెస్ నేత చిమన్‌బాయ్ పటేల్ తొలి ఉప ముఖ్యమంత్రిగా 1972 నుంచి 73 వరకూ పనిచేశారు.

పటేల్‌తో పాటు కాంగ్రెస్ మరో నేత కాంతిలాల్ ఘూయ్ ఇదే సమయంలో ఉప ముఖ్యమంత్రిగా అప్పటి ముఖ్యమంత్రి ఘన్‌శ్యామ్ ఓజా మంత్రివర్గంలో పనిచేశారు. మూడో ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నేత కేశూభాయ్ పటేల్ 1990 మార్చి నుంచి అక్టోబర్ నుంచి వరకూ అప్పటి సీఎం చిమన్‌భాయ్ పటేల్ ఆధ్వర్యంలో పనిచేశారు. పటేల్ సైతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా 1995 మార్చి నుంచి అక్టోబర్ వరకూ, తిరిగి 1998 మార్చి నుంచి 2001 వరకూ పనిచేశారు.

## ప్రైవేటు కొరియర్లకు దీటుగా ఇండియాపోస్ట్ సేవలు!

**న్యూఢిల్లీ,అక్టోబరు 17:** భారత తపాలా శాఖ తన సేవలను ఆధునికీకరించే దిశగా ఒక భారీ సంస్కరణలు తెస్తోంది. ప్రైవేట్ కొరియర్ సర్వీసులకు దీటుగా, దేశంలో ఏ మూలకైనా కేవలం 24 గంటల్లో పార్శిళ్లను చేరవేసే కొత్త విధానాన్ని తీసుకురానుంది. 2026 జనవరి నాటికి ఈ సరికొత్త స్పీడ్ డెలివరీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం ప్రకటించారు. ప్రస్తుతం ఇండియా పోస్ట్ ద్వారా వేగంగా పంపినా, పార్శిల్ చేరడానికి మూడు నుంచి ఐదు రోజుల సమయం పడుతున్న సంగతి తెలిసిందే. మంత్రి సింధియా మరిన్ని వివరాలు వెల్లడించారు. దేశంలోని అన్ని మెట్రో నగరాలు, రాష్ట్ర రాజధానుల్లో 48 గంటల్లో గ్యారెంటీ డెలివరీ సేవలను కూడా 2026 జనవరి నాటికి ప్రారంభిస్తామని తెలిపారు. అంతేకాకుండా, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ ఈకామర్స్ సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు స్పష్టం చేశారు. 2026 మార్చి నాటికి ఈ సంస్థలకు చెందిన వస్తువులను వినియోగదారుల ఇళ్లకు చేర్చే లాస్ట్‌మైల్ డెలివరీ సేవలను కూడా ఇండియా పోస్ట్ అందిస్తుందని ఆయన వివరించారు. దాదాపు రెండు నెలల విరామం తర్వాత అమెరికాకు అన్ని రకాల అంతర్జాతీయ పోస్టల్ సేవలను అక్టోబర్ 15 నుంచి తపాలా శాఖ తిరిగి ప్రారంభించింది. దేశవ్యాప్తంగా సుమారు 1,64,999 పోస్టాఫీసులతో ప్రపంచంలోనే అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటి.

18-10pg6exHMNWJQE 10_18-10pg6exHMNWJQE.qxd 10/17/2025 11:03 PM Page 1





# సిజెఐపై దాడి కాదది.. రాజ్యాంగంపైనే దాడి

**జగ్గయ్యపేట, అక్టోబరు 17 ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిగా తాము భావించటం లేదని దేశంలోని కోట్లాది మంది దళిత వర్గం, వారి ఆత్మగౌరవం, రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో శుక్రవారం ఎమ్మార్‌పిఎస్, ఎంఎస్పి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని యావత్ అధికార, ప్రతిపక్ష పార్టీలు సైతం వ్యతిరేకించాయన్నారు. దాడిచేసిన న్యాయవాదిపై ఇంతవరకు కేసు నమోదు చేయకపోవటం, అరెస్ట్ చేయకుండటం దారుణమని విమర్శించారు. దాడిని ఖండిస్తూ త్వరలో చలో హైదరాబాద్, చలో అమరావతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాగా కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ జాతీయ, రాష్ట్ర నాయకులు మంద వెంకటేశ్వరరావు, పేరెల్లి ఎలీషారావు, కోట దానియేలు, చింతిరాల గోపి, మాతంగి దావీదు, అన్నెపాక కాంతారావు, న్యాయవాదులు ఎం నాగేశ్వరరావు, మాతంగి భాస్కరరావు, బూడిద నరసింహారావు, బెజవాడ భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోండి

- వారానికోసారి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు
- హాస్టళ్లలో పరిశుభ్రత తప్పనిసరి
- అన్నపర్రు ఘటనలు పునరావృతం కానివ్వొద్దు
- రాబోయే టెన్త్, ఇంటర్‌లో వంద శాతం ఫలితాలు రావాల్సిందే
- డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు - ప్రిన్సిపాళ్లతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మంత్రి సవిత

**విజయవాడ, అక్టోబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో చదివే విద్యార్థులకు కంటికి రెప్పల్లా, సొంత బిడ్డల్లా చూసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. రోజూ కురుస్తున్న వర్షాలు, మారు తున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, వారానికోసారి సమీపంలో ఉన్న పీహెచ్సీ వైద్యులతో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు ప్రతి రోజూ హాస్టళ్లను సందర్శించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్ల వార్డెన్లు, ఎంజేపీ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో మంత్రి సవిత శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హాస్టళ్లలో పారిశుధ్యంపై తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్ల నిర్వహణలో నిరక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు వేడి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే ఇవ్వాలన్నారు. వసతి గృహాల పరిసరాలను, మరుగుదొడ్లు, బాత్ రూమ్‌లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాల న్నారు. హాస్టళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా స్థానిక సంస్థల సాయంతో ఫాగింగ్ చేయించాలని మంత్రి ఆదేశించారు.

## దురదృష్టకర ఘటనలకు తావివ్వొద్దు

ప్రస్తుతం రాష్ట్రంలో కొన్న సంక్షేమ హాస్టళ్లలో దురదృష్టకర సంఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి సవిత



దిశానిర్దేశం చేశారు. విద్యార్థులను కన్న బిడ్డల్లా, కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. వారానికోసారి హాస్టళ్లకు సమీపంలో ఉన్న పీహెచ్సీ వైద్య సిబ్బందితో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. ఎవరికైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యాధికారితో వైద్యమందించాలని, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రులకు తరలించాలని స్పష్టంచేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, మారుతున్న వాతావరణ పరిస్థితులతో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. హాస్టళ్లలో విపత్కర పరిస్థితులు తలెత్తగానే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలన్నారు. అన్నపర్రు బీసీ హాస్టల్ వంటి ఘటనలు పునరావృతం కానివ్వొద్దన్నారు.

## రోజూ తనిఖీ ఫొటోలు పంపండి.

డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, కో ఆర్డినేటర్లు రోజూ తమ పరిధిలో ఉన్న బీసీ హాస్టళ్లను, ఎంజేపీ స్కూళ్లను సందర్శించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. సందర్శించిన కో ఆర్డినేట్ ఫొటోలతో తనిఖీ నివేదికలను వాట్సాప్ గ్రూప్‌లో పొందుపర్చాలన్నారు. హాస్టళ్ల నిర్వహణలో వార్డెన్లు, డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, కో ఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యసాధనలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

## వంద శాతం ఫలితాలే లక్ష్యం..

రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు రావాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులతో ప్రేమ పూర్వకంగా మెలుగుతూ, విద్యపై ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేలా చూడాలన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ కార్యదర్శి మాధవీలత, వివిధ జిల్లాలకు డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, హాస్టల్ వార్డెన్లు కో ఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



# డిఎస్పీపై దౌర్జన్యం చేస్తే కేసు నమోదు చేయరా!

## రాష్ట్ర దళిత సంక్షేమ సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్ ధ్వజం

**చిత్తూరు, అక్టోబరు 17 ప్రభాతవార్త:** పోలీసుశాఖలో డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జనార్ధనరావుపై దౌర్జన్యం చేసినా జిల్లా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం దారుణమని రాష్ట్ర దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కులానికి చెందిన డిఎస్పీ కావడంతోనే ఆయనపై దౌర్జన్యం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయడం లేదని ఆరోపించారు. ఈ ఘటనపై డిఎస్పీ జనార్ధనరావు నగరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అక్కడి పోలీసులు ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేన్నారు. ఈ వ్యవహారంపై ఎస్పీ స్పదించి దళిత డిఎస్పీ జనార్ధనరావుకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# శెట్టిపల్లి లే అవుట్ డెవలప్మెంట్ పనులను పూర్తి చేయాలి




## జిల్లా కల్లెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి కలెక్టరేట్, అక్టోబరు 17 ప్రభాతవార్త:** శెట్టిపల్లి లే అవుట్ డెవలప్మెంట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దివాకర్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కల్లెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం స్థానిక కల్లెక్టరేట్‌లలోని మినీ కాన్ఫెరెన్స్ హాల్ నందు సంబంధిత అధికారులు, ప్లానింగ్ అధికారులతో జూమ్ కాన్ఫెరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేసారు. శెట్టిపల్లి భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకడంతో, త్వరలోనే లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతున్నదని, అందులో భాగంగా శెట్టిపల్లిలో ఆధునిక మౌలిక సదుపాయాలతో కూడిన లేఔట్ నిర్మాణం జరుగుతుందనీ, అందులో రోడ్లు, డ్రైనేజ్, త్రాగునీటి పైపులు, విద్యుత్, పార్కులు వంటి సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. లే అవుట్ డెవలప్మెంట్ పనులను సంబంధిత అధికారుల సమన్వయం చేసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని తుడా, రెవెన్యు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుపతి రెవెన్యు అధికారి రాంమోహన్, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారి దేవి కుమారి, తుడా భూ సేకరణ అధికారి సుజన, తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి వాణిశ్రీ, ఎస్ఇ కృష్ణారెడ్డి, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్, ఎఇసిఒఎం సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం



సిఎం, డిసిఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కంచర్ల శ్రీకాంత్, తదితరులు

**కుప్పం, అక్టోబరు 17 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ఉద్యోగులకు సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఏర్పాటుచేసిన 'థ్యాంకూ సిఎం సార్' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు నాయుడు, డి.సిఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, ఎపిఇడబ్ల్యుసి చైర్మన్ రాజశేఖర్ తదితరులు పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం దీపావళి కానుకగా పంచాయతీల వర్గీకరణ, పదోన్నతులు కల్పించాలని నిర్ణయించడం సంతోషకరమైన అంశం అన్నారు. కార్యక్రమంలో కడ సభ్యులు రామచంద్ర, సుగుణమ్మ, పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, కాణిపాకం వెంకటేష్, కాణిపాకం ఆలయ సభ్యులు నరేష్, వసంతమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయానికి పోటెత్తిన భక్తజనం

**శ్రీకాళహస్తి, అక్టోబరు 17 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం శుక్రవారం మహిళా భక్తులతో కిటకిట లాడింది. ఆలయంలో శుక్ర వారం అమ్మవారికి బంగారు చీర అలంకారం, శివయ్యకు విశేష సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు. కాగా ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చతోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతు దోష నివారణ పూజలు, స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం, మృత్యుంజయ స్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ప్రవేశిస్తే ఎనలేని మధురానుభూతి కల్గుతుంది. ఇక్కడి ఆలయ నిర్మాణామో స్వామి అమ్మవార్ల మహత్యమో కాని ఆలయంలోని కంచుగడప దాటితే ఇక బయటి ప్రపంచం గుర్తుకురాదు. ఆధ్మాత్మిక చింతక కల్గుతుంది. ఇక ఆలయంలో ప్రవేశిస్తూనే ఎదురుగా చిన్మయముద్ర కల్గిన గురు దక్షిణామూర్తి దర్శనం లభిస్తుంది. ఇక ఎడమవైపును ఆకాశ గణపతి, ఆకాశ గంగ దర్శనం లభిస్తుంది. పక్కనే స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి నిత్యకళ్యాణం నిర్వహిస్తున్నారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల నిత్యకల్యాణోత్సవానికి విశేష స్పందన వచ్చింది. గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యజ్ఞోపవేత పూజలు, మాంగల్యధారణ కార్యక్రమూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగా దక్షిణామూర్తి హోమాలు నిర్వహించారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల నిత్యకళ్యాణం దృశ్యం

## మృత్యుంజయినికి షోడషాభిషేకాలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడి మృత్యుంజయ స్వామి ఆలయంలో వర్షాభావంతో ఈ ప్రాంతాలు తల్లడిల్లుతున్నపుడు ఇక్కడ స్వామికి పూజలు నిర్వహించే వారు. ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు నివృత్తి కోసం పూజలు నిర్వహించటం ఆనవాయితి. స్వామి అమ్మవార్లకు పలు రకాల సుగంధ పరిమళ పుష్పాలు, గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయమానంగా అలంకరించి ధూప, దీపనైవేద్యాలను మహామంగళ హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

# వరలక్ష్మీ వ్రతానికి అపోలో పట్టువస్త్రాలు



స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను అందిస్తున్న అపోలో చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి

**శ్రీకాళహస్తి, అక్టోబరు 17 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి ప్రతి ఏడాది అపోలో ప్రతినిధులు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందించే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో దీపావళి సందర్భంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 21న ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు అపోల చైర్మన్ ప్రతాప్‌సి రెడ్డి శుక్రవారం స్వామి అమ్మవార్లకు సుమారు రూ.40 వేల విలువ చేసే పట్టువస్త్రాలను అందించారు. ఇక్కడ ధర్మకర్తల మండలి సభ్యులు డాక్టర్ ప్రమీలమ్మ ఉన్నపుడు ఆలయానికి అపోలో సంస్థల నుంచి విరాళాలు అందిస్తున్నారు. అప్పటి వరకు ఉత్సవాలకు సంబంధించి వెండి నంది వాహనాన్ని అందించారు. శుక్రవారం పట్టువస్త్రాలను సంప్రదాయ బద్ధంగా ఆలయ ఇఒ డి.బాపిరెడ్డికి అందించారు. ఈ కార్యక్రమాల్లో ప్రతాప్ సి రెడ్డితో పాటు మాజీ ధర్మకర్తల మండలి సభ్యురాలు డాక్టర్ ప్రమీలమ్మ, సధాకర్‌రెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డి, ఆలయ ఎఇఒ మోహన్ పాల్గొన్నారు.

# తిరుమలలో కాకినాడ జిల్లా వాసి అదృశ్యం

**తిరుమల, అక్టోబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఓ కుటుంబం నుండి వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఉదంతం శుక్రవారం అతని కుటుంబసభ్యులు తిరుమల 2టౌన్ పోలీసులకు ఫిర్యాదుతో వెలుగు చూసింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం నీలపల్లికి చెందిన పల్లా శ్రీనివాస్(32) కుటుంబంతో కలసి ఆగస్టు 1న తిరుమలకు వచ్చాడు. 2వ తేదీ ఇద్దరు పిల్లలు, భార్యతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. పిఎసి 1 అన్నప్రసాదం భవనం వద్ద భార్యపిల్లలను కూర్చోబెట్టి తిరిగి రాలేదు. ఆ తరువాత కుటుంబసభ్యులు తిరుమలలో, తిరుపతిలో వెదికినా ఫలితంలేదు. చివరకు స్వగ్రామం చేరుకుని ఆరా తీశారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో శుక్రవారం తిరుమలకు వచ్చి 2టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈచూకీ తెలిస్తే తిరుమల 2టౌన్ సిఐ 94407 96772, 0877- 2289031, పల్లా కుటుంబ సభ్యులు ఈశ్వర్‌రావు 95500 02106 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

## హైదరాబాద్- బెళగావి మధ్య

# ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 17 ప్రభాతవార్త:** ప్రయాణీకుల చాలాకాలంగా ఎదురుచూస్తున్న హైదరాబాద్- బెళగావి- హైదరాబాద్ రైలు సర్వీసులను నడిపేందుకు రైల్వేశాఖ ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే హైదరాబాద్- కొల్హాపూర్- హైదరాబాద్ మధ్య తిరిగే ఎక్స్‌ప్రెస్‌ను కొద్దిరోజుల పాటు కొల్హాపూర్/ బెళగావి- మణుగూరు మధ్య నడిపి కరోనా సమయంలో రద్దు చేశారు. నాటి నుంచి ఈరైలు సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణీకులు కోరుతున్నారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ప్రయాణీకుల సౌకర్యార్థం హైదరాబాద్- బెళగావి- హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడపాలని నిర్ణయించింది. హైదరాబాద్ నుంచి బెళగావి వెళ్ళే నెంబర్ 07043 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 23 నుంచి నవంబర్ 27 వరకు ప్రతి గురువారాల్లో సాయంత్రం 04:30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 10:30 గంటలకు బెళగావి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెళగావి నుంచి హైదరాబాద్ వెళ్ళే నెంబర్ 07044 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 24 నుంచి నవంబర్ 28 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 01:00 గంటలకు బెళగావి నుంచి బయలుదేరి శనివారం ఉదయం 07:00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యంలో బేగంపేట్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, సూలేహళ్ళి, యాద్గీర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం, ఆదోని, (గుంతకల్లు బైపాస్ మీదుగా) బళ్ళారి, తోరణగళ్ళు, హోస్పేట, కొప్పళ్, భాణాపూర్, గదగ్, హుబ్లీ, ధార్వాడ్, ఆల్నవార్ స్టేషన్లలో నిలుస్తాయి.

# లడ్డూ 'ధర' పెంపు వార్తలు నమ్మొద్దు


## టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు విజ్ఞప్తి

**తిరుమల, అక్టోబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల లడ్డూ "ధర" పెంపు పై కొన్ని మీడియా చానెళ్ళు తప్పుడు వార్తలు ప్రసారం చేయడంపై తిరుమల తిరుపతి దేవస్థానం తీవ్రంగా స్పందించింది.



లడ్డూ ధరల పెంచే యోచనపై వస్తున్న తప్పుడు వార్తలు నమ్మొద్దని, బాధ్యతారాహిత్యమైన మీడియా చానెళ్ళు ఏమాత్రం జాగ్రత్త లేకుండా దుష్ప్రచారాలు చేయడం మంచిదికాదని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా ఖండించారు. లడ్డూ ప్రసాదం ధరను పెంచే ఆలోచన, ప్రణాళిక టిటిడికి లేదని పునరుద్ఘాటించారు. కాగా ఇదివరకు టిటిడిలో కొనసాగిన తెలుగుదేశం ప్రభుత్వంలోని టిటిడి పాలకమండళ్ళు ధరలు పెంచిన సందర్భాలు లేదు. లడ్డూ ధరలను, కొన్ని ప్రత్యేక సేవల టిక్కెట్లు ధరలు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని టిటిడి బోర్డులు పెంచడం విశేషం. ఇప్పటికే తిరుమల లడ్డూ ధర రూ50లకు గతంలోని టిటిడి బోర్డు పెద్దలు పెంపుచేసి సామాన్యభక్తులకు భారంగా మార్చారు. భక్తుల మనోభావాలతో ముడిపడిన విషయాలపై మీడియా ఛానెళ్ళు బాధ్యతను తెలుసుకుని ఒకటికి రెండుసార్లు పరిశీలించాలన్నారు. సామాన్య భక్తుల కోసం పలు రకాలుగా విధానాలు అమలుచేసి సులభ దర్శనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

## డీజే తెచ్చిన ప్రమాదం



# భవానిపురంలో కూలిన పోర్టికో

- ఆరుగురికి తీవ్ర గాయాలు... ఇద్దరు పరిస్థితి విషమం

**నరసన్నపేట (శ్రీకాకుళం జిల్లా), అక్టోబరు 17 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పట్టణంలోని భవానిపురం వీధిలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న నందన్న నవరాత్రి ఉత్సవాలు ముగింపు రోజు ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన ఉత్సవాలలో గురువారం అర్ధరాత్రి పెను ప్రమాదం సంభవించింది. ఆరుగురు తీవ్ర గాయాలు పాలయ్యారు. ఊరేగింపు వైభవంగా నిర్వహించేందుకు వీధివాసులు డిజె ఏర్పాటు చేశారు. డిజె శబ్దాలతో ఉత్సాహంగా సాగుతున్న ఊరేగింపు యాత్ర వీధి చివరికి చేరుకునేసరికి డిజె శబ్దాలకు ఓ రెండంతస్తుల భవనం పోర్టుకో అకస్మాత్తుగా కూలిపోయింది. పోర్టుకో శిథిలాలు మీద పడి బండి సంతోష్, బండి పూర్ణ, బాలకృష్ణ, పన్నీర్ చిరంజీవి, రాధా, అమృత, సోనియా నలిగిపోయారు. వీరిలో ఆరుగురు పరిస్థితి విషమంగా ఉండడంతో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుండి శ్రీకాకుళం, అతి తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని విశాఖపట్నం తరలించారు. సంఘటనా స్థలానికి హుటాహుటిన నరసన్నపేట సిఐ శ్రీనివాసరావు, ఎస్సై దుర్గాప్రసాద్ చేరుకుని సహజ చర్యలు చేపట్టారు. సంఘటనపై నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నరసన్నపేట నియోజకవర్గ యువనాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య వెంటనే స్పందించి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. సంఘటనా టెక్కలి డిఎస్పి లక్ష్మణరావు, క్లూస్ టీం సిబ్బంది పరిశీలించారు. జరిగిన సంఘటన వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పంచారామాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజ్

## టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య

**విజయవాడ, అక్టోబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** కార్తీక మాసం సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పంచారామాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజ నల్ మేనేజర్ కృష్ణ చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తి, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతకు ప్రసిద్ధి చెందిన కార్తీక మాసం శుభ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక పంచారామాల టూర్ ప్యాకేజీని ప్రకటించటం జరిగిందన్నారు. పంచారామాలు (ఐదు పురాతన శివాలయాలు) గొప్ప మత, సాంస్కృతిక వారసత్వాన్ని సూచిస్తాయని, కార్తీక మాసంలో ఈ దేవాలయాలను సందర్శించడం అపారమైన దైవిక ఆశీర్వాదాలను ఇస్తుందని భక్తులు నమ్ముతారన్నారన్నారు. భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన మరియు ఆధ్యాత్మిక, సంతృప్తికర తీర్థయాత్రను అందించడానికి పర్యాటక శాఖ ప్రత్యేక టూర్ ప్యాకేజీలో శ్రీ అమర



లింగేశ్వర స్వామి అమరావతి, సోమేశ్వర స్వామి భీమవరం, క్షీరా రామలింగేశ్వర స్వామి పాల కొల్లు, భీమేశ్వర స్వామి ద్రాక్షారామం, కుమార రామ స్వామి, సామర్లకోట పంచా రామ క్షేత్రాలు ఉన్నాయ న్నారు. కార్తీకమాసంలో ప్రతి సోమవారం విజయ వాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న టూరిజం కేంద్ర రిజర్వేషన్ కార్యాలయం నుండి ఈ నెల అక్టోబర్ 27, నవంబర్ 3, నవంబర్ 10, నవంబర్ 17 సోమవారం తేదీల్లో బస్సులు బయలుదేరతాయన్నారు. పెద్దలకు: రూ.2130/, పిల్లలు: రూ.1760 ధర ఉంటుందన్నారు. వీటితోపాటు ప్రతి శనివారం విజయవాడ నుండి వాడపల్లి వరకు ప్యాకేజీ టూర్‌ను పర్యాటక శాఖ నిర్వహిస్తోందన్నారు. బుకింగ్‌ల కోసం, ఇతర వివరాలకు 98480 07025, 84990 54422, 1800 42545454 పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య ఆ ప్రకటనలో తెలియజేశారు.

# పోలీసులకు వ్యాయామం అవసరం

**● డిజిపి హరీష్ కుమార్ గుప్తా ● ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ● విజేతలకు బహుమతుల ప్రదానం**



**విజయవాడ, అక్టోబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసు నిరంతరం ఉత్సాహంగా ఉండాలంటే వ్యాయామం అవసరమని ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా స్పష్టం చేసారు. క్రీడలు, యోగా వంటివి మంచి ఆరోగ్యాన్నిస్తాయన్నారు. అందుకే రోజులో కొద్దిసేపు ఆటలకు, నడక ఇతర అంశాలకు కేటాయించాలన్నారు. డ్రిల్‌తో పాటు ఇవన్ని వ్యాయామ అంశాలు కావాలన్నారు. ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో అక్టోబర్ 13 నుండి 17 వరకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండవ ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025-26 పోటీలు ముగిశాయి. మంగళగిరి 6వ బెటాలియన్, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర డీజీపీ, చైర్మన్ (రెండవ ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025-26) హరీష్ కుమార్ గుప్తా వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగ పోటీల్లో గెలిపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్‌లో పోటీపడుతున్న పోలీస్ క్రీడాకారుల ప్రతిభ, క్రమశిక్షణ, పట్టుదల అందరికీ స్ఫూర్తినిచ్చాయన్నారు. అతిథ్యం, వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ బృందాన్ని డీజీపీ ఈ సందర్భంగా అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) గుంటూరు యోగ పోటీలు వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) అమరావతి వేదికగా జరిగిన విషయం విదితమే. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సీపీవోల నుంచి వచ్చిన 32 టీమ్‌లకు చెందిన 1010 మంది క్రీడాకారులు ఈ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్‌లో పాల్గొన్నారు. వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్‌లో (పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ మరియు యోగాలో) అత్యధికంగా 37 పతకాలు సాధించి ఉత్తర్‌ప్రదేశ్ మొదటిస్థానంలో నిలిచింది. 33 పతకాలతో బీఎస్ఎఫ్ ద్వితీయస్థానంలో 20 పతకాలు సాధించి ఐటీబీపీ తృతీయస్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ 11 పతకాలతో 6వ స్థానంలో నిలిచింది. యోగాలో బీఎస్ఎఫ్ చెందిన సోనియాకుమారి వ్యక్తిగత విభాగంలో అత్యధిక పతకాలు సాధించింది. యోగా పురుషుల విభాగంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజీవ్ కుమార్ అత్యధిక పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణలో పాలుపంచుకున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, వేలూరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (విట్) అమరావతి, యాజమాన్యానికి డీజీపీ కృతజ్ఞతలు తెలిపారు.

# జర్నలిస్టులు ప్రశ్నించే తత్వాన్ని కొనసాగించాలి

**- మీడియా అకాడమీ చైర్మన్ అలపాటి సురేష్**



**అనంతపురం, అక్టోబరు 17 ప్రభాతవార్త బ్యూరో:** ప్రజా హితం కోసం ఉపయోగపడేలా జర్నలిస్టులు వార్తలు రాయాలి అని, వృత్తి ధర్మాన్ని నిర్వర్తించేందుకు ఎప్పుడు జర్నలిస్టులు ప్రశ్నించే తత్వాన్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో రెండురోజుల పునశ్చరణ తరగతులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ నిబద్ధత, నేర్చుకోవాలన్న తపన, నిత్య విద్యార్థిగా విలేఖరులకు వుండాలని సూచించారు . జర్నలిజం వృత్తి లో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగేందుకు ఎంతో నిబద్ధత కలిగివుండాలని ఆయన సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాత్రికేయ వృత్తిలో రాణించాలని కోరారు. ఆంధ్రజ్యోతి అనంతపురం ఎడిషన్ ఇంచార్జ్ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం ఉద్యోగం కాదని వృత్తి అని పేర్కొన్నారు. వేసే ప్రతి అడుగులో వ్యవస్థలో లోపాన్ని ఎత్తి చూపడం ద్వారా సామాజిక అభ్యుదయానికి కట్టుబడి ఉండాలని సూచించారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు మాట్లాడుతూ సంఘటనా స్థలాన్ని సందర్శించి రాసే వార్తలు ప్రజల మన్ననలు పొందుతాయన్నారు. మండల విలేఖరులు వారానికి ఒక్క రోజైనా విధిగా రెండు గ్రామాల్ని సందర్శించి ప్రజల సాధకబాధకాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రశ్నించడం అనేది విలేఖరుల హక్కుగా గుర్తించాలని అది వారి వ్యక్తిత్వంలో భాగమైపోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పయ్యావుల ప్రవీణ్, అయూబ్, జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్.భోగేశ్వర్ రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే నేతలు సనప రామకృష్ణ, కెపి కుమార్, చలపతి, చౌడప్ప, రాయదుర్గం నాయకులు కమలాక్షుడు, గురురాఘవేం ద్ర, కె.ఎల్.ప్రసాద్, కర్నూలు జిల్లా నేతలు నాగరాజు, రాజు ఇతర ముఖ్యులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ కార్యక్రమానికి జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# విద్యుదాఘాతంతో ఇంటర్ విద్యార్థి మృతి



**కావలి (నెల్లూరు), అక్టోబరు 17 ప్రభాతవార్త:** విద్యుత్ ఘాతంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బోయిన దత్తాత్రేయ (17) మృతి చెందాడు. నెల్లూరు జిల్లా కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు కావలి రూరల్ మండలం, రాజువారి చింతల పాలెం గ్రామానికి చెందిన బోయిన మాల్యాద్రి కుమారుడు కావలి శ్రీ సాయి కో ఆపరేటివ్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతూ ఉన్నాడు. తన తల్లి అమీనా గత 15 రోజుల క్రితం మృతి చెందారు. గురువారం వారి స్వగృహంలో జరిగిన వారి తల్లి ఉత్తర క్రియలలో పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం నీళ్ల మోటర్ ఆన్‌చేసి చూడగా, నీళ్ల రావడంలేదని మోటర్ విప్పదీసి చూస్తుండగా ఒకసారిగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కావలి రూరల్ ఎస్సై బాజీబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భాషాభ్యుదయం కోసం సంఘటితంగా కృషి చేయాలి

**ప్రపంచ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి జీవీ పూర్ణచంద్**

**విజయవాడ, అక్టోబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** భాషాభ్యుదయం కోసం జరిగే కృషి సంఘటితంగా ఉండాలని ప్రపంచ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి డా. జి.వి. పూర్ణచందు ఉద్ఘాటించారు. మాతృభాష పరిరక్షణకు అందరు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీ ృశ మహా సంకల్పంతో, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సహకారంతో మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ నిర్వహణలో నవంబరు 22, 23 తేదీలలో విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగనున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు ఆహ్వానించడం కోసం శుక్రవారం విజయవాడలో ప్రపంచ రచయితల సంఘం కార్యదర్శి, శతాధిక గ్రంథకర్త డా. జి.వి.పూర్ణచందుని ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ కలిశారు. విజయవాడలో సాహిత్యం, సంస్కృతి, కళలు మరింతగా పరిఢవిల్లజేసేందుకు తలపెట్టిన రెండు రోజుల సాంస్కృతిక మహాయజ్ఞంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. అలాగే ఈ ఉత్సవాల్లో వెలువరించబోతున్న ప్రత్యేక సంచికకు బెజవాడను గురించిన సమాచారంతో వ్యాసం రాయాలని, ప్రపంచ రచయితల మహాసభలు నిర్వహించిన అనుభవంతో మాకు సలహాలివ్వాలని పూర్ణచందుని కోరారు. నాలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఈ ఉత్సవాలకు రావడానికి పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని కలిమిశ్రీ తెలిపారు. అందుకు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేసిన డా.పూర్ణచందు ఈ సాంస్కృతిక మహోత్సవాలను విజయవంతం చేయడంలో తన వంతు సహకారాన్ని అందిస్తానని, అలాగే ప్రత్యేక సంచికకు ఇంతకు ముందు ఎవరూ రాయనటువంటి అరుదైన సమాచారంతో మంచి వ్యాసం రాసి పంపుతానని ధైర్యాన్నిచ్చారు. ఈ కలయికలో సీనియర్ జర్నలిస్ట్ డి.స్వాతి, ఉత్సవాల కమిటీ బాధ్యులు చొప్పా రాఘవేంద్రశేఖర్, పి.చిదంబరం, వై.డి.ఆనంద్ పాల్గొన్నారు.

# కలుషిత ఆహారం... పలువురికి అస్వస్థత



**అంబాజీపేట, అక్టోబరు 17 ప్రభాతవార్త:** రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవనాదారం గడుపుతున్న కూలీలు ఫుడ్ పాయిజన్ బారిన పడ్డారు. ఆ కూలీలు అంబాజీపేటలో ఉన్న ఒక హుటల్ నుండి తీసుకు వచ్చిన టిఫిన్లు తిని బుధవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. గురువారం స్థానిక వైద్యులతో చికిత్స చేయించుకున్నప్పటికీ వారికి స్వస్థత చేకూరకపోవడంతో అంబాజీపేట, అమలాపురం లోని ప్రైవేటు ఆస్పత్రిలలో చికిత్స పొందుతు న్నారు. కాగా శుక్రవారం రాత్రి అంబాజీపేటలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మాచవరంకు చెందిన 12 మంది బాధితులు చికిత్స పొందుతూ కోలు కుంటున్నారు. ప్రస్తుతానికి వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు చెబుతు న్నారు. చికిత్స పొందుతున్న వారిలో కుసుమే యమున కుమారి, అరిగెల నాగలక్ష్మి ్ర, యలమంచలి సత్యనారాయణ, యలమంచలి తాతారావు, కుసుమ శ్రీ ఆకాష్, నేలపూడి విజయ కుమారి, కుసుమ భవాణి, సరేళ్ల నాగలక్ష్మి, యలమంచలి నాగరత్నం, కుసుమ విమల కుమారితోపాటు మరో 10 మంది అమలాపురంలోని వివిధ ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు.

**ఫుడ్ పాయిజిన్‌పై భిన్న కథనాలు**

అంబాజీపేటలో బుధవారం కలకలం రేపిన ఫుడ్ పాయిజిన్‌కు సంబంధించి ఓ వైపు బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే ఈ సంఘటనకు సంబంధించి మరో వైపు భిన్న కథనాలు వినపడు తున్నాయి. హోటల్ నుండి తెచ్చిన టిఫిన్ వల్లే ఫుడ్ పాయిజన్ జరిగిందిని కొంత మంది బాధితులు ఆరోపిస్తుంటే మరికొంత మంది మాచ~వరంలో తయారు చేస్తున్న బెల్లం తయారీ కేంద్రం లో వెలువడిన వాయివుల వల్ల ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారని బాధిత బంధువులు చెబుతున్నారు. కాగా రెండు రోజులు క్రితం అమలాపురంలో జరిగిన ఫుడ్ పాయిజన్‌కు సంబంధించి అధికా రులు దాడులు చేస్తున్న తరుణంలో అంబాజీపేట లో కూడా ఫుడ్ పాయిజన్ జరగడం, శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందడం కలకలం రేపింది. ఆస్పత్రిలో బాధితుల నుండి పి.గన్నవరం సీఐ ఆర్. భీమరాజు, ఎస్సై లు కె.చిరంజీవి, బి.శివకృష్ణలు వివరాలు సేకరించారు.

**మీ అబ్బాయికి ప్రమాదం జరిగిందంటూ**

# రూ.35.23 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** 'మీ కొడుక్కి ప్రమాదం జరిగిందంటూ' తాజాగా ఓ మహిళ నుంచి లక్షల్లో డబ్బులను సైబర్ నేరగాళ్లు కాజేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. నగరంలో 61ఏళ్ల వృద్ధురాలు నివాసం ఉంటుంది. ఆమె కొడుకు లండన్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తాజాగా స్టీవ్ అనే వ్యక్తి ఆ పెద్దావిడకు వాట్సాప్ కాల్ చేశాడు. లండన్‌లో వైద్యుడిగా పరిచయం చేసుకున్నాడు. విమానాశ్రయంలో ఆమె కుమారుడికి ప్రమాదం జరిగిందని, తలకు బలమైన గాయమైందని చెప్పారు. లగేజ్ మిస్ అవ్వడంతో ఎలాంటి ఐడెంటిటీ లేదని, ఆసుపత్రిలో వైద్యులు చేర్చుకోవట్లేదని చెప్పిన నేరగాళ్లు ఆమెను భయపెట్టారు. దీంతో ఎలాగైనా తన కుమారుడికి చికిత్స అందించాలని రూ.35.23 లక్షలు ఆ వృద్ధురాలు ఆ కేటుగాళ్లకు పంపింది. తన కొడుకు ఎలా ఉన్నాడో చూసేందుకు ఫొటో, వీడియో పంపించాలని కోరగా.. అందుకు ఒప్పుకోలేదు. అనుమానం వచ్చిన బాధితురాలు కుమారుడి నెంబర్‌కు కాల్ చేసింది. తాను క్షేమంగా ఉన్నానని, ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన వృద్ధు రాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి దివ్య క్షేత్రం

**● బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు భక్త జనం ● అశ్వవాహన సేవ, చరనోత్సవంలో పాల్గొన్న ఎంపీ హరీష్ మాధుర్, రెడ్డి సుబ్రహ్మణ్యం**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 17 ప్రభాతవార్త:** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు అయిన శుక్రవారం రాత్రి స్వామి వారు కల్కి అవతారంలో అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్తంలో అర్చకులు, వేద పండితులు స్వస్తి వచనము, ప్రధాన హోమములు, శ్రీ మహాలక్ష్మి మంత్ర పూర్వక మహాలక్ష్మి హోమము, దిగ్దేవతాబలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరిపి చూర్ణోత్సవము నిర్వహించారు. దేవస్థానం డిప్యూటీ కమీషనర్, ఈఓ నల్లం సూర్య చక్రధరరావు, కనకదుర్గ, దంపతులు, చైర్మన్ ముదునూరి వెంకటరాజు, శ్రావణి దంపతులు ప్రధాన హోమాలు, పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారు కల్కి అలంకరణలో అశ్వ వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అనంత కుమారి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, స్వామి వారిని దర్శించుకుని అశ్వ వాహన సేవలో పాల్గొన్నారు. శనివారం జరగబోయే చక్రస్నాన ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వాడపల్లిలో చేసిన ఫల, పుష్ప అలంకరణ,



మెరుమిట్లు గోలిపే విద్యుత్ కాంతులతో అతి సుందర రమనీయంగా ఆలయం సుందరంగా తీర్చిదిద్దరు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేసారు.

# దుర్గమ్మవారి సేవలో తమిళనాడు గవర్నర్



**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** శ్రీ కనకదుర్గ అమ్మవారిని తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి కుటుంబంతో సహా నైవేద్యం అనంతరం శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండిత ఆశీర్వచనం పండితులు అందించగా, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం ఈవో, చైర్మన్ అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు బడేటి ధర్మారావు, రాఘవ రాజు, సరోజినీ దేవి, శ్రావణి, సరిత, ఎక్స్ అఫిషియో మెంబెర్ ఎల్.దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహా మండపం 6వ అంతస్తులో దాతల సమావేశంలో గవర్నర్ పాల్గొని, అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు.

# దుర్గమ్మవారి ఆలయాభివృద్ధికి సహకరించండి





దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** శ్రీ కనకదుర్గ అమ్మవారి సన్నిధిని మరింతగా అభివృద్ధి చేయడానికి దాతల సహకారం అవసరమని దేవస్థానం ఈవో శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు కోరారు. శుక్రవారం తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి, కీర్తిలాల్ జ్యువలరీ యాజమాన్యం, పలువురు భక్తులు, దాతలతో దేవస్థానంలో ఏర్పాటు చేసిన దాతల సమావేశంలో దేవాలయ అభివృద్ధి గురించి ప్రజెంటేషను చేసి మాట్లాడారు. పురాతన ఆలయం నుండి ప్రస్తుతం వరకు చిత్రాలు ప్రదర్శన చేసి, బంగారు గోపురం పూర్తి స్థాయిలో చేయడానికి, మల్లేశ్వరుని ధ్వజ స్తంభం స్వర్ణమయం చేయడానికి, భక్తులు నిమిత్తం ఎలక్ట్రికల్ బస్సులు విరాళాలు కొరకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు బడేటి ధర్మారావు, రాఘవ రాజు, సరోజినీ దేవి, శ్రావణి, సరిత, ఎక్స్ అఫిషియో మెంబెర్ ఎల్. దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నిత్యాన్నదానానికి విరాళాలు:**

విజయవాడకు చెందిన అశోక్ ప్రసాద్ రు.1,01,116ల విరాళాన్ని, వరద కిషోర్ రు.1,00,116 విరాళాన్ని నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఆలయాధికారులకు అందించారు. దాతలకు దుర్గమ్మ వారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.

# ప్రజాస్వామ్య మనుగడలో పోలీసులది కీలకపాత్ర

**● సైబర్ నేరాలపై నిరంతరం అప్రమత్తంగా వుండాలి ● ఐపిఎస్‌ల దీక్షాంత్ పరేడ్‌లో బిఎస్ఎఫ్ డిజి దల్జీత్ సింగ్ చౌదరి**



జాతీయ పోలీసు అకాడెమిలో శుక్రవారం జరిగిన 77వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనరీ అధికారుల దీక్షాంత్ పెరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న బిఎస్ఎఫ్ డిజి దల్జీత్‌సింగ్ చౌదరి

**హైదరాబాద్, అక్టోబరు 17 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య మనుగడలో పోలీసు వ్యవస్థది కీలకపాత్ర అని బిఎస్ఎఫ్ డిజి దల్జీత్ సింగ్ చౌదరి అన్నారు. దేశంలో అన్ని వర్గాలకు సవాల్‌గా మారిన సైబర్ నేరాల విషయంలో మరింత అప్రమత్తంగా వుండాలని యువ ఐపిఎస్‌లను ఆయన కోరారు. నగర శివార్లలోని శివరాంపల్లిలో గల సర్దార్ వల్లభ భాయి పటేల్ జాతీయ పోలీసు అకాడమిలో శుక్రవారం జరిగిన 77వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనరీ అధికా రుల దీక్షాంత్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి వారి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరి రక్షణ, నేరాల నివారణ, ఉగ్రవాదులు, తీవ్రవాదుల పీచమణచడంలో పోలీసుల పాత్ర ఎనలేనిదని, సాంకేతిక నేరాలకు అనుగుణంగా పోలీసు వ్యవ స్థ మరింతగా మెరుగు పడాలని, ఈ విషయంలో టెక్నాలజిని వాడాలని ఆయన తెలిపారు. దేశం అత్యున్నతంగా వుండేందుకు ఐపిఎస్‌లు పాటుప డాలని ఆయన కోరారు. సామాన్యులు, పీడిత ప్రజల అభ్యున్నతి వారి భద్రత కోసం ఐపిఎస్‌లు మరింత నిబద్ధతో కృషి చేయాలని ఆయన సూచి ంచారు. సైబర్ నేరాల నివారణలో టెక్నాలజిని మరింత వాడుకోవాలని, నేరగాళ్ల పీచమణిచేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. నక్స లిజం, టెర్రరిజంను అంతమొందించడంలో ఐపిఎస్ అధికారులు ఇప్పటికే సుశిక్షుతులయ్యారని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఆయన సూచించారు. పోలీసింగ్ అంటే ఒక వృత్తి కాదని, త్యాగం, సేవలకు గుర్తింపు అని ఆయన అన్నారు. యువ ఐపిఎస్‌ల ముందు ఎన్నో కఠిన సవాళ్లు వున్నాయని, వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తు లో పోలీసింగ్ స్మార్ట్ పోలిసింగ్‌గా వుండాలని, సున్నితమైనదిగా వుండాలని, ప్రజల మనస్సులను గెలిచేలా వుండాలని బిఎస్ఎఫ్ డిజి తెలిపారు. నక్సల్స్ విషయంలో దేశ వ్యాప్తంగా పోలీసు శాఖ ఇటీవల కాలంలో మంచి ఫలితాలను సాధించడంపై ఆయన సంతృప్తి చెందారు. దేశంలో వ్యవస్థీకృత నేరాలు పోలీసులకు సవాళ్లు విసురుతున్నాయని, వీటి నివారణలో పోలీసులు మరింత రాటుదేలాల్సిన అవసరం వుందని ఆయన తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందిగా మారిన పలు రకాల నేరాల విషయంలో మరింత పరిణతి సాధించాలని ఆయన కోరారు. మాదకద్రవ్యాల స్మగ్లింగ్ విషయంలో పోలీసులు మరింతగా పురోగతి సాధించాల్సిన అవసరం వుందని, డ్రగ్స్‌ను సమూలంగా అంతం చేయాలని ఆయన తెలిపారు న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా క్రిమినల్ జస్టిస్ విషయంలో ఐపిఎస్‌లు పట్టు సాధించాలని, దేశాన్ని ఐక్యంగా వుంచేందుకు నాడు సర్దార్ వల్లభ భాయి పటేల్ తొలి కేంద్ర హోం మంత్రిగా చేసిన సేవలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తుతించారు. అప్పట్లో సర్దార్ పటేల్ చేసిన అవిరళ కృషి వల్లే నేడు భారత దేశం ఉన్నతంగా వుందని ఆయన కొనియాడారు. 190 మంది అధికారులు పాల్గొన్న ఈ దీక్షాంత్ పరేడ్‌లో 174 మంది ఐపిఎస్ అధికారులు కాగా 16 మంది విదేశీ అధికారులున్నారు. వీరిలో 62 మంది మహిళలు వున్నారు. దీక్షాంత్ పరేడ్‌కు తమిళనాడు కేడర్‌కు చెందిన అంజిత్ నాయర్ నాయకత్వం వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దల్జీత్ సింగ్ చౌదరి శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచిన పరేడ్ కమాండర్ అంజిత్ నాయర్‌కు బెస్ట్ క్యాడర్ అవార్డుతో పాటు కత్తిని బహుకరించారు. ఆయనతో పాటు శిక్షణలో ప్రతిభ కనబరచిని మరికొందరు ఐపిఎస్ అధికారులకు బిఎస్ఎఫ్ డిజి ట్రోపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిజిపి శివధర్ రెడ్డితో అకాడమి డైరక్టర్ అమిత్ గార్గ్ సహా సిబిఐ, ఐబి డైరక్టర్లు, త్రివిధ దళాలకు చెందిన అధిపతులు, విశ్రాంత పోలీసు, రక్షణ బలగాల అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో ఐపిఎస్‌ల దీక్షాంత్ పరేడ్ ఆహుతులను అలరించింది.

# బోర్డ్ మెంబర్‌గా పద్మావతి ప్రమాణస్వీకారం



ఆలయ పాలకమండలిసభ్యురాలు పద్మావతి ప్రమాణస్వీకార దృశ్యం

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** ధర్మకర్త ప్రమాణ స్వీకారం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యురాలిగా పద్మావతి శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ మహా మంటపంలో గల కార్యాలయం లో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, మాజీ శాసన సభ్యులు ఎస్. ఉదయభాను, ధర్మకర్తల మండలి సభ్యులు రాఘవ రాజు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

18-10pg10exAKP 12 GNT_18-10pg10exAKP.qxd 10/17/2025 10:56 PM Page 1




# క్రికెట్‌లో మరో కొత్త ఫార్మాట్

## ఆట ఇక టెస్ట్-ట్వంటీ

### రెండు సార్లు బ్యాటింగ్, బౌలింగ్

### భారత్‌లో తొలి ఎడిషన్




**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో టెస్ట్, వన్డే, టీ20 ఫార్మాట్‌లు అధికారికంగా అభిమానులను అలరిస్తుంటే, హండ్రెడ్ బాల్, టీ10, బ్యాక్‌యార్డ్/ స్ట్రీట్ క్రికెట్, డబుల్ వికెట్ ఫార్మాట్‌లు అనధికారికంగా చలామణి అవుతున్నాయి. తాజాగా మరో క్రికెట్ ఫార్మాట్ సిద్ధమైంది. సుదీర్ఘ ఫార్మాట్‌కు మరింత ఆదరణ పెంచే యోచనలో భాగంగా ఈ సరికొత్త ఫార్మాట్‌ను రూపొందించారు. టెస్ట్ మ్యాచ్‌ను టి20 తరహాలో ఆడిస్తేఎలా అనేఆలోచనలో నుంచి పుట్టిందే ఈ సరికొత్త ఫార్మాట్. సాధారణంగా రెడ్ బాల్ క్రికెట్‌లో నాలుగు ఇన్నింగ్స్‌లను ఐదో రోజుల పాటు ఆడుతారు. అయితే ఈ సరికొత్త ఫార్మాట్‌లో 80 ఓవర్లను నాలుగు ఇన్నింగ్స్‌లుగా విభజించి టి20 ఫార్మాట్ తరహాలో ఆడించనున్నారు. ఇరు జట్లు రెండు సార్లు బ్యాటింగ్ చేయడంతో పాటు బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫార్మాట్‌కు టెస్ట్ ట్వంటీ అని నామకరణం చేశారు. ఈ నయా ఫార్మాట్‌ను ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మాథ్యూ హెడెన్, భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్‌తో పాటు, దిగ్గజ క్రికెటర్ సర్ క్లైవ్ లాయిడ్ ఆవిష్కరించారు. ఈ ఫార్మాట్ సరికొత్తగా ఉంటుందని, ఈ ఛాంపియన్‌షిప్ తొలి రెండు ఎడిషన్స్ భారత్‌లోనే జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తొలి ఎడిషన్ జనవరి 2026లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

కాగా క్రికెట్‌ను మతంలా భావించే భారత్‌లోనే ఈ సరికొత్త ఫార్మాట్‌ను ప్రవేశపెట్టడం సరైందిగా తాము భావించామని ఈ ఛాంపియన్‌షిప్ నిర్వాహకుడు గౌరవ్ బహీర్వాణి తెలిపారు. ఈ ఫార్మాట్‌ను సక్సెస్ చేసిన తర్వాత విదేశాలకు విస్తరిస్తామని చెప్పారు. క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతోనే ఈ ఫార్మాట్‌ను రూపొందించామని పేర్కొన్నారు. మరోవైపు ఈ ఫార్మాట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు బాగుందంటుంటే, మరికొందరు మాత్రం తప్పుబడుతున్నారు. ఇది టెస్ట్ క్రికెట్‌ను చంపడమేనని, ఈ ఫార్మాట్‌రాకతో టెస్ట్ క్రికెట్ పూర్తి చచ్చిపోతుందని హెచ్చరిస్తున్నారు. ఈ ఫార్మాట్‌కు సగం రెడ్, సగం వైట్ బాల్ ఉపయోగిస్తారా? అని సెటైర్లు పేల్చుతున్నారు. అయితే ఈ ఫార్మాట్‌కు ఐసిసి, క్రికెట్ దేశాల బోర్డుల ఆమోదం కానీ లేదు. సక్సెస్ అయితే భవిష్యత్తులో ఈ ఫార్మాట్‌కు ఐసిసి గ్రీన్ సిగ్నల్ ఇవ్వచ్చు.



# జోహోర్ కప్ ఫైనల్‌కు భారత్

## మలేసియాపై 1-2 తేడాతో విక్టరీ

**న్యూఢిల్లీ:** సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్-2025లో మలేషియాపై విజయంతో భారత్ ఫైనల్‌కు చేరుకుంది. జోహోర్ బహ్రులో శుక్రవారం జరిగిన సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్ చివరి గ్రూప్ మ్యాచ్‌లో భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు ఆతిథ్య మలేషియాతో తలపడింది. ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో, రెండవ క్వార్టర్‌లో గుర్జోత్ సింగ్ గోల్స్‌తో, ఆ తర్వాత రోషన్ కుజుర్ చివరిలో గెలిచిన గోల్స్‌తో భారత్ మలేషియాను 2-1తో ఓడించింది. దీనితో భారతదేశం 5 ఆటలలో 10 పాయింట్లతో పూల్ దశను ముగించింది. ఫలితంగా సెప్టెంబర్ 18న ఆస్ట్రేలియాతో జరిగే టోర్నమెంట్ ఫైనల్‌కు భారత్ జట్టు అర్హత సాధించింది. భారత్ అర్ధభాగంలో తొమ్మిది పెనాల్టీ కార్నర్‌లను పొందింది, కానీ ఒకదాన్ని మాత్రమే గోల్‌గా మార్చగలిగింది. రెండో క్వార్టర్‌ను దూకుడుగా ప్రారంభించిన భారత్ వరుసగా రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. కానీ మొదట మలేషియా గోల్ కీపర్, ఆ తర్వాత అరైజీత్ హుందాల్ డిఫ్లెక్షన్ షాట్‌ను క్రాస్ బార్ తిరస్కరించారు. 22వ నిముషంలో గుర్జోత్ పెనాల్టీ కార్నర్ సేవ్ నుండి రీబౌండ్ ద్వారా భారత స్కోరింగ్‌ను ప్రారంభించి గోల్ చేయడంతో భారత్ 1-0 తో ఆధిక్యం సంపాదించింది. భారత డిఫెండర్లు తమ సర్కిల్‌ను క్లియర్ చేయలేకపోవడంతో మలేషియా వింగర్‌కు ప్రయోజనం చేకూర్చింది. 43వ నిముషంలో అతను అద్భుతమైన బేస్‌లైన్ పరుగుతో ఆపై గోల్ చేయడంతో 1-1తో స్కోరు సమం అయింది. 48వ నిముషంలో రోసన్ కుజుర్ గోల్ తో భారత్ 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

# 2008 తర్వాత పతకం సాధించిన తొలి అమ్మాయి తన్వి



**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025లో తన్వి శర్మ సంచలనం సృష్టించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌కు చెందిన సాకి మట్సు మోటోను ఓడించి, 2008 తర్వాత ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో సింగిల్స్ పతకం గెలుచుకున్న తొలి భారతీయ అమ్మాయిగా పదహారేళ్ల తన్వి శర్మ నిలిచింది. 46 నిమిషాల పాటు జరిగిన మూడు గేమ్‌ల థ్రిల్లర్‌లో మొదటి సీడ్ అయిన తన్వి 13-15, 15-9, 15-10 తేడాతో జపనీస్ క్రీడాకారిణిని ఓడించింది. ఇప్పుడు కాంస్య పతకం ఖాయమైన తన్వి, గౌహతిలో జరుగుతున్న 2025 ఎడిషన్‌లో భారతదేశం యొక్క మొదటి పతకాన్ని కూడా నిర్ధారించింది. 2008లో పూణేలో జరిగిన ఎడిషన్‌లో సైనా నెహ్వాల్ స్వర్ణం సాధించిన తర్వాత ఇది భారతదేశానికి తొలి సింగిల్స్ పతకం కావడం విశేషం. కాగా ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో సింగిల్స్ పతకం గెలుచుకున్న భారతీయ అమ్మాయిల జాబితాలో అపర్ణ పోపట్ (వెండి, 1996, సిల్క్‌బోర్గ్), సైనా నెహ్వాల్ (రజతం, 2006, ఇంచియాన్), సైనా నెహ్వాల్ (స్వర్ణం, 2008, పూణే), తన్వీ శర్మ (కాంస్యం, 2025, గౌహతి).

# రంజీ ట్రోఫీలో కర్ణాటకపై సౌరాష్ట్ర ఆధిక్యం



**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ 2025-26లో సకారియా రియర్‌గార్డ్ వీరోచిత ప్రదర్శనతో కర్ణాటకపై సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఉంది. చేతన్ సకారియా, యువరాజ్‌సిన్హ్ దోడియా చివరి వికెట్‌కు 34 పరుగులు జోడించడంతో సౌరాష్ట్ర స్వల్ప ఆధిక్యంతో ముగిసింది. శుక్రవారం నిరంజన్ షా స్టేడియంలో జరిగిన గ్రూప్ బి రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో చివరి రోజు సౌరాష్ట్ర కర్ణాటకపై కీలకమైన నాలుగు పరుగుల తొలి ప్రారంభ ఆధిక్యాన్ని సంపాదించింది. సకారియా, యువరాజ్ సిన్హ్ దోడియా 14.3 ఓవర్లు ఉత్కంఠభరితంగా బ్యాటింగ్ చేశారు. కర్ణాటక బౌలర్లను ఈ జంట దృఢంగా ఎదుర్కొని క్రీజులో స్థిరంగా నిలబడ్డ మొదటి దశలో 36 పరుగులకు చేరుకుని జట్టు స్కోరును పెంచింది. అంతకుముందు, ఓవర్‌నైట్ బ్యాటర్లు అర్పిత్ వాసవాడ, ప్రేరక్ మన్కడ్ స్కోరును తగ్గించారు.

అయితే, శ్రేయస్ మన్కడ్ ముందుండి 66 పరుగుల ఐదవ వికెట్ భాగస్వామ్యాన్ని ముగించాడు. ఆ తర్వాత సమ్మర్ గజ్జర్ వాసవాడతో జత కలిసి స్కోరు బోర్డును ముందుకు తెచ్చాడు. కానీ శ్రేయస్ మళ్ళీ వాసవాడను అవుట్ చేసి 54 పరుగుల ఆరో వికెట్ భాగస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేశాడు. శ్రేయాస్ చేతిలో ధర్మేంద్ర జడేజా, జయదేవ్ ఉనద్కట్ ఎడమచేతి వాటం స్పిన్నర్ శిఖర్ శెట్టి చేతిలో ఔటయ్యారు. దీనితో సౌరాష్ట్ర ఎనిమిది వికెట్లకు 318 పరుగులు చేయడంతో ఇంకా 54 పరుగులు వెనుకబడి ఉంది. దీనికి ప్రతిస్పందనగా, కర్ణాటక తన రెండవ ఆటలో ఒక వికెట్ నష్టానికి 89 పరుగులతో రోజును ముగించి ఆధిక్యాన్ని 85కి పెంచింది.

# జపాన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్ నుంచి ఒసాకా ఔట్



**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్‌లో టాప్ సీడ్ నవోమి ఒసాకా ఎడమ కాలు గాయం కారణంగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ నుండి వైదొలిగింది. జపాన్ ఓపెన్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన సుజాన్ లామెన్స్‌తో శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన నవోమి ఒసాకా వైద్య నిమిత్తం విరామం కోరే ముందు నొప్పితో బాధప డింది. మొదటి రెండు సెట్లను లామెన్స్ తో విభజించిన తర్వాత, ఒసాకా మూడవ సెట్ లో 5-0 ఆధిక్యంలో నిలి చింది. కానీ లామెన్స్ 0-5 మరియు 30-15తో సర్వ్ చేస్తున్న ర్యాలీలో, ఒసాకా తన ఎడమ కాలులో స్పష్టమైన సమస్య ముందుకు వచ్చింది. లామెన్స్ బ్యాక్ హ్యాండ్ వైడ్ పంపిన ప్పటికీ, తదుపరి పాయింట్ తర్వాత మెడికల్ టైమ్ అవుట్ కోసం అభ్యర్థించడంతో ఆమె పాయింట్ గెలుచుకుంది. నాలుగుసార్లు మేజర్ విజేత అయిన ఒసాకా, పరిమితులతో కోర్టుకు తిరిగి వచ్చింది కానీ తన మూడవ మ్యాచ్ పాయింట్‌ను ముగించగలిగింది. మ్యాచ్‌కు ముందు ఆమె వైదొలగడం వల్ల జాక్వెలిన్ క్రిస్టియన్ వాకోవర్ పై సెమీఫైనల్ కు చేరుకుందని వరల్డ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రకటించింది. ఇక సెప్టెంబర్ చివరలో జరిగిన చైనా ఓపెన్‌లో ఒసాకా రెండో రౌండ్‌లోను, గత వారం వుహాన్ ఓపెన్‌లో కూడా రెండో రౌండ్‌లో ఓడిపోయింది. కాగా జపాన్ ఓపెన్‌లో శుక్రవారం జరిగిన మరో క్వార్టర్ ఫైనల్‌లో, 2021 యుఎస్ ఓపెన్ ఫైనలిస్ట్ లేలా ఫెర్నాండెజ్ 7-6 (2), 6-3 తేడాతో రెబెక్కా ప్రామ్‌కోవాను ఓడించింది.

# ఐటి రంగంలో 60వేల మందికి ఉద్వాసన..

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** భారత ఐటీ పరిశ్రమలో మరోసారి లేఆఫ్స్ భూతం కోరలు చాస్తోంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, ప్రాజెక్టుల కొరత, కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంతో దిగ్గజ కంపెనీలు సైతం ఉద్యోగులను తొలగించేందుకు వెనుకా డటం లేదు. ఈ ఏడాది చివరి నాటికి ఏకంగా 50,000 నుంచి 60,000 మంది ఐటీ ఉద్యోగులు తమ కొలువులు కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తుండగా, ఆ ప్రకంపనలు ఇప్పటికే దేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో మొదలయ్యాయి.




పనితీరు బాగోలేదనే నెపంతో ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా టీసీఎస్ సుమారు 6,000 మంది ఉద్యోగులను అక్రమంగా తొలగించిందని ఐటీ ఉద్యోగ సంఘాలు తీవ్ర స్థాయిలో ఆరోపిస్తున్నాయి. పారిశ్రామిక వివాదాల చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘించి, ప్రభుత్వ అనుమతి లేకుండా ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగులను ఎలా తొలగిస్తారని కిటు, ఏఐటీఈ, యునైట్ వంటి ప్రముఖ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కంపెనీ ఇటీవల విడుదల చేసిన త్రైమాసిక ఫలితాల్లో ఉద్యోగుల సంఖ్య 19,755 మేర తగ్గింది. దీనిపై టీసీఎస్ సీహెచ్‌ఆర్‌వో సుదీప్ కున్నుమల్ స్పందిస్తూ సుమారు 6,000 మంది 'అసంకల్పిత తొలగింపు' కిందకు వస్తారని, ఇది వ్యాపార అవసరాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని సమర్థించుకున్నారు. అయితే, టీసీఎస్ వాదనను ఉద్యోగ సంఘాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. ఇది 'అసంకల్పిత తొలగింపు' కాదని, పక్కా ప్రణాళికతో సాగిస్తున్న 'బలవంతపు, అనైతిక తొలగింపు' అని మండిపడుతున్నాయి. "ఉద్యోగులను అకస్మాత్తుగా ప్రాజెక్టుల నుంచి తప్పించి బెంచ్‌కు పంపుతున్నారు. అక్కడ కొన్ని గంటలు లేదా రోజుల్లోనే రాజీనామా చేయాలంటూ హెచ్‌ఆర్ విభాగం నుంచి తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. చివరకు ప్రసూతి సెలవులో ఉన్న మహిళా ఉద్యోగులను సైతం వదలడం లేదు. సెలవు పొడిగించాలని కోరితే, ఉద్యోగం నుంచి తీసేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు" అని సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ తొలగింపులపై వెంటనే విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేశారు. ఏడాది చివరికి మరింత తీవ్రం

టీసీఎస్‌లో మొదలైన ఈ కోతల పర్వం ఇతర కంపెనీలకూ విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. ప్రముఖ నియామక సంస్థ టీమ్‌లీజ్ డిజిటల్ సీఈవో నీతి శర్మ అంచనా ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో 25,000 మందిని తొలగించగా, ఈ ఏడాది ఆ సంఖ్య రెట్టింపు అయి 60,000కు చేరవచ్చు. ఇప్పటికే యాక్సెంచర్ ప్రపంచవ్యాప్తంగా 11,000 మందిని ఇంటికి పంపగా, టీసీఎస్ సైతం 2026 మార్చి నాటికి మరో 12,000 మందిని తొలగించేందుకు సిద్ధమవుతోందన్న వార్తలు ఐటీ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. మొత్తం మీద, భారత ఐటీ రంగం అత్యంత గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోందని, రాబోయే రోజుల్లో పరిస్థితులు మరింత సవాలుగా మారబోతున్నాయని స్పష్టమవుతోంది.




# హిందూస్థాన్ జింక్ రాబడులు రూ.8549 కోట్లు

## అత్యధిక రాబడుల వాటా వెండి విభాగానిదే

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** దేశవ్యాప్తంగా బంగారం తోపాటు వెండిధరలు కూడా ర్యాలీ తీయడంతో హిందూస్థాన్ జింక్ లాభాలు కూడా గణనీయంగా పెరిగాయి. వేదాంత గ్రూప్ ఆధ్వర్యంలోని గనుల కంపెనీ హిందూస్థాన్ జింక్ రెండోత్రైమాసికంలో రాబడులు 8549 కోట్లుగా ప్రకటించింది. ఒక్క వెండి పరంగానే 40శాతం లాభాల్లో వాటాతో ఉన్నట్లు చెపుతోంది. కంపెనీ నికరలాభం 2649 కోట్లుగా ఉంది. క్రమానుగతంగా 19శాతంపెరిగింది. రాబడుల్లో అత్యధిక వాటా వెండి సరఫరాదే. ఈ వాటా ఒక్కటే 1706 కోట్లవరకూ ఉంది. త్రైమాసికంవారీగాచూస్తే పదిశాతంపెరిగింది. పారిశ్రామిక, పెట్టుబడుల డిమాండ్‌పెరగడంతో 20శాతానికిపైబడింది. అందువల్లనే ఇపుడు గ్లోబల్‌సరఫరా కొరత వెండిమార్కెట్‌లో నెలకొంది. ఎంసిఎక్స్ వెండి ఫ్యూచర్స్ 70శాతంపెరిగింది. స్పాట్ మార్కెట్‌లోనే రెండు లక్ష లరూపాయలుగాకొనసాగుతోంది. కంపెనీ పన్నులచెల్లింపులకు ముందు మార్జిన్ 52శాతంగా వెల్లడించింది. టెక్నాలజీ అప్‌గ్రేడేషన్‌తో కంపెనీకి మంచి వృద్ధి నమోదు అయిందని సిఇఒ అరుణ్‌మిశ్రా తెలిపారు. అంతరాజతీయ గనులు, ఖనిజాల మండలిలో హిందూస్థాన్ జింక్ చేరడంతో తమకు ఎంతో సానుకూలం అయిందన్నారు.

# మూడో రోజూ లాభాల్లోనే సెన్సెక్స్,నిఫ్టీ

## ఎఫ్‌ఎంసిజి, హెల్త్‌కేర్, కన్స్యూమర్ రంగాల మద్దతు

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు వరుసగా మూడోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. అమెరికా బాండ్ల రాబడులు పెరగడం, రూపాయి పటిష్టం కావడం, పండుగ సీజన్ రావడంతో ఇన్వెస్టర్లు, ట్రేడర్లు కొనుగోళ్లు ముమ్మరంచేసారు. నిఫ్టీ 25,700 మార్కు దాటింది. ఎఫ్‌ఎంసిజి, హెల్త్‌కేర్, కన్స్యూమర్ డ్యూరబుల్ స్టాక్స్ కొనుగోళ్ల మద్దతు పెరిగింది. ఐటి మె టల్ కౌంటర్లు దిగువస్థాయిలోనే ముగిసాయి. నిఫ్టీ బ్యాంకు సూచీ రికార్డుస్థాయికి పెరిగింది. మేజర్ బ్యాంకుల త్రైమాసికాలు వెలువడుతుండటంతో బ్యాంకింగ్ సూచీ పెరిగింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 484.53 పాయింట్లు పెరిగి 83,951.19 పాయింట్లవద్ద ముగిసింది. నిఫ్టీ సూచీ కూడా 124.55పాయింట్లు పెరిగి 25,709.55 పాయింట్లవద్ద స్థిరపడింది. గడచిన మూడు ట్రేడింగ్ సెషన్లలోనూ సెన్సెక్స్ 2.34శాతం, నిఫ్టీ 2.24శాతం చొప్పున పెరిగాయి. మహీంద్ర 2.45శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.38శాతం, రిలయన్స్ 1.35శాతం సూచీలకు మద్దతుగా పెరిగాయి. ఇక బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.43శాతం పెరిగితే స్మాల్‌క్యాప్ సూచీ 0.49శాతం క్షీణించింది. బిఎస్‌ఇలో 1737 కంపెనీలషేర్లుపెరిగితే 2425 షేర్లు దిగజారాయి. 178 కంపెనీలు మాత్రం స్థిరంగా నిలిచాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు శుక్రవారం 88.03 వద్ద ముగిసింది. ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరు ఐదునాటికి 1.32శాతం పెరిగి 131,570వద్ద సెటిల్ అయ్యాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడి



చమురు 68 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 60.38 డాలర్లుగా కొనసాగింది. కంపెనీలపరంగా మహీంద్రా అండ్ మహీంద్రా, భారతి ఎయిర్‌టెల్, ఐటీసీ, హిందుస్తాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, టాటా స్టీల్ నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగాయి. వారంలో బీఎస్‌ఈ సెన్సెక్స్, నిఫ్టీ ఒక్కొక్కటి 1.7 శాతం పెరగ్గా.. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 2 శాతం పెరిగింది. మీడియా, ఐటీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 0.5 1శాతం తగ్గాయి. ఆటో, బ్యాంక్, హెల్త్‌కేర్, ఎఫ్‌ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.5 నుంచి ఒకశాతం పెరిగాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి సానుకూలంగా ముగియగా జపాన్ నిక్కీ 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హాంగ్ సెంగ్ నష్టాల్లో ముగిశాయి.

# కెవిబి నికరలాభం రూ.574 కోట్లు

**ముంబయి, అక్టోబరు 17:** కరూర్ వైశ్యాబ్యాంక్ రెండోత్రైమాసికంలో నికరలాభాలు 21శాతం పెంచుకని రూ.574 కోట్లునమోదుచేసింది. ప్రైవేటురంగంలోని ఈ బ్యాంకు నికరలాభం జులై త్రైమాసికంలో 474 కోట్లుగా మాత్రమే ఉంది. మొత్తం రాండులు 3320 కోట్లుగా ఉన్నాయి. కేటాయింఉలు కూడా రూ.274 కోట్లకు పెంచారు. ఏడాది క్రితం బ్యాంకు కేటాయింపుల విభాగానికి 180 కోట్లు మాత్రమే చూపించింది. కెవిబి త్రైమాసిక ఫలితాలుప్రకటించడంతో బ్యాంకు షేర్లు రూ.227.40 వద్ద స్థిరపడ్డాయి. అంతకుముందు బిఎస్ఇలో ముగింపు 0.46శాతంకంటే ఎక్కువే.

# 290 లక్షల ఫోర్డ్ కార్ల రీకాల్




**న్యూయార్కు, అక్టోబరు 17:** ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ ఫోర్డ్ అమెరికాలో 2.90 లక్షల కార్లను రీకాల్‌చేసింది. రేర్‌వ్యూ కెమేరా వ్యవస్థ చిత్రాలను స్పష్టంగాచూపించకపోవడంతో ఈకార్లన్నింటినీ రీకాల్‌చేసారు. తక్కువ వెలుతురున్న సమయాల్లో మరింత అస్పష్టంగా చిత్రాలున్నాయన్న ఫిర్యాదులు అందాయి. 2020- 2022 మధ్యకాలంలో ఉన్న ఎఫ్ 250, ఎస్‌డి, ఎఫ్350ఎస్డీ, ఎఫ్ 450 ఎస్డీ మోడల్ వాహనాలను రీకాల్ చేనస్తున్నారు. హైవే సేఫ్టీ అడ్మిని స్ట్రేషన్ సేఫ్టీ రీకాల్ రిపోర్టులో వారంటీ సమాచా రంపైనా కస్టమర్ ఫిర్యాదులు అందినట్లు తేలింది.

అయితేఫోర్ట్ కఠిన పరీక్షల నివేదికలో ఫిర్యాదుల పరంగా వచ్చిన అంశాలను పరిశీలించలేదు. ఆటోమేకర్ డీలర్లు ఇమేజ్ ప్రాసెసింగ్ మాడ్యూల్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తారని కంపెనీ ప్రకటించింది. 2026 మార్చి నాటికి మొత్తం సాంకేతిక లోపాలన్నింటినీ పరిష్కరిస్తామని కంపెనీ ప్రకటించింది.

# 100కోట్ల డాలర్లకు కోకాకోలా ఐపిఒ..

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** భారత్ బాట్లింగ్ యూనిట్లకోసం హిందూస్థాన్ కోకో కోలా బేవరేజెస్ కంపెనీ ఐపిఒకు వస్తోంది. ఇందు కోసం వందకోట్ల డాలర్లను సమీకరించేందుకు ఐపిఒకు వెళ్లాలనినిర్ణయించింది. భారత కంపెనీ విలువలను 10 బిలియన్ డాలర్లుగా మదింపుచేసారు. భారత్‌లో బహుళజాతి సంస్థల్లో అతిపెద్ద ఐపిఒగా నిలుస్తోంది. భారత్ మార్కెట్‌ను మరింతగా విస్తరించే లక్ష్యంతోనే ఈ ఐపిఒకు వస్తున్నట్లు చెపుతోంది. మొత్తం 12 రాష్ట్రాల్లో 14 ప్లాంట్లు ఉన్న కోకోకోలా 20 లక్షలమంది రిటైలింగ్ నెట్‌వర్క్‌తో కూడా నడుస్తోంది. ఐపిఒ వచ్చే ఏడాదే రావచ్చని అంచనా ఇందుకు సంబంధించి ఐపిఒ సైజు ఎంతమేర ఉండాలి, ఇష్యూధరలు వంటి వాటిపై కసరత్తులుచేస్తోంది. ఇటీవలికాలంలో బహుళజాతిసంస్థల ఐపిఒలు




మార్కెట్‌కు వస్తున్న సంగతి తెలిసిందే. హుండై మోటార్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వంటివి ఉన్నాయి. హిందూస్తాన్ కోకోకోలా హోల్డింగ్స్‌లో మైనార్టీ వాటాను జుబిలియంట్ భర్తియా గ్రూప్‌కు విక్రయిస్తోంది. భాగస్వాములను కూడా పటిష్టం చేసుకునే లక్ష్యంతోనే ఐపిఒకు వస్తున్నట్లు తెలుస్తోంది. కనీ పెట్టుబడి, కనీస కొనుగోళ్ల బిడ్లు, షేర్ల కేటాయింపు, లిస్టింగ్ తేదీలు, లీడ్‌మేనేజర్ల ఏర్పాటువంటి వాటిపై ఫోకస్ పెంచింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14